



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★




ఎప్‌స్టీన్ ఫైల్స్‌తో సాంస్కృతిక భూకంపం! 04

పత్తి రైతులకు, వస్త్ర పరిశ్రమకు తీవ్ర నష్టం
భారత్‌- అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై రాహుల్‌గాంధీ 05



సంపుటి 28, సంచిక: 234 | ఆదివారం | 15-02-2026 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00


## శుభాకాంక్షలు



పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు 'ప్రజాపక్షం' మహాశివరాత్రి శుభాకాంక్షలు

### సెలవు

మహాశివరాత్రి సందర్భంగా 'ప్రజాపక్షం' కార్యాలయానికి ఆదివారం సెలవు. సోమవారం పత్రిక వెలువడదు. పునర్దర్శనం మంగళవారం.

\- ఎడిటర్

## కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌కు

# సిపిఐ మేయర్ కాంగ్రెస్‌కు డిప్యూటీ

### చెరి రెండున్నరేళ్లు చేపట్టాలని నిర్ణయం



- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పిసిసి చీఫ్, సిపిఐ నేతల చర్చలు సఫలం
- రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా సిపిఐకి మేయర్ పదవి
- వామపక్ష శ్రేణుల్లో హర్షం

ప్రజాపక్షం / హైదరాబాద్

కొత్తగా ఏర్పాటైన కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ తొలి మేయర్ పదవి సిపిఐకి, డిప్యూటీ మేయర్ పదవి కాంగ్రెస్ పార్టీకి లభించనున్నాయి. ఈ మేరకు కాంగ్రెస్, సిపిఐల మధ్య అంగీకారం కుదిరింది. హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, పిసిసి అధ్యక్షులు బి.మహేశ్‌కుమార్ గౌడ్, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నర్సింహాలు శనివారం రాత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉభయ పార్టీలు చెరి రెండున్నర సంవత్సరాలు మేయర్ పదవిని చేపట్టాలనే నిర్ణయానికి వచ్చాయి. తొలి విడతలో సోమవారం జరిగే ఎన్నికలో సిపిఐకి మేయర్, కాంగ్రెస్ పార్టీకి డిప్యూటీ మేయర్ పదవులు దక్కుతాయి. రెండున్నర సంవత్సరాల తరువాత కాంగ్రెస్‌కు మేయర్, సిపిఐకి డిప్యూటీ మేయర్ పదవులు తీసుకునే విధంగా అంగీకారానికి వచ్చాయి. సమావేశం అనంతరం పిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్ మీడియాతో తరువాయి 2లో



## విదేశాల నుండి దిగుమతి

# రైతుల పరిస్థితి అగమ్యగోచరం

- స్వదేశీ పంటలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే
- రైతు జాగృతి యాత్ర చైర్మన్ జగ్‌జీత్ సింగ్ డల్లేవాల్
- రాష్ట్రానికి చేరుకున్న రైతు జాగృతి యాత్ర

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశీయ రైతుల నుండి పంట కొనుగోలు చేయకుండా విదేశాల నుండి దిగుమతులు చేస్తే దేశ రైతుల పరిస్థితి దెబ్బతింటుందని రైతు జాగృతి యాత్ర చైర్మన్ జగ్‌జీత్ సింగ్ డల్లేవాల్ ఆందోళన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా రైతులు పండించే పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కు చట్టబద్ధ హామీ కల్పించాలని కోరుతూ జాతీయ రైతు సంఘాల నాయకులు చేపట్టిన రైతు జాగృతి యాత్ర తెలంగాణ రాష్ట్రానికి చేరుకుంది. ఈ యాత్ర ఈ నెల 7న కన్యాకుమారిలో ప్రారంభమై తమిళనాడు, పాండిచ్చేరి, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మీదుగా తెలంగాణకు వచ్చింది. మొత్తం 20 మంది రైతు సంఘాల ప్రతినిధులు ఈ బృందంలో ఉండి, దేశవ్యాప్తంగా రైతులను ఏకం చేస్తున్నారు. యాత్రలో భాగంగా రైతు కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డితో హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్‌లో రైతు కమిషన్ కార్యాలయంలో శనివారం రైతు జాగృతి యాత్ర నేతలు జగ్‌జీత్ సింగ్ డల్లేవాలా, అభిమన్యు అజిత్ సింగ్, నాగరాజు తదితరులు భేటీ అయ్యారు. అనంతరం రైతు జాగృతి యాత్ర చైర్మన్ జగ్జిత్ సింగ్ డల్లేవాల్ మాట్లాడుతూ స్వదేశీ పంటలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. 'మేము చేస్తున్న యాత్ర కన్యాకుమారి నుండి కశ్మీర్ వరకు సాగుతుంది. మార్చి 19న ఢిల్లీలోని రాంలీల మైదానంలో పెద్ద ఎత్తున సభ నిర్వహించి, మా సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం. రైతు పంటలకు ఎంఎస్‌పికి తరువాయి 2లో



## అరవింద్‌కుమార్ ప్రాసిక్యూషన్‌కు కేంద్రం ఓకె

- ఫార్ములా ఇ-కార్ రేస్ కేసులో కీలక పరిణామం
- చార్జిషీట్‌కు సిద్ధమవుతున్న ఎసిబి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తున్న ఫార్ములా-ఇ కార్ రేస్ వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐఎఎస్ అధికారి అరవింద్ కుమార్ ప్రాసిక్యూషన్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి అధికారికంగా సమాచారం అందినట్లు తెలిసింది. దీంతో కేసు దర్యాప్తు మరింత వేగం పుంజుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే తరువాయి 2లో

## ఐక్యతే ముఖ్యం

### బంగ్లాదేశ్ పునర్నిర్మాణమే ప్రాధాన్యం

- ఇప్పుడు మనం స్వేచ్ఛాజీవులం, హక్కులు తిరిగొచ్చాయ్
- కాబోయే ప్రధాని తారిఖ్ రెహ్మాన్



**ఢాకా:** ఎన్నికల్లో తిరుగులేని మెజారిటీ సాధించిన బిఎన్‌పి (బంగ్లాదేశ్ నేషనలిస్టుపార్టీ) ఛైర్మన్, కాబోయే ప్రధానమంత్రి తారిఖ్ రెహ్మాన్ బంగ్లాదేశ్ జాతీయ ఐక్యతకు పిలుపు ఇచ్చారు. అవినీతి వ్యతిరేక పోరాటంలో పౌరులందరూ కలిసి రావాలని, శాంతి భద్రతలకు కట్టుబడి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, దేశాన్ని సురక్షితంగా, మానవత ఉట్టిపడే జాతిగా ఉంచాలని కోరారు. ఢాకా హోటల్‌లో శనివారం సాయంత్రం పత్రికాగోష్ఠిలో ఆయన జాతీయ పిలుపును పునరుద్ఘాటిస్తూ, దేశ పునర్నిర్మాణ ప్రాధాన్యతలను వివరించారు. ముట్టుకుంటే ఛిద్రమయ్యేలా ఉన్న ఆర్థిక వ్యవస్థ, బలహీనమైన ప్రభుత్వ వ్యవస్థల మధ్య మన కొత్త ప్రయాణం ప్రారంభమైందని తరువాయి 2లో

## 18 తేదీ నాటికి కొత్త మంత్రివర్గం

బంగ్లాదేశ్‌లో కొత్త మంత్రివర్గం ఈనెల 18వ తేదీ నాటికి ప్రమాణస్వీకారం చేస్తుందని క్యాబినెట్ కార్యదర్శి డా.షేక్ అబ్దుర్ రషీద్ చెప్పారు. కొత్తగా ఎన్నికైన ఎంపీల జాబితాను గెజిట్ నోటిఫికేషన్ ప్రకటించిన తర్వాత శనివారం ఆయన సచివాలయ కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ, మంగళవారం సాయంత్రానికి పార్లమెంటు సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాలు పూర్తవుతాయని, 18వ తేదీన కొత్త మంత్రివర్గం కొలువుదీరుతుందని అన్నారు. చట్ట ప్రకారం 17వ తేదీ నాటికి ఎంపీల ప్రమాణస్వీకారాలు పూర్తి కావాల్సి ఉందన్నారు. 299 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. రెండు స్థానాల్లో ఫలితాలు వెల్లడికాలేదు. తరువాయి 2లో

## తెలంగాణలో సిపిఐకి సముచిత ఫలితాలపై హర్షం

సిపిఐ ఎపి రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య



**హైదరాబాద్ :** మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో సముచిత ఫలితాలు సాధించినందుకు సిపిఐ ఎపి రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య తెలంగాణ రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీకి అభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో జరిగిన మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో ముఖ్యంగా సిపిఐ కొత్తగూడెంలో సింగిల్ పార్టీగా విజయ సాధించినందుకు, ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, వరంగల్, అదిలాబాద్ జిల్లాలో కొన్ని మున్సిపల్ వార్డుల్లో సిపిఐ అభ్యర్థులు గెలుపొందడం హర్షణీయమన్నారు. ఈ గెలుపునకు అహర్నిశలు కృషి చేసిన సిపిఐ నాయకత్వానికి, కొత్తగూడెం జిల్లా పార్టీకి, పార్టీ శ్రేణులకు సిపిఐ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు సమితి తరపున అభినందనలు తెలియజేస్తున్నట్లు ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రెండు రోజుల్లో 4 రాష్ట్రాల

## ఎన్నికల షెడ్యూల్?




**న్యూఢిల్లీ:** దేశంలో మరో మినీ ఎన్నికల యుద్ధానికి రంగం సిద్ధమవుతోంది. నాలుగు కీలకమైన రాష్ట్రాల్లో ఎన్నికల సమరానికి ఎన్నికల సంఘం సమాయత్తమవుతోంది. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు పూర్తి చేసినట్లు సమాచారం అందుతోంది. ఎన్నికలు జరగనున్న నాలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక ఓటర్ సర్వేను ఇప్పటికే ఈసీ పూర్తి చేసింది. దీంతో ఎన్నికల సంఘం తుది జాబితాను ఆదివారం విడుదల చేయనున్నట్లు సమాచారం. సోమవారం లేదా మంగళవారం తమిళనాడు, కేరళ, అసోం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. మార్చి లేదా ఏప్రిల్‌లో ఎన్నికల ప్రక్రియను ముగించవచ్చని వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే విద్యార్థులకు బోర్డు పరీక్షలు ప్రారంభమయ్యాయి. త్వరలోనే విద్యార్థులకు వేసవి సెలవులు రానున్నాయి. విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఎన్నికల షెడ్యూల్ రావొచ్చని వార్తలు వస్తున్నాయి.


నల్లమల కమలాదేవి కన్నుమూత 03





మొబైల్ ఎరువుల బుకింగ్ యాప్‌తో రైతులకు భారీ ఊరట
రాష్ట్రవ్యాప్తంగా 12.73 లక్షల మంది రైతులు వినియోగం
50.48 లక్షల యూరియా సంచులు బుకింగ్ 12







## ఈనెల 17-18 తేదీల్లో
# ఉక్రేన్-రష్యా చర్చలు

**జెనీవా:** ఉక్రేన్–అమెరికా–రష్యా మధ్య మరోవిడత త్రైపాక్షిక చర్చలు ఈసారి స్విట్జర్లాండ్‌లోని జెనీవానగరంలో జరుగుతాయి. ఈనెల 17,18 తేదీలలో ఈ త్రైపాక్షక చర్చలకు సమయాన్ని నిర్దేశించినట్లు రష్యా అధికారిక కార్యాలయం క్రెమ్లిన్‌లో పుతిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ శనివారం చెప్పారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ సహాయకుడు వ్లాదిమిర్ మెడిన్స్కి నాయకత్వంలో రష్యా ప్రతినిధి బృందం ఈ చర్చల్లో పాల్గొంటుంది. ఇంతకు ముందు అబుధాబిలో రెండు విడతలుగా జరిగిన చర్చల్లో కూడా ఈ బృందమే పాల్గొంది. ఈ చర్చలకు సంబంధించిన నిర్దిష్టమైన ఎజెండాను పెస్కోవ్ విడుదల చేయకపోయినప్పటికీ, అమెరికా–రష్యా మధ్య ఆర్థిక సహకారం గురించి చర్చించేందుకు కూడా తమ దేశం సిద్ధంగా ఉందని పెస్కోవ్ చెప్పారు. ఉక్రేన్‌తో చర్చలకు సంబంధించి ఆ దేశం తీసుకునే నిర్ణయంపైనే చర్చల పురోగతి ఆధారపడి ఉంటుందని అన్నారు.
ఇప్పటికే రెండు విడతలుగా ఈ త్రైపాక్షిక చర్చలు జరిగాయి. రెండో విడత త్రైపాక్షిక చర్చలలో కొంత సానుకూల పరిణామాలు సంభవించాయి. ఉక్రేన్–రష్యాలు పరస్పరం 250 మంది వంతున యుద్ధ ఖైదీలను మార్పిడి చేసుకున్నాయి. పైగా ఉక్రేన్ ఇంకా మరో ముగ్గురు యుద్ధ ఖైదీలను అదనంగా విడుదల చేసింది. ఈ ఏడాది జూన్‌లోపు ఉక్రేన్‌లో శాంతిస్థాపనకు వీలుగా చర్చలు ముగించాలని, కాల్పుల విరమణ ఒప్పందం చేసుకోవాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మొదటిసారి ఒక గడువుతేదీ విధించారు. ఉక్రేన్ ప్రభుత్వ వర్గాల నుండి కూడా అనంతరం దేశంలో సార్వత్రిక ఎన్నికలకు ముహూర్త నిర్ణయించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ప్రకటించినప్పటికీ ఆ తర్వాత అధికార కార్యాలయం నుండి ఖండన వార్తలు వెలువడ్డాయి. శాంతి ఒప్పందం అనంతరం రష్యా ఉల్లంఘనలకు పాల్పడి దాడులు చేయకుండా ఉండేందుకు అమెరికా నుండి, యూరప్ కూటమి నుండి తమకు సెక్యూరిటీ గ్యారంటీలు వచ్చేవరకూ ఉక్రేన్‌లో సార్వత్రిక ఎన్నికలకు అవకాశం లేదని సవరణతో కూడిన ప్రకటన జారీ అయ్యింది. ఈ పరిస్థితుల మధ్య త్రైపాక్షిక చర్చల ప్రాతిపదికపై ప్రాదేశిక వివాదాల పరిష్కారంపై ఉక్రేన్–రష్యాలు చర్చలు కొనసాగిస్తున్నాయి.

## 17న మరో విడత
# ఇరాన్-అమెరికా అణు చర్చలు

**వాషింగ్టన్:** అమెరికా–ఇరాన్ మధ్య అణు సమస్యపై మరోవిడత చర్చలు ఈసారి స్విట్జర్లాండ్ నగరం జెనీవాలో జరుగుతాయి. వచ్చేవారం మంగళవారం చర్చలు జరుగుతాయి. ఇరాన్–అమెరికా, ఉక్రేన్–రష్యా మధ్య వేరు వేరుగా ఒకే తేదీలలో సమావేశాల నిర్వహణకు ఈ రూపేణా జెనీవా ఒక వేదిక కానున్నది. ఉక్రేన్–అమెరికా–రష్యా మధ్య కూడా శాంతి చర్చలు మరో మూడు రోజుల్లో జెనీవాలోనే జరగనున్నాయి. ఇరాన్–అమెరికా మధ్య యుద్ధాన్ని నివారించేందుకు ఒక ఒప్పందం చేసుకోవడానికి వీలుగా అణు సమస్యపై మరో విడత చర్చలు వచ్చే మంగళవారం జెనీవాలో జరుగుతాయని వాషింగ్టన్ వర్గాలు శనివారం తెలియజేశాయి. తాను చర్చలనే ఇష్టపడతాననీ, ఇరాన్‌తో ఒక ఒప్పందం చేసుకుంటాననీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెబుతున్నప్పటికీ ఇప్పటికే ఆయన అరేబియా అంతర్జాతీయ జలాల్లో ఇరాన్‌కు కొద్ది గంటల ప్రయాణ దూరంలో భారీ ఎత్తున విమాన వాహక యుద్ధ నౌకలను మోహరించారు. కొత్తగా మరో యుద్ధ నౌకను కూడా తరలించిన పరిస్థితుల్లో ఈ రెండో విడత చర్చలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. వైట్‌హౌస్ ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్, ట్రంప్ సీనియర్ సలహాదారు, ఆయన అల్లుడు జారెడ్ కుష్నెర్ జెనీవా చర్చల్లో పాల్గొంటారు. ఇరాన్ తరపున ప్రతినిధి బృందానికి ఆ దేశ విదేశీమంత్రి అబ్బాస్ అరాఘ్చి నాయకత్వం వహిస్తారు. ఇంతకుముందు మస్కట్‌లో ఇరాన్–అమెరికా మధ్య మొదటి విడత చర్చలు జరిగాయి. ఈ వైరి దేశాలకు మధ్యవర్తిగా ఉన్న ఒమన్ విదేశీమంత్రి బదర్ బిన్ హమద్ అల్ బుసైదీ కూడా ఈ చర్చల్లో పాల్గొంటారు.



**చర్చలకు ఓకే..**
అమెరికాలో చర్చలకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగానే ఉన్నామని ఇరాక్‌లో ఉన్న ఇరాన్ దౌత్యవేత్త మొహమ్మద్ అల్ కజెం అల్ సదెగ్ అన్నారు. ఐనప్పటికీ ఇరాన్ ఎల్లప్పుడూ అప్రమత్తంగా జాగరుకతతో వ్యవహరిస్తుందన్నారు. అన్యాయంగా తమదేశంపై విధించిన ఆంక్షలను అమెరికా ఎత్తివేయాలని ఇరాన్ విదేశీమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి ఎస్మాయిల్ బఖై కోరారు. స్పష్టమైన ఫలితాలను ఆశించి చిత్తశుద్ధితో తమ దేశం చర్చల్లోకి ప్రవేశించిందని, ఐతే ఈ చర్చలు తమ దేశ విధానాలకు అనుగుణంగా ఉంటాయని అన్నారు. ఒకవేళ విరుద్ధంగా సైనిక దురాక్రమణకు పాల్పడితే నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తామన్నారు.
ఇదిలా ఉండగా ఇరాన్–అమెరికా మధ్య మస్కట్‌లో ఈనెల ఆరోతేదీన జరిగిన మొదటి విడత పరోక్ష అణు చర్చలకు ఇరాక్ విదేశీమంత్రి పువాద్ హుస్సేన్ మద్దతు తెలియజేశారు. ఇరాన్–అమెరికా మధ్య ఏ మాత్రం యుద్ధం జరిగినా ఈ ప్రాంతంపై ఆ యుద్ధం తీవ్ర ప్రభావం చూపిస్తుందన్నారు. ఈ చర్చల సమయంలో ఇరాన్–అమెరికా రెండూ కొన్నిఅభిప్రాయాలను ఇరాక్ ద్వారా ఇచ్చిపుచ్చుకున్నాయి. ఈ రెండు దేశాలమధ్యా ఆరు నెలల క్రితం 12రోజులు యుద్ధం జరిగిన తర్వాత మొదటిసారి మస్కట్‌లో మళ్ళీ అణు సమస్య పరిష్కారానికి చర్చలు మొదలయ్యాయి. కాగా ఇరాక్ ప్రధానమంత్రిగా పాత నాయకుణ్ణి తిరిగి నియమిస్తే సహించేదిలేదని ఇప్పటికే రెండూ మూడుసార్లు అమెరికా హెచ్చరిక చేయడంపై పు వాద్ హుస్సేన్ స్పందిస్తూ, ఎవరిని ప్రధానమంత్రిగా నియమించుకోవాలన్న విషయం తమ అంతర్గత వ్యవహారామని, ఈవిషయంలో ఎవరిజోక్యం ఉండకూడదన్నారు.



## యూరప్‌తో బంధం
# తెంచుకోం

**మ్యూనిచ్:** యూరప్ నుండి విడిపోవాలని కోరుకోవడంలేదని అమెరికా విదేశీమంత్రి మార్కో రుబియో చెప్పారు. ప్రతి సంవత్సరం జరిగే భద్రతా సదస్సులో శనివారం ఉదయం ఆయన మ్యూనిచ్‌లో మాట్లాతూ, అమెరికా–యూరప్ దేశాలమధ్య సంబంధాలకు కొత్త జవసత్వాలు సమకూర్చి వాటిని పునరుజ్జీవింపజేయాలని తాము కోరుకుంటున్నామన్నారు. రెండు ఖండాల మధ్యా సంబంధాలను బలోపేతం చేయాలని తాము కోరుకుంటున్నామన్నారు. యూరప్ దేశాలపై అమెరికా అనుసరిస్తున్న సుంకాల విధానంతోపాటు, గ్రీన్‌లాండ్‌పై అనుసరిస్తున్న తీరు, ఉక్రేన్ విషయంలో రష్యాతో అనుసరించిన విధానం, నాటో కూటమిలో వచ్చిన విభేదాలు, యూరప్ స్వతంత్రంగా తన భద్రతను బలోపేతం చేసుకుని, పూర్తిగా అమెరికాపై ఆధారపడకుండా స్వయంసమృద్ధి దిశగా వెళ్ళాలన్న ఆలోచనలు బలపడిన పూర్వరంగంలో మ్యూనిక్ వేదికగా మార్కో రుబియో ఈ వ్యాఖ్యలు చేశారు. ట్రాన్స్ అంట్లాంటిక్ మైత్రీ బంధానికి ఇక తెరపడిందన్న ఆలోచనలను ఆయన నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. ఇది మా లక్ష్యంగానీ కోరికగానీ కాదన్నారు. వేరుపడాలని కోరుకోవడంలేదని, అలాంటి ఆలోచన ఎప్పుడూ రాదని, మానవ చరిత్రలో అత్యంత పురాతనమైన గొప్ప అనుబంధం,మైత్రి, నాగరికతలను పునరుజ్జీవింపజేయాలనేదే తమఅభిమతమన్నారు.
**ఇయు సింగిల్ మార్కెట్‌తో జతకలిసేందుకు స్టార్మర్ ఉత్సుకత!**
మ్యూనిచ్ సదస్సులో బ్రిటన్ ప్రధానమంత్రి కీవ్ స్టార్మర్ మాట్లాడుతూ, యూరోపియన్ యూనియన్ ఏకీకృత మార్కెట్‌కు దగ్గరగా వెళ్ళగల సన్నిహిత ఆర్థిక సంబంధాల అవకాశాలను బ్రిటన్ అన్వేషించాల్సి ఉంటుందన్నారు. బ్రెగ్జిట్ ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా యూరోపియన్ యూనియన్ నుండి బ్రిటన్ దేశం గతంలో దూరమైన విషయం ఈ సందర్భంగా గమనార్హం. యూరోపియన్ యూనియన్ అధ్యక్షురాలు ఉర్సులా వోం డర్ లేయన్ మాట్లాడుతూ, యూరోపియన్ యూనియన్ వ్యవస్థాక ఒప్పందంలో పొందుపరచిన సజీవ రక్షణ నిబంధనలను అమలు చేయాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. పరస్పర రక్షణ అనేది యూరోపియన్ యూనియన్ ఐచ్ఛికంగా అమలు చేసేదికాదన్నారు. యూరోపియన్ యూనియన్‌తో రక్షణ–పారిశ్రామిక రంగాలలో తరాలమార్పులకు అనుగుణంగా కలిసి పనిచేసేందుకు తాము నాయకత్వం వహించాలనుకుంటున్నామన్నారు. లోతైన ఆర్థిక ఏకీకరణ మనందరి ఉమ్మడి ప్రయోజాలకు అవసరమని, అందువల్ల ఏకీకృత మార్కెట్‌కు అనుగుణంగా ఎక్కడ కలిసి పనిచేయగలమనే విషయాలను పరిశీలించాల్సి ఉందన్నారు. 2020లో బ్రిటన్ ఐరోపా సమాఖ్య ఏకీకృత మార్కెట్‌ను వదలి బయటకు వచ్చింది.

# బంగ్లా ఎన్నికల్లో అంతర్జాతీయ ప్రామాణికత




## యూరోపియన్ పరిశీలకుల వ్యాఖ్య

**ఢాకా:** బంగ్లాదేశ్‌లో ఎన్నికలు ఎంతో విశ్వసనీయంగా జరిగాయని యూరోపియన్ యూనియన్ ఎన్నికల పరిశీలకుల బృందం (ఇఓఎం) స్పష్టం చేసింది. ఈ ఎన్నికలను ఎంతో సమర్థవంతంగా నిర్వహించారని తెలిపింది. దేశంలో ప్రజాస్వామ్యపాలన, చట్టబద్ధమైన పాలనను పునరుద్ధరించే దిశగా ఈ ఎన్నికలు ఎంతో కీలకమైనవని తెలిపింది. యూరోపియన్ పార్లమెంటు సభ్యుడు, (ఎంఇపి) ఇఓఎం ప్రధాన పరిశీలకుడు ఐవర్స్ ఇజాబ్స్ శనివారం ఢాకాలో పాత్రికేయులతో మాట్లాడుతూ, తోమస్ డెజోవస్కీ నాయకత్వానగల ఎంఇపి నివేదికను పాత్రికేయులకు వివరించారు. ఎంతో పోటీతత్వంతో, గౌరవప్రదంగా, పరస్పర స్వేచ్ఛ, గౌరవాలతో పూర్తయ్యాయన్నారు. ఈ ఎన్నికల విధానం అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉందని, ఎన్నికల సంఘం కూడా చాలా స్వతంత్రంగా, బాహాట పద్ధతుల్లో దాపరికం లేకుండా తన బాధ్యతలు నిర్వహించిందని తెలిపారు. ఎన్నికల్లో భాగస్వాముల విశ్వాసాన్ని కాపాడి, ఒక సమగ్రతను చేకూర్చిందన్నారు. పోలింగ్ రోజున దేశం చాలా ప్రశాంతంగా ఉందని, క్రమశిక్షణతో పోలింగ్ ప్రక్రియ జరిగిందని, అధికారులు కూడా చాలా సమర్థవంతంగా ఎన్నికలను నిర్వహించారని ఇజాబ్స్ ప్రశంసించారు. అన్ని స్థాయిల్లో లనూ పార్టీల ఏజంట్లు పాల్గొన్నారని, ఎన్నికల అధికారులు ఎప్పటికప్పుడు సమాచారాన్ని మీడియాకు అందించారని, ప్రజలకు విశ్వాసం కలిగించే పద్ధతులలో అన్నీ సక్రమంగా నెరవేర్చారన్నారు. పౌర పరిశీలకులు, నిజనిర్ధారణ కమిటీల సభ్యులు, యువ, మహిళా కార్యకర్తలు క్రమశిక్షణతో పనిచేశారన్నారు. డెజోవస్కీ మాట్లాడుతూ దేశం ఇప్పుడు ఒక సరికొత్త కీలక దశలోకి ప్రవేశించిందన్నారు. పార్లమెంటుసభ్యులు, ప్రభుత్వ అధికారులు, ఇతర చట్టపరమైన సంస్థలన్నీ నిర్ధారిత, ఆమోదిత సంస్కరణలను అమలు చేయాలని కోరారు.
**ప్రజాస్వామ్యంలో కీలక అడుగు:ఐఆర్ఐ**
బంగ్లాదేశ్ ఎన్నికలు ప్రజాస్వామ్యంలో ఒక కీలకమైన ముందు అడుగు అని ఐఆర్ఐ (ఇంటర్నేషనల్ రిపబ్లికన్ ఇనిస్టిట్యూట్) వ్యాఖ్యానించింది. దేశంలో స్థిరత్వాన్ని, రాజకీయ సర్వసమ్మిళితత్వాన్ని పటిష్టం చేయడానికి సంస్కరణల అమలు కొనసాగించాలని ఐఆర్ఐ విజ్ఞప్తి చేసింది. గడచిన సోమవారం నుండి శుక్రవారం వరకూ ఎన్నికల ప్రక్రియను పరిశీలించేందుకు ఐఆర్ఐ తన ప్రతినిధి బృందాన్ని బంగ్లాదేశ్‌లో మోహరించి శనివారం తన ప్రాథమిక నివేదిక విడుదల చేసింది. అమెరికా కాంగ్రెస్ మాజీ సభ్యుడు డేవిడ్ డ్రీయర్ దేశంలో అనేకమందితో సమావేశాలు జరిపి రాజకీయ వాతావరణాన్ని అంచనావేసింది. ఎన్నికల సంఘం, భద్రతా దళాలు అద్భుతంగా పని చేశాయని, పోలింగ్ రోజున ఎలాంటి ఘటనలు లేకుండా ప్రశాంతంగా గడిచిందని డ్రీయర్ ప్రశంసించారు.

## జాతీయ రహదారిపై
# ఘోర రోడ్డు ప్రమాదం

### ముగ్గురు మృతి పలువురికి గాయాలు
### మల్లన్న దర్శనానికి వెళుతుండగా ఘటన



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కర్నాటక నుంచి శ్రీశైలం దైవదర్శనానికి వెళుతున్న క్రూసర్ ఊర్కొండ మండలం తిమ్మనపల్లి గ్రామశివారులో ఘోరరోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. శుక్రవారం కర్నాటక రాష్ట్రం విజయపురి జిల్లా కలకేరి మండలం తాళికోట ప్రాంతంనుంచి రెండు క్రూసర్‌లలో దాదాపు 20మంది ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలం దైవదర్శనానికై బయలుదేరడం జరిగిందని శనివారం తెల్లవారుజామున 2.30గంటల ప్రాంతంలో జడ్చర్ల కోదాడ 167 జాతీ య రహదారైన ఊర్కొండ మండలం తిమ్మన్నపల్లి గ్రామశివారులో కెఎ28ఎన్8746 నెంబర్‌గల క్రూసర్ అతివేగంతో కల్వర్టుకు ఢీకొనడంతో అక్కడికక్కడే ముగ్గురు మృతి చెందారు. ఈ ప్రమాదంలో రాంరెడ్డి (52) ఆయన భార్య మేఘనరెడ్డి(45), మహాదేవి (55) మృతిచెందారు. డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగంవలనే ఈరోడ్డు ప్రమాదం జరిగిందన్నారు. తీవ్రగాయాలైన వ్యక్తులను వెల్దండలోని యెన్నం ఆస్పత్రికి తరలించారు. గాయాలైనవారిని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతివేగం, తెల్లవారుజాము అవుతుండటంతో వాహన డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంవల్ల ఈదుర్ఘటన జరిగిందని, 2గంటలు గడిస్తే శ్రీశైలం చేరుకునేవాళ్లు. అంతలోనే మృత్యువువారిని వెంటాడిందని, ఒకే కుటుంబంలో భార్యాభర్తలు మృతిచెందడం అందరిని కలచివేసింది. బంధువుల ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఊర్కొండ ఎస్ఐ కృష్ణదేవ తెలిపారు.

# ఓటరుగా నమోదైతేనే..

### ఎక్స్-అఫీషియో ఓటు హక్కు ■ చైర్మన్‌లు, మేయర్‌ల ఎన్నికలపై ఎన్నికల సంఘం స్పష్టత

**ప్రజాపక్షం/హైదరాబాద్**

తెలంగాణలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌ల చైర్మన్‌లు, మేయర్‌ల ఎన్నికల ప్రక్రియ ఊపందుకున్న వేళ రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసి) కీలక మార్గదర్శకాలను విడుదల చేసింది. పరోక్ష ఎన్నికల్లో ఎక్స్‌అఫీషియో సభ్యుల ఓటు హక్కుపై గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును అనుసరిస్తూ ఎస్ఇసి కార్యదర్శి జి.లింగయ్య నాయక్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో ఓటు వేయడానికి కింది నిబంధనలు వర్తిస్తాయి. లోక్‌సభ ఎంపిలు, ఎమ్మెల్యేలు మున్సిపల్ ప్రాంతం పూర్తిగా లేదా పాక్షికంగా తమ నియోజకవర్గ పరిధిలోకి వస్తే, వారు ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఓటు వేయవచ్చు. రాజ్యసభ ఎంపిలు, ఎమ్మెల్సీలు సంబంధిత మున్సిపాలిటీ లేదా కార్పొరేషన్ పరిధిలో ఓటరుగా నమోదై ఉంటేనే ఎక్స్ అఫీషియో సభ్యులుగా అర్హత పొందుతారు. ఓటరుగా నమోదు లేని పక్షంలో వారికి ఓటు హక్కు ఉండదు. ఆర్టికల్ 243ఎస్ (5) ప్రకారం ఏర్పాటు చేసిన కమిటీల చైర్మన్లు కూడా సదరు మున్సిపల్ ఏరియాలో ఓటరుగా నమోదై ఉండాలి. కోఆప్టెడ్ సభ్యులు మున్సిపల్ పరిపాలనలో అనుభవం ఉన్న నిపుణులను సభ్యులుగా నియమించవచ్చు కానీ, వారికి ఓటు వేసే హక్కు ఉండదు. అర్హత లేని సభ్యులు ఎవరైనా ఓటు వేసినా లేదా నామినేట్ చేయబడినా, ఆ ఎన్నిక ప్రక్రియ చెల్లదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లకు సర్క్యులర్ పంపారు.
ఎన్నికల షెడ్యూల్, నిబంధనలు
జనవరి 27, 2026 నాటి నోటిఫికేషన్ ప్రకారం ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎన్నికైన కౌన్సిలర్లు, కార్పొరేటర్లు ఈనెల 16వ తేదీ ఉదయం 11 గంటలకు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అదే రోజు మధ్యాహ్నం 12:30 గంటలకు మేయర్, చైర్మన్‌ల ఎంపిక కోసం ప్రత్యేక సమావేశం జరుగుతుంది. దీని కోసం కలెక్టర్లు ఫారమ్ 11 నోటీసులు విడుదల చేయాలి. క్యాంపు రాజకీయాలపై నిఘా పెట్టారు. దాదాపు 40 మున్సిపాలిటీల్లో హంగ్ ఏర్పడే అవకాశం ఉండటంతో ఎస్ఈసి అప్రమత్తమైంది. ఎన్నికల కోడ్ ముగిసే వరకు కఠిన నిబంధనలు అమలులో ఉంటాయి. ఎన్నికల కేంద్రాల వద్ద బిఎన్ఎస్ఎస్ 163 సెక్షన్ (పాత 144 సెక్షన్) అమలులో ఉంటుంది. ముగ్గురికి మించి గుంపుగా ఉండరాదు. అనుమతి లేకుండా ప్రైవేట్ లేదా టూరిస్ట్ బస్సుల్లో విజేతలను తరలించడం నిబంధనల ఉల్లంఘనగా పరిగణించబడుతుంది. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించే అభ్యర్థులు లేదా పార్టీలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, విజేతలు కోడ్‌కు కట్టుబడి ఉంటామని డిక్లరేషన్ ఇవ్వాలని ఎస్ఈసి ఆదేశించింది. ఎప్పటికప్పుడు నివేదికలు పంపించాలని స్పష్టం చేసింది.

# సిపిఐ మేయర్
(మొదటి పేజీ తరువాయి)



మాట్లాడుతూ కొత్తగూడెం కార్పొరేషన్ విషయంలో మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను సిపిఐ, కాంగ్రెస్ పార్టీలు రెండున్నర సంవత్సరాల చొప్పున తీసుకోవాలని సూత్రప్రాయంగా అంగీకారానికి వచ్చినట్లు వెల్లడించారు. మొదటి రెండున్నర సంవత్సరాలు మేయర్ స్థానాన్ని సిపిఐ, తరువాత కాంగ్రెస్ స్వీకరిస్తాయని, డిప్యూటీ మేయర్ స్థానాన్ని తొలి విడతలో కాంగ్రెస్, తరువాత సిపిఐ చేపడతాయని వివరించారు. సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ దేశ రాజకీయాల దృష్ట్యా కలిసి పనిచేయాలని కాంగ్రెస్ అధిష్టానం మా పార్టీకి చెప్పారని, మా పార్టీ ఆదేశాల మేరకు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌లతో, అలాగే మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో తాను, ఇ.టి. నర్సింహా చర్చించినట్లు తెలిపారు. ఎన్నికలకు ముందు చర్చలు సామరస్యంగా సాగకపోవడం, రెండు, మూడు సీట్ల విషయంలో వివాదాలు రావడంతో స్నేహపూర్వక పోటీ చేయాల్సి వచ్చిందన్నారు. రెండు పార్టీలు కూడా ఏ పార్టీతో పోకుండా స్వతంత్రంగానే పోటీ చేశాయని తెలిపారు. సిపిఐ పక్షానికి 23, కాంగ్రెస్ పక్షానికి 23 స్థానాలు వచ్చాయని తెలిపారు. ఎన్నికల అవగాహన కుదరనందునే సిపిఐ పోరాటం చేసి 23 స్థానాలు సాధించిందని, కాబట్టి సిపిఐకి మొదటి విడతలో మేయర్ పదవిని కోరగా, వారు సానుకూలంగా స్పందించి అంగీకరించారని చెప్పారు. మొదట సిపిఐ నుంచి మేయర్, కాంగ్రెస్ నుంచి డిప్యూటీ మేయర్ ఉంటారని, పిసిసి అధ్యక్షుడు చెప్పిన విధంగా రెండున్నర సంవత్సరాల తరువాత సిపిఐ డిప్యూటీ మేయర్ పదవి చేపట్టి, కాంగ్రెస్‌కు మేయర్ చేపట్టేందుకు అంగీకారం కుదిరిందన్నారు. కాగా, మిత్రపక్షాలుగా ఉన్న కాంగ్రెస్, సిపిఐలు కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో విడివిడిగా పోటీ చేశాయి. మొత్తం 60 స్థానాలలో సిపిఐకి 22, పార్టీ మద్దతుతో గెలిచిన ఇండిపెండెంట్ కలిపి 23 స్థానాల్లో విజయం లభించింది. కాంగ్రెస్ పార్టీకి 22 స్థానాలలో, ఆ పార్టీ మద్దతుతో సిపిఐ(ఎం) ఒక స్థానంలో గెలిచాయి. రాష్ట్ర చరిత్రలో సిపిఐ తొలిసారిగా మేయర్ పదవిని చేపట్టనుంది. ఈ నేపథ్యంలో కమ్యూనిస్టు పార్టీ, వామపక్షాల శ్రేణులు, అభిమానుల్లో, ప్రగతిశీల శక్తుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

# కేంద్రం ఓకే
(మొదటి పేజీ తరువాయి)

ఈ వ్యవహారంపై తెలంగాణ ఎసిబి విస్తృతంగా విచారణ కొనసాగిస్తోంది. అధికార దుర్వినియోగం, నిధుల వినియోగంలో అవకతవకలు, ఒప్పందాల ప్రక్రియలో లోపాలు వంటి అంశాలపై సాక్ష్యాలను సేకరించిన ఎసిబి అధికారులు, చట్టపరమైన చర్యలకు సిద్ధమవుతున్నారు.రాజకీయ నాయకుడు, ఉన్నతాధికారిపై ప్రాసిక్యూషన్‌కు అనుమతి లభించడం వల్ల, ఎసిబి త్వరలోనే కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేయనున్నట్లు సమాచారం. ఇప్పటివరకు సేకరించిన ఆధారాలు, పత్రాలు, సాక్షుల వాంగ్మూలాలను సమగ్రంగా సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కేసులో ప్రధాన రాజకీయ నాయకుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి కె.తారాక రామారావుపై ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ ఇప్పటికే అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు అదే కేసులో కీలక అధికారిగా ఉన్న అరవింద్‌కుమార్‌పై కూడా కేంద్రం అనుమతి ఇవ్వడంతో కేసు కీలక దశకు చేరుకుంది.

**కేసు నేపథ్యం**

హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా–ఇ కార్ రేస్ కోసం భారీగా ప్రభుత్వ నిధులు వినియోగించారని, టెండర్ విధానాలు పాటించలేదని, కొన్ని ప్రైవేట్ సంస్థలకు అనుచిత లాభాలు కల్పించారని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో దర్యాప్తు ప్రారంభమై రాజకీయంగా తీవ్ర చర్చకు దారి తీసింది.

**రాజకీయంగా వేడి..**

ఈ కేసులో వరుసగా అనుమతులు రావడంతో రాష్ట్ర రాజకీయాల్లో ఉద్రిక్తత నెలకొంది. అధికార, ప్రతిపక్షాల మధ్య ఆరోపణలు–ప్రత్యారోపణలు మళ్లీ ముదిరే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తంగా ఫార్ములా ఈ రేస్ కేసు ఇప్పుడు న్యాయపరమైన కీలక దశలోకి ప్రవేశించింది. త్వరలోనే కోర్టు ప్రక్రియ ప్రారంభమయ్యే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# అగమ్యగోచరం
(మొదటి పేజీ తరువాయి)

చట్టబద్ధ హామీ ఇవ్వడం మా ప్రధాన డిమాండ్. స్వామినాథన్ కమిటీ కూడా ఇదే సిఫార్సు చేసింది. కానీ ఇప్పటికీ సరైన మద్దతు ధర అమలు కాలేదు. దాంతో రైతులు భారీగా నష్టపోయారు’ అని అన్నారు. తాము లాభం అడగడం లేదు, కనీస మద్దతు ధరకు చట్టబద్ధ హామీ మాత్రమే కోరుతున్నామని స్పష్టం చేశారు. రైతుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, కనీస మద్దతు ధరకు చట్టబద్ధ హామీ కల్పించాలని డిమాండ్ చేశారు. మార్చి 19న ఢిల్లీలో జరిగే మహాసభకు దేశవ్యాప్తంగా రైతులు భారీగా తరలివచ్చే అవకాశం ఉందని తెలిపారు. తెలంగాణలో రైతు కమిషన్ ఏర్పాటు చేయడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. రైతులతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకోవడం మంచి ఆలోచన అన్నారు.
**రైతులను జైలుకు పంపిన బిజెపి సర్కార్ : కోదండ రెడ్డి**
రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు వ్యతిరేకంగా మూడు నల్ల చట్టాలు తీసుకువచ్చిందని విమర్శించారు. కరోనా సమయంలో అనేక మంది రైతులు జైలుకు వెళ్లారని గుర్తు చేశారు. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు సాగుతున్న ఈ యాత్రలో పాల్గొన్న నాయకులకు తెలంగాణ ప్రభుత్వం, రైతు కమిషన్ తరఫున ఆహ్వానం పలికామని చెప్పారు. యాత్ర నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కూడా కలవనున్నట్లు చెప్పారు.
**పరోక్షంగా నల్ల చట్టాలు తీసుకొచ్చే ప్రయత్నంలో బిజెపి సర్కార్ : వెంకటేశ్వరరావు**
రైతు నాయకుడు వెంకశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలపై 16 నెలల పాటు రైతులు పోరాటం చేశారని గుర్తుచేశారు. ఉత్తరప్రదేశ్ ఎన్నికల నేపథ్యంలో ఆ చట్టాలను ఉపసంహరించుకున్నప్పటికీ, మరణించిన రైతు కుటుంబాలకు ఎలాంటి పరిహారం ఇవ్వలేదని విమర్శించారు. మళ్లీ పరోక్షంగా ఆ చట్టాలను తీసుకురావాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. దల్వీర్ సింగ్ నల్లేవాలా 160 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన విషయాన్ని ప్రస్తావిస్తూ, దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల మద్దతుతో ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.
**ఇండియా–అమెరికా ఒప్పందంతో విషమించనున్న రైతుల పరిస్థితి : అన్వేష్ రెడ్డి**
సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఇండియా, అమెరికా ఒప్పందం చేసుకోవడంతో రైతులకు తీవ్ర నష్టం కలగవచ్చని అన్నారు. సుంకాలు లేకుండా మొక్కజొన్న, సోయాబీన్ వంటి పంటలను దిగుమతి చేస్తే దేశీయ రైతులు నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పండించిన పంటలకు సరైన మద్దతు ధర రాకపోతే, ఈ ఒప్పందం వల్ల పరిస్థితి మరింత విషమించవచ్చున్నారు. అందుకే ఆ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# ఐక్యతే ముఖ్యం
(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. ధర్మమే మార్గదర్శక సూత్రమని, చట్టపరమైన నిబంధనలు పౌరులందరికీ సమానంగా వర్తిస్తాయన్నారు.
ఈ విజయం ప్రజాస్వామ్యం సాధించిన విజయం, ప్రజాస్వామ్యంకోసం తాపత్రయపడి, ప్రాణత్యాగాలు చేసిన ప్రజలు సాధించిన విజయం, ఇప్పుడు మనం స్వేచ్ఛాజీవులం, మన హక్కులు మనకు తిరిగి వచ్చాయి అన్నారు. దేశ ఐక్యత, చట్టబద్ధపాలన, శాంతియుత ప్రవర్తనలే తన ప్రభుత్వ ప్రాధాన్యతలని తెలియజేశారు. ప్రజల జీవన విధానాలను మెరుగుపరచడం, వ్యవస్థలను పునర్వ్యవస్థీకరించి పటిష్టం చేయడమే తక్షణ లక్ష్యాలన్నారు. ఈ విజయం ప్రజా విజయం, ఈ విజయం బంగ్లాదేశ్ విజయం అన్నారు. స్వేచ్ఛ నిజమైన సారాంశాన్ని, హక్కులను పునరుద్ధరించుకోవడంద్వారా ఈనాడు మనం విముక్తులమయ్యామన్నారు. జాతీయ ప్రయోజనాల సంరక్షణకోసం దేశంలోని అన్ని రాజకీయపార్టీలూ ఐక్యంగా ఉండాలని కోరారు. దేశాన్ని ప్రజాస్వామ్యాన్ని విచ్ఛిన్నంచేసి, దిగజార్చే విభజనవాద శక్తులకు హెచ్చరిక చేశారు. అధికార,ప్రతిపక్షాలు సక్రమంగా తమ బాధ్యతలు నిర్వహించినప్పుడు దేశంలో ప్రజాస్వామ్యం వ్యవస్థీకృతమవుతుందన్నారు. ఎన్నికల సంఘానికి, అధికారులకు, అంతర్జాతీయ పరిశీలకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. 1971 నాటి విముక్తి యుద్ధం, 2024 నాటి యువకుల తిరుగుబాటు ఉద్యమాలను గుర్తుచేసుకుంటూ ఖలీదాజియా సహా అనేకమంది అమరులకు, ప్రాణత్యాగాలు చేసినవారికి నివాళులు అర్పించారు. ఎన్నికల తర్వాత ఎలాంటి హింసకు, అశాంతికి పాల్పడవద్దని, తిరుగులేని విజయం సాధించినప్పటికీ ఎలాంటి విజయోత్సవాలు చేయవద్దని పార్టీ కార్యకర్తలకు పిలుపు ఇచ్చారు. ‘మన మార్గాలు, అభిప్రాయాలు విభిన్నంగా ఉండవచ్చు, కానీ దేశ ప్రయోజనాలకోసం ఐక్యంగా ఉండాలి, దేశ ప్రయోజనాలకు కట్టుబడి ఉండాలి, జాతీయ ఐక్యతే మన సమష్టిబలం అని నేను చాలా గట్టిగా నమ్ముతున్నాను, విభజన మన బలహీనత’ అన్నారు. జమాత్–ఏ–ఇస్లామ్, ఎన్‌సిపి, ఇస్లామీ ఆందోళన్ బంగ్లాదేశ్, జమాత్ ఉలేమా–ఏ–ఇస్లామ్, గోనో ఓధికార్ పరిషత్ సహా ఎన్నికల్లో పాల్గొన్న 51 రాజకీయపార్టీలకు ఆయన అభినందనలు తెలియజేశారు.
**మనమే బలమైన ప్రతిపక్షం : షఫికుర్ రహ్మాన్**
ఎన్నికల ఫలితాల అనంతరం జమాత్–ఏ–ఇస్లామ్ అమీర్ షఫికర్ రహ్మాన్ శనివారం ఢాకాలో పాత్రికేయులతో మాట్లాడుతూ కార్యకర్తలు అసంతృప్తి చెందవద్దని ధైర్యం చెప్పారు. బంగ్లాదేశ్ ఆధునిక రాజకీయాలలో ఎన్నడూలేనివిధంగా ఒక శక్తిమంతమైన ప్రతిపక్షంగా జమాత్–ఏ–ఇస్లామ్ ఆవిర్భవించిందని, కార్యకర్తలు ఈ ఎన్నికల్లో ఎన్నో కష్టాలకోర్చి వారి పూర్త సమయాన్ని ఎన్నికల ప్రచారంకోసం వెచ్చించి కృషి చేశారని కృతజ్ఞతలు తెలియజేశారు. 13వ సార్వత్రిక ఎన్నికల్లో జమాత్ సారథ్యానగల 11 పార్టీల కూటమి 77 సీట్లు సంపాదించి బలమైన ప్రతిపక్షంగా ఆవతరించింది. ఎన్నికల అనంతరం జరిగిన హింసను ఆయన ఖండించారు. ‘‘మీలో చాలామంది అసంతృప్తి చెంది ఉంటారని నాకు తెలుసు, కానీ మీ శ్రమ వృథా కాలేదు, మనం ఓడిపోలేదు, బలపడ్డాం’’ అన్నారు. 2008 నాటి ఎన్నికల్లో ఈనాడు ఘన విజయం సాధించిన బంగ్లాదేశ్ నేషనలిస్టుపార్టీ 2008 ఎన్నికల్లో కేవలం 30 సీట్లకే పరిమితమైపోయిన విషయం గుర్తుచేస్తూమన పార్టీకి ఇంకా ఎంతో దివ్యమైన భవిష్యత్తు, సుదీర్ఘ ప్రయాణం ముందుకాలంలో ఉందని, మన భవిష్యత్ ప్రయాణం చాలా స్పష్టంగా ఉందని, మన పార్టీ కార్యకలాపాలకు ఈ ఒక్క ఎన్నికలకు మాత్రమే పరిమితం కాదని అన్నారు.

# నల్లమల కమలాదేవి కన్నుమూత





నల్లమల కమలాదేవి

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, సిపిఐ అగ్రనాయకులు నల్లమల గిరిప్రసాద్ సతీమణి నల్లమల కమలాదేవి (90) మరణించారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కమలాదేవి హైదరాబాద్‌లో శనివారం ఉదయం 10:30 గంటలకు తుది శ్వాస విడిచారు. ఆమె అంత్యక్రియలు సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ జూబ్లిహిల్స్ మహాప్రస్థానంలో జరిగాయి. కుమారుడు నల్లమల్ల చక్రవర్తి కమలాదేవి అంత్యక్రియలను పూర్తి చేశారు. అంతకుముందు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని నల్లమల కమలాదేవి పెద్ద కుమార్తె నల్లమల వనశ్రీ నివాసంలో కమలాదేవి భౌతికకాయాన్ని సిపిఐ నాయకులు, కార్యకర్తలు సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. కమలాదేవి భౌతికకాయాన్ని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి, సిపిఐ జాతీయ సమితి సభ్యులు కె.శ్రీనివాస్‌రెడ్డి, ఎఐటియుసి సీనియర్ నాయకురాలు డాక్టర్ బి.వి.విజయలక్ష్మి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి. నరసింహా, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎస్. ఛాయాదేవి, సిపిఐ సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు, పి.ప్రేంపావని, డాక్టర్ కె.రజని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం అంతిమయాత్ర ఎమ్మెల్యే కాలనీ నుంచి మహాప్రస్థానం వరకు జరిగింది.

**సిపిఐ కార్యదర్శి కూనంనేని ప్రగాఢ సంతాపం**

నల్లమల కమలాదేవి మృతి పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సంతాపాన్ని, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నల్లమల గిరి ప్రసాద్‌కు కమలా దేవి అనునిత్యం వెంట ఉండి ఆయన పోరాటంలో భాగస్వాములయ్యారని గుర్తు చేసుకున్నారు. వారి కుటుంబ సభ్యులతో ప్రత్యేకమైన అనుబంధం ఉందని తెలిపారు.

**చాడ వెంకటరెడ్డి సంతాపం**

నల్లమల కమలాదేవి మృతి పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట రెడ్డి సంతాపం తెలిపారు. సిపిఐ అగ్ర నాయకులు నల్లమల గిరిప్రసాద్ అజ్ఞాతంలో ఉండగా కమలాదేవి మొక్కవోని ధైర్యంతో ఉండేవారని చాడ వెంకట్ రెడ్డి గుర్తు చేశారు. సహధర్మచారిణిగా గిరిప్రసాద్‌కు అన్ని వేళలా చేదోడువాదోడుగా ఉన్నారని పేర్కొన్నారు. కమలాదేవి కుటుంబ సభ్యులు నల్లమల వనశ్రీ, జయశ్రీ, చక్రవర్తిలకు సానుభూతిని తెలిపారు.

### కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాలను రద్దు చేసి

# శాశ్వత నియామకాలు చేపట్టాలి

వివిఎస్ బోస్



ప్రజాపక్షం/హైదరాబాద్: ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి) అనుబంధ తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపుతో 60 సంవత్సరాలుగా అప్రతిహతంగా కొనసాగడం గర్వకారణమని ప్రముఖ ట్రేడ్ యూనియన్ నాయకులు వివిఎస్ బోస్ అన్నారు. ప్రభుత్వ గుర్తింపు డైమండ్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా శనివారం హిమాయత్‌నగర్‌లో నిర్వహించిన యూనియన్ రాష్ట్ర సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి. యూసుఫ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు జూలై 2023 నుంచి అమలుకావాల్సిన వేతన సవరణను 44 శాతం ఫిట్‌మెంట్‌తో వెంటనే అమలు చేయాలని, పెండింగ్ కరువు భత్యాన్ని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశా రు. రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహా మాట్లాడుతూ వైద్య రంగంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాలను రద్దు చేసి శాశ్వత నియామకాలు చేపట్టాలని, ఇఎస్ఐ విభాగంలోని జి.ఓ. 126 సవరించాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడంతో పాటు జిఓ 317 వల్ల న్యాయం జరగని ఉద్యోగులను ఆదుకోవాలని కోరారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ వైద్య విధాన పరిషత్‌ను రద్దు చేసి సెకండరీ హెల్త్ సర్వీసెస్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన యూనియన్ అధ్యక్షుడు ఎం.ఎస్. మూర్తి మాట్లాడుతూ ఇన్‌సర్వీస్ ఉద్యోగులకు ల్యాబ్, ఎక్స్‌రే, ఇసిజి శిక్షణలను పునఃప్రారంభించాలని, రేడియోగ్రాఫర్‌లకు ప్రత్యేక కౌన్సిల్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శి పి.ఇందిరా శ్రీలక్ష్మి మాట్లాడుతూ మహిళా నర్సింగ్ ఆర్డర్లీలకు ఇస్తున్న అదనపు హౌస్ రెంట్ అలవెన్స్‌ను పురుషులకు కూడా వర్తింపజేయాలని, టివివిపిలో క్యాడర్ బలాన్ని సవరించాలని, అసిస్టెంట్ కమిషనర్ (నర్సింగ్) పోస్టును భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు వి.వేణుకుమార్, సలహాదారులు ఎం.సి.ఎస్. రాజు, కె.పరబ్ కుమార్, ఉప ప్రధాన కార్యదర్శి శ్రీనివాసాచారి, ఉపాధ్యక్షులు పి.నర్సయ్య, పి.స్వాతి, అమృత్‌రావు, వెంకట్రావు, కవిత, రాష్ట్ర కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు. యూనియన్ బలోపేతానికి కృషి చేసిన పలువురు రాష్ట్ర నాయకులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వి.వేణు కుమార్, రాష్ట్ర కార్యదర్శులుగా మహమ్మద్ ఖమ్రుద్దీన్, వి.శ్రీధర్ ఎన్నికైనట్లు ప్రకటించారు.

# మేము అనుకున్నన్ని రాలేదు

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ 30కి పైగా మున్సిపాలిటీలను కైవసం చేసుకుంటుందని తాము అంచనా వేశామని, కానీ తుది ఫలితాల్లో ఆ సంఖ్య కొంత మేర తగ్గిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు అన్నారు. కాంగ్రెస్ పార్టీపై కూడా ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీకి కూడా ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదని అన్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై కెటిఆర్ శనివారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ హంగ్ ఫలితాలు వచ్చిన మున్సిపాలిటీల్లో పరిస్థితి తమకు అనుకూలంగా ఉందని కెటిఆర్ చెప్పారు. చైర్మన్ పీఠాలను దక్కించుకోవడంలో కీలకమైన ఎక్స్ అఫీషియో ఓట్ల విషయంలో ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులతో చర్చించామని తెలిపారు. తమ పార్టీకి ప్రజాప్రతినిధులు ఉన్న ప్రతి చోట కచ్చితంగా పట్టు సాధిస్తామని కెటిఆర్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ గాలిలో మేడలు కట్టిందని, కానీ క్షేత్ర స్థాయిలో ప్రజలు వారికి ఆశించినన్ని మున్సిపాలిటీలను ఇవ్వలేదని కెటిఆర్ పేర్కొన్నారు. నిజామాబాద్, కరీంనగర్ లాంటి ఒకటి రెండు ప్రాంతాల్లో మినహా బిజెపి ప్రభావం ఎక్కడా కనిపించలేదని కెటిఆర్ చెప్పారు.

## మున్సిపల్ ఎన్నికల్లో అతి పెద్ద పార్టీగా కాంగ్రెస్

15 లక్షలకు పైగా ఓట్లతో 39.8శాతం ఓట్ షేర్

28.75 శాతం ఓట్లతో రెండో స్థానానికి పరిమితమైన బిఆర్ఎస్

1.3 శాతం ఓట్లను సాధించిన సిపిఐ

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఇటీవల ముగిసిన మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం 37,81,232 ఓట్లు పోలయ్యాయి. ప్రధాన పార్టీల మధ్య 'పుర పోరు' హోరాహోరీ సాగింది. ఈ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీశాయి. కాంగ్రెస్ వైపు మొగ్గు చూపినట్లు ఓట్ల శాతం పరిశీలిస్తే స్పష్టమవుతోంది. సుమారు 15 లక్షలకు పైగా ఓట్లతో, 39.8 శాతం ఓట్ షేర్‌ను దక్కించుకుని కాంగ్రెస్ అతిపెద్ద పార్టీగా అవతరించింది. గతంతో పోలిస్తే బిఆర్ఎస్ 28.75 శాతం ఓట్లతో రెండో స్థానానికి పరిమితమైంది. 15.67 శాతం ఓట్లతో బిజెపి మూడవ స్థానంతో సరిపెట్టుకుంది. ఏ పార్టీకి చెందని స్వతంత్ర అభ్యర్థులు ఏకంగా 8 శాతానికి పైగా ఓట్లు సాధించి ప్రధాన పార్టీల ఓట్లకు గండి కొట్టారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ 1.51 శాతం, సిపిఐ 1.30 శాతం ఓట్లను సాధించగా, మిగిలిన చిన్న పార్టీలు 1 శాతం కంటే తక్కువ ఓట్లకే పరిమితమయ్యాయి.

### పార్టీల వారీగా ఓట్ల గణాంకాలు

| పార్టీ పేరు | పోలైన ఓట్ల సంఖ్య | ఓట్ల శాతం |
|---|---|---|
| కాంగ్రెస్ | 15,05,006 | 39.802 |
| బిఆర్ఎస్ | 10,87,347 | 28.756 |
| బిజెపి | 5,92,823 | 15.678 |
| స్వతంత్రులు | 3,14,096 | 8.307 |
| ఎఐఎంఐఎం | 1,24,236 | 3.286 |
| ఎఐఎఫ్‌బి (ఫార్వర్డ్ బ్లాక్) | 57,129 | 1.511 |
| సిపిఐ | 49,450 | 1.308 |
| సిపిఎం | 22,048 | 0.583 |
| జెఎస్‌పి(జనసేన) | 13,504 | 0.357 |
| బిఎస్‌పి | 7,715 | 0.204 |
| టిఆర్‌పి | 3,379 | 0.089 |
| ఎఎపి (ఆమ్ ఆద్మీ) | 1,717 | 0.045 |
| డిఎస్‌పి | 993 | 0.026 |
| ఎంబిటి | 502 | 0.013 |
| ఐయుఎంఎల్ | 195 | 0.005 |
| ఎడిఆర్‌పి | 178 | 0.005 |
| ఎంజెడ్‌జెపి | 153 | 0.004 |
| ఎంటిఆర్‌ఎస్‌పి | 138 | 0.004 |
| ఎఐఎంఐఎం ఇన్క్విలాబ్ | 114 | 0.003 |
| ఎంసిపిఐయు | 90 | 0.002 |
| డిబిపి | 76 | 0.002 |
| డబ్ల్యూపిఐ | 59 | 0.002 |
| బిసియుఎఫ్‌పి | 42 | 0.001 |
| బిఐపి | 40 | 0.001 |
| ఆర్‌ఎల్‌డి | 40 | 0.001 |
| టిఆర్‌పి | 38 | 0.001 |
| విఆర్‌పి | 30 | 0.001 |
| టిజెఎస్‌పి | 24 | 0.001 |
| టిఎస్‌ఎల్‌పి | 13 | 0.000 |
| టిఆర్‌ఎస్‌డి | 11 | 0.000 |
| వైటిపి | 11 | 0.000 |
| పిఈపి | 8 | 0.000 |
| పివిపి | 8 | 0.000 |
| బిఎంపి | 7 | 0.000 |
| ఐపిబిపి | 5 | 0.000 |
| వైటిఆర్‌పి | 5 | 0.000 |
| ఎస్‌పిఐ | 2 | 0.000 |

# విద్యార్థుల సమస్యలపై ఎఐఎస్ఎఫ్ ఉద్యమాలు





ఎఐఎస్ఎఫ్ 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి

ప్రజాపక్షం/కరీంనగర్/హైదరాబాద్: దేశంలో రాష్ట్రంలో విద్యార్థుల సమస్యలపై నిరంతర ఉద్యమిస్తున్న ఏకైక విద్యార్థి సంఘం ఎఐఎస్ఎఫ్ అని, విద్యార్థులు మత రాజకీయాలను తరిమి కొట్టాలని, దేశం ధర్మం అంటూ డబ్బులతో ఓట్లు కొనుగోలు చేస్తున్న బీజేపీకి వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలని, ఫిబ్రవరి 18నుండి 20వరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరిగే ఎఐఎస్ఎఫ్ 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రం లోని గణేష్ నగర్‌లో ఎఐఎస్ఎఫ్ 4వ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మణికంఠ రెడ్డి మాట్లాడుతూ, భారత దేశంలో 90 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఏకైక విద్యార్థి సంఘం ఎఐఎస్ఎఫ్ అని, దేశంలో, రాష్ట్రంలో పాలక ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై నిరంతర విద్యార్థుల పక్షాన నిలుస్తూ ఉద్యమాలు చేస్తుంది ఎఐఎస్ఎఫ్ అని, కేంద్రంలో అధికారంలో బిజెపి ప్రభుత్వం విద్యార్థుల తరగతి గదుల్లో మత విద్వేషాలు రెచ్చగొడుతూ విద్యార్థులను రాజకీయంగా ఓట్ల కొరకు వాడుకుంటున్నారని, తెలంగాణ నుండి ఇద్దరు కేంద్ర మంత్రులున్న తెలంగాణ విద్యార్థులకు కేంద్రం నుండి తీసుకువచ్చిందేమీ లేదని, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ఫిబ్రవరి 18 నుండి 20 వరకు నిజామాబాద్‌లో జరిగే ఎఐఎస్ఎఫ్ నాలుగవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఈ మహాసభలకు తెలంగాణ రాష్ట్రం నుండి ఎంపిక చేయబడిన 400 మంది విద్యార్థి ప్రతినిధులు హాజరు కానున్నారని, మహాసభల విజయవంతానికి విద్యార్థులు కృషి చేయాలని మణికంఠ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు నూనావత్ శ్రీనివాస్ నాయక్, నగర ఉపాధ్యక్షుడు సందీప్ రెడ్డి, బోయిని విష్ణు, శ్రావణ్, నవీన్, చిన్న పండు, అభి తదితరులు పాల్గొన్నారు.

**రాష్ట్ర మహాసభలను జయప్రదం చేద్దాం**
**రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్**

అఖిల భారత విద్యార్థి సమాఖ్య 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ఈ మహాసభలకు రాష్ట్రం నలుమూలల నుండి 750మంది విద్యార్థి ప్రతినిధులు పాల్గొననున్నట్లు తెలిపారు. హైదరాబాద్, హిమాయత్‌నగర్‌లోని రాజ్ బహదూర్ హాల్‌లో శనివారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర మహాసభల గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలు ఫిబ్రవరి 18, 19, 20 తేదీలలో నిజామాబాదు పట్టణంలో జరగనున్నాయని, విద్యను హక్కుగా సాధించేందుకు, విద్యార్థుల భవిష్యత్తు కోసం పోరాటాలకు దిశానిర్దేశం చేసే మహాసభలుగా ఇవి నిలవనున్నాయని తెలిపారు. విద్యను కార్పొరేట్ల చేతుల్లోకి అప్పగించే విధానాలకు వ్యతిరేకంగా బలమైన పోరాట కార్యాచరణను ఈ మహాసభలు ప్రకటించనున్నాయని పుట్ట లక్ష్మణ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, రాష్ట్ర నాయకులు చైతన్య యాదవ్, వంశీ వర్ధన్ రెడ్డి, పవన్, అనిల్ ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్ష, కార్యదర్శి ఉదయ్, లెనిన్ నాయకులు అరుణ్,ఆకాష్, వెంకటేష్, సుశాంత్ పాల్గొన్నారు.

# ప్రజలకు సిఎం మహా శివరాత్రి శుభాకాంక్షలు



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి మహా శివరాత్రి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలకు సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆ మహా దేవుడిని ప్రార్థించారు. మహా శివరాత్రి ఉపవాస పూజలను భక్తి ప్రవత్తులతో నిర్వహిస్తున్న భక్తులందరికీ శివయ్య ఆశీర్వాదం ఎల్లవేళలా ఉండాలని సిఎం ఆకాంక్షించారు.

**ప్రతి ఇల్లు భక్తి భావంతో విరాజిల్లాలి : ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మల్లు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్రమైన రోజున రాష్ట్రంలోని ప్రతి ఇల్లు భక్తి భావంతో విరాజిల్లాలని ఆయన ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. శివరాత్రి పర్వదినం వేళ ఉపవాస దీక్షలు, జాగరణలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులందరిపై ఆ భోళాశంకరుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

**ప్రజలకు గవర్నర్ శుభాకాంక్షలు**

మహా శివరాత్రి పండుగ శుభ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. మహా శివరాత్రి లక్షలాది మంది భక్తులకు ఇది అత్యంత ముఖ్యమైన పండుగలలో ఒకటన్నారు. మహా శివరాత్రి రోజున శివుడు తనను పూజించే భక్తుల జీవితాల్లో చీకటిని, అజ్ఞానాన్ని అధిగమించి, ఆనందం, శ్రేయస్సును ప్రసాదిస్తుందన్నారు. ఈ శుభ సందర్భం మనందరిలో ప్రేమ, ఆప్యాయత, స్నేహం సోదరభావం యొక్క గొప్ప ఆలోచనలను ప్రేరేపించాలని ఆకాంక్షించారు.

**మంత్రి లక్ష్మణ్‌కుమార్ శుభాకాంక్షలు**

పవిత్రమైన మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. శివుడు మనకు బోధించిన తత్వం, త్యాగం, సహనం, సమతా భావం, సేవ.ఆ మహాదేవుని కృపతో మన రాష్ట్రం శాంతి–సౌఖ్యాలతో వికసించాలని, ప్రజల జీవితాల్లో వెలుగు నిండాలని ఆకాంక్షించారు. మన ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలని, యువతకు అవకాశాలు, రైతులకు సుభిక్షం, లభించాలని కోరుకుంటున్ననన్నారు.

**టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్...**

పవిత్రమైన మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి మహేశ్ కుమార్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. పరమేశ్వరుడి ఆశీస్సులతో ప్రజల జీవితాల్లో శాంతి, సౌఖ్యం, ఐశ్వర్యం నిండాలని ఆకాంక్షించారు. ఉపవాస దీక్షలు, జాగరణలు, రుద్రాభిషేకాలు నిర్వహిస్తూ భక్తులు పరమశివుని ఆరాధించే మనలోని చెడు ఆలోచనలను తొలగించి, సత్సంకల్పాలతో ముందుకు సాగేందుకు ప్రేరణనిస్తుందని అన్నారు. ఈ మహా శివరాత్రి సందర్భంగా ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని, భక్తుల కోరికలు నెరవేరాలని ఆకాంక్షించారు.

# శివాజీ చరిత్రను వక్రీకరిస్తే సహించం

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నరసింహా



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఛత్రపతి శివాజీ మహారాజ్ చరిత్రను వక్రీకరిస్తే సహించబోమని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నరసింహా హెచ్చరించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాల సందర్భంగా సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన శివాజీ కటౌట్‌ను ఈటి నరసింహా ఆవిష్కరించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ చేసిన యుద్ధ నైపుణ్యాలు, గెలిచిన రాజ్యాలు, తను నెలకొల్పిన సామ్రాజ్యాన్ని మనువాద శక్తులు తప్పుదారి పట్టిస్తున్నాయన్నారు. శివాజీని ఒక మతానికి పరిమితం చేస్తూ మరొక మతానికి వ్యతిరేకంగా పోరాటం చేసినట్టు వక్రీకరిస్తున్నారని ఆగ్ర హం వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్ మాట్లాడుతూ నేటి తరానికి ఛత్రపతి శివాజీ మహారాజ్ వాస్తవ చరిత్రను వివరించేందుకు 2 రోజులపాటు హైదరాబాద్ నగర వ్యాప్తం గా ఇంటింటికి సిపిఐ ప్రచురించిన కరపత్రాలను పంపిణీ చేస్తూ చైతన్య పరచడానికి శ్రేణులంతా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్ ఛాయాదేవి, జిల్లా కార్యదర్శి స్టాలిన్ సహాయ కార్యదర్శి కమ తం యాదగిరి, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్ర మోహన్ గౌడ్, పడాల నళిని, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర, కార్య నిర్వహక అధ్యక్షుడు నేర్లకంటి శ్రీకాంత్, జిల్లా కౌన్సిల్ సభ్యులు మహమూద్, బాలకృష్ణ, చైతన్య, కళ్యాణ్, అనిల్, రాజమౌళి, బిక్షపతి, లెనిన్, సుశాంత్, అశ్విన్, భాను పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి సంజయ్‌వి అన్నీ ప్రగల్భాలే

ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

ప్రజాపక్షం/హైదరాబాద్ : కేంద్ర మంత్రి బండి సంజయ్‌వి అన్ని ప్రగల్భాలేనని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ కరీంనగర్‌కు చేసిన అభివృద్ధి ఏమిటో ఒక్క మాట చెప్పకుండా మతాన్ని రెచ్చ గొట్టి ఓట్లు సంపాదించినా ప్రజలు మాత్రం బిజెపి స్పష్టమైన తీర్పు ఇవ్వలేదన్నారు. రాజకీయాల్లో ఎన్నికల సమయంలో పొత్తులు, ఫలితాల తర్వాత స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పొత్తులు ఉంటాయన్నారు. కరీంనగర్‌లో కాంగ్రెస్, ఎంఐఎం కలిసి కుట్ర చేస్తున్నాయన్న బండి సంజయ్ వ్యాఖ్యలను ఖండిస్తున్నామని తెలిపారు. ఎంఐఎంతో తాము ఎలాంటి పొత్తు పెట్టుకోలేదని కేవలం ఆ పార్టీతో అవగాహన మాత్రమే ఉంటుందన్నారు. ఎంఐఎం పోటీ చేసిన స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు పోటీ చేసి, పోరాడి ఓడిపోయారని గుర్తు చేశారు. కాంగ్రెస్, ఎంఐఎంకి, ఇండిపెండెంట్లకి ఓట్లు వేసిన వాళ్లు కూడా కరీంనగర్ ప్రజలే అని అన్నారు. ఇన్ని మాటలు చెపుతున్న బండి సంజయ్ ఇండిపెండెంట్లను రాత్రి రాత్రి ఇంటికి పిలిచి ఎందుకు కండువాలు కప్పి బిజెపిలో చేర్చుకున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఇచ్చిన తీర్పు అనుగుణంగానే పార్టీల కార్యాచరణ ఉంటుందని పేర్కొన్నారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు కార్పోరేషన్లలో గుండు సున్నా మున్సిపాలిటీల్లో 14 మాత్రమే రాగా మాజీ మంత్రి కెటిఆర్ గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. నిజామాబాద్ ఎంపి ధర్మపురి అర్వింద్ మాట్లాడే భాష మాకు కూడా వచ్చని ఆయన అదుపులో ఉంటే బాగుంటుందన్నారు.

## 810 కిలోల బెల్లం పట్టివేత



ప్రజాపక్షం/హైదరాబాద్: దేవరకొండ ప్రాంతానికి హైదరాబాద్ నుంచి అక్రమంగా వెళ్తున్న 810 కిలోల బెల్లాన్ని ఎస్‌టిఎఫ్ బి టీం ఎస్‌ఐ బాలరాజు పట్టుకున్నారు. ఈ కేసులో వాహనంతో పాటు నానావత్ నగేష్, సభావత్ మల్లేషులను అరెస్ట్ చేసి దేవరకొండ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించారు. నల్లగొండ జిల్లా ప్రాంతంలో నర్సంపేటలో ఎస్‌టిఎఫ్ డి టీం దాడులు నిర్వహించి పది లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని 80 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. సి టీం మారేడుపల్లి స్టేషన్ పరిధిలో డింగన్ నిఖిల్ అనే వ్యక్తి వద్ద 550 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

## సిపిఐ బలపరిచిన స్వతంత్ర అభ్యర్థి కంభంపాటి ఘన విజయం



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్త-గూడెం : కొత్తగూడెం కార్పొరేషన్ 51వ డివిజన్ నుండి సిపిఐ సంపూర్ణ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన కంభంపాటి దుర్గాప్రసాద్ శుక్రవారం వెలువడిన కార్పొరేషన్ ఫలితాల్లో ఘన విజయం సాధించారు. తన సమీప కాంగ్రెస్ అభ్యర్థిపై 163 ఓట్ల ఆధిక్యత సాధించారు. కొత్తగూడెం మున్సిపాలిటీలో కూడా గతంలో ఆయన రెండు పర్యాయాలు విజయం సాధించారు. ఇప్పుడు కొత్తగూడెం కార్పొరేషన్ నుండి గెలుపొందిన కంభంపాటి వరుసగా మూడో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. అందరినీ కలుపుకుపోయే వ్యక్తిగా సౌమ్యుడుగా పేరున్న ఆయనను ఓటర్లు ప్రతిసారి అక్కున చేర్చుకుంటున్నారు.

## లండన్‌లో ఎఐఎస్ఎఫ్ నేత హరిప్రసాద్ హవా



ప్రజాపక్షం/హైదరాబాద్: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) తెలంగాణ కౌన్సిల్ నాయకుడు హరి ప్రసాద్ బొడ్డుపల్లి లండన్‌లో విద్యార్థి రాజకీయాల్లో మరో కీలక విజయాన్ని సాధించారు. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని యూనివర్సిటి ఆఫ్ గ్రీన్‌విచ్ స్టూడెంట్స్ యూనియన్ (జిఎస్‌యు) వైస్ ప్రెసిడెంట్‌గా 2026 ఎన్నికల్లో వరుసగా రెండోసారి ఆయన ఎన్నిక కావడం పట్ల ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపింది. నల్గొండ జిల్లా దేవరకొండకు చెందిన హరి ప్రసాద్ బొడ్డుపల్లి, వివిధ దేశాలకు చెందిన 30 వేల మందికి పైగా విద్యార్థులకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థి సమస్యలను ముందుకు తీసుకెళ్లడంలో, ప్రజాస్వామ్య భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని ఎఐఎస్ఎఫ్ పేర్కొంది. విద్యార్థుల అంశాలపై యుకె పార్లమెంట్ స్థాయిలో కూడా ఆయన చర్చల్లో పాల్గొంటూ వారి స్వరాన్ని వినిపిస్తున్నట్లు తెలిపింది. హైదరాబాద్‌లోని మఖ్దూమ్ భవన్‌లో మాజీ రెడ్ గార్డ్‌గా సేవలందించిన బొడ్డుపల్లి శ్రీనయ్య కుమారుడైన హరి ప్రసాద్ బొడ్డుపల్లి సమానత్వం, సేవా భావం, ప్రగతిశీల నాయకత్వ విలువలను కొనసాగిస్తున్నారని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ పేర్కొంది. ఈ విజయంతో ప్రపంచ వేదికలపై భారతీయ విద్యార్థి నాయకుల పాత్ర మరింత బలపడిందని, సమగ్ర విద్య, విద్యార్థుల హక్కులు, అంతర్జాతీయ ఐక్యత కోసం యువత ముందుకు రావడానికి ఇది ప్రేరణనిస్తుందని ఎఐఎస్ఎఫ్ అభిప్రాయపడింది. హైదరాబాద్‌లో విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాలు వెల్లడించింది.



# హంగ్ మున్సిపాలిటీలపైనే పార్టీల నజర్

● 15 మున్సిపాలిటీలలో ఇదే పరిస్థితి ● చైర్ పర్సన్, వైస్ చైర్పర్సన్ ఎన్నికల్లో స్వతంత్రులు, ఎక్స్ అఫీషియో సభ్యులు కీలకం ● అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్ క్యాంప్‌లు, బుజ్జగింపు ప్రయత్నాలు ● చాలా మున్సిపాలిటీల 'హస్తగతం'పై కాంగ్రెస్ ధీమా ● ఎక్స్ అఫీషియో సభ్యులతో పదవులను దక్కించుకునేందుకు బిఆర్ఎస్ ప్రయత్నాలు ● బిజెపికి పరిమితంగానే...

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం కొన్ని మున్సిపాలిటీలలో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ (మ్యాజిక్ ఫిగర్) రాకపోవడంతో మున్సిపాలిటీలలో క్యాంప్ రాజకీయాలకు, పదవులిస్తామని బుజ్జగింపుల పర్వం కొనసాగుతోంది. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 90కి పైగా మున్సిపాలిటీల్లో, బిఆర్ఎస్ 24 మున్సిపాలిటీల్లో విజయాలు సాధించాయి. అయితే పలు చోట్ల అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీ మధ్య గట్టిపోటీ కొనసాగింది. తెలంగాణ వ్యాప్తంగా 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు బుధవారం ఎన్నికలు జరుగగా ఓట్ల లెక్కింపు అనంతరం మొత్తం 15 మున్సిపాలిటీలలో ఏ పార్టీ మ్యాజిక్‌ఫిగర్‌ను అందుకోలేకపోవడంతో వాటిలో హంగ్ పరిస్థితి ఏర్పడింది. ప్రజలు హంగ్ తీర్పు ఇచ్చిన మున్సిపాలిటీల్లో పరకాల, అలంపూర్, నర్సాపూర్, జిన్నారం, కేసముద్రం, ఇస్నాపూర్, ఆసిఫాబాద్, జమ్మికుంట, జనగామ, కామారెడ్డి, అమరచింత, కోహీర్, దేవరకద్ర, ఆసిఫాబాద్, వేములవాడ, రాయికల్, జహీరాబాద్, మహబూబాబాద్, ఆలియాబాద్, బోధన్, గద్వాల, బెల్లంపల్లి, క్యాతనపల్లి మున్సిపాలిటీలు ఉన్నాయి. మున్సిపల్ చైర్మన్ ఎవరవుతారో నిర్ణయించడంలో శక్తి స్థానిక రాజకీయాలు కీలకంగా మారనున్నాయి. మున్సిపాలిటీల్లో హార్స్ ట్రేడింగ్‌కు కూడా తెరలేచిందని, స్వతంత్రులు, చిన్నపార్టీల అభ్యర్థులే ఇప్పుడు గేమ్ ఛేంజర్లుగా మారనున్నారని చెప్పవచ్చు. మ్యాజిక్ ఫిగర్ కోసం బేరసారాలు మొదలయ్యాయి. మున్సిపాలిటీల చైర్ పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికల్లో స్వతంత్రులు, ఎక్స్ అఫిషియో సభ్యులు కీలకం కానున్నారు. దీంతో హంగ్ పరిస్థితి ఉన్న మున్సిపాలిటీలను దక్కించికునేందుకు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్ ముఖ్యనేతలు రంగంలోకి దిగారు.

**కాంగ్రెస్ వైపు స్వతంత్రుల మొగ్గు**

ఎన్నికల్లో పోటీ చేసిన కాంగ్రెస్ రెబల్ అభ్యర్థులను పార్టీ అధినాయకులు బుజ్జగిస్తుండగా, స్వతంత్రులు అధికార కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో హంగ్ ఉన్న చాలా మున్సిపాలిటీలను కాంగ్రెస్ 'హస్తగతం' చేసుకునే అవకాశం ఉంది. ఈ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా అతిపెద్ద పార్టీగా కాంగ్రెస్ విజయం సాధించినప్పటికీ కొన్ని మున్సిపాలిటీలలో వెనుకబడింది. ఆ మున్సిపాలిటీలను హస్తగతం చేసుకునేందుకు పార్టీ పెద్దలు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. దేవరకద్ర, అలంపూర్, కేసముద్రం, జిన్నారం, గద్వాల్, జనగామ మున్సిపాలిటీలను కాంగ్రెస్ హస్తగతం చేసుకునే అవకాశాలు కనబడుతున్నాయి.

**ఎక్స్ అఫీషియో సభ్యులపై బిఆర్ఎస్ ధీమా**

ప్రతిపక్ష బిఆర్ఎస్ తమ ప్రజాప్రతినిధులు ఉన్న చోట ఎక్స్ అఫిషియో సభ్యులపై ఆధారపడి కొన్ని మున్సిపాలిటీలలో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. మున్సిపల్ చైర్ పర్సన్ పదవులను దక్కించుకోవడంలో కీలకమైన ఎక్స్ అఫీషియో ఓట్ల విషయంలో ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులతో చర్చించామని, తమ పార్టీకి ప్రజాప్రతినిధులు ఉన్న ప్రతి చోట కచ్చితంగా పట్టు సాధిస్తామని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ధీమా వ్యక్తం చేశారు. వేములవాడ, రాయికల్, క్యాతనపల్లి, అమరచింత మున్సిపాలిటీలలో బిఆర్ఎస్ బిజెపికి పరిమితంగానే... ఇక నిజామాబాద్, కరీంనగర్‌లో కొంత మేరకు బలాన్ని చాటిన బిజెపి కరీంనగర్ కార్పొరేషన్‌ను దక్కించుకునేందుకు సర్వ ప్రయత్నాలు చేస్తున్నది. బిజెపి కొద్దిచోట్ల మాత్రమే కీలక సంఖ్యలో ఉంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ పట్టణాల్లో ప్రభావం చూపే అవకాశం ఉంది. హంగ్ మున్సిపాలిటీల్లో డిసైడింగ్ ఓటు కావచ్చు. జహీరాబాద్, ఆసిఫాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీలలో చైర్మన్ పదవులు బిజెపికి రావచ్చని అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉండగా కోహీర్, అలియాబాద్ మున్సిపిలిటీలలో స్వతంత్రులే శాసించే అవకాశం ఉన్నట్లు కనబడుతున్నది.

**అభివృద్ధికి మద్దతు ఇవ్వండి : సిఎంను కోరిన ఎఐఎఫ్‌బి**

వడ్డేపల్లి మున్సిపాలిటీలో పాలకవర్గాన్ని ఏర్పాటు చేసేందుకు మద్దతును, మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకునేందుకు అవసరమైన సహాయ సహకారాలను అందించాలని వడ్డేపల్లి మున్సిపల్ ఎఐఎఫ్‌బి కౌన్సిలర్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీకి చెందిన 8 మంది ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ (ఎఐఎఫ్‌బి) కౌన్సిలర్‌లు శనివారం వడ్డేపల్లి శ్రీనివాస్ నేతృత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపి మల్లు రవి, ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ జిల్లెల చిన్నారెడ్డి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే ఎస్.ఎ.సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎక్కువ సంఖ్యలో మున్సిపాలిటీలను సొంతం చేసుకోవాలి



మంత్రులు, ముఖ్య నాయకులకు సిఎం దిశానిర్దేశం

హంగ్ ఏర్పడిన మున్సిపాలిటీల్లో సాధ్యమైనంత ఎక్కువ సంఖ్యలో సొంతం చేసుకునే లక్ష్యంతో ముందుకు సాగాలని మంత్రులు, పార్టీ ముఖ్య నేతలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశా నిర్దేశనం చేశారు. హంగ్ ఏర్పడిన మున్సిపాలిటీల్లో మెజారిటీ స్థానాలను కైవసం చేసుకునే సాధ్యాసాధ్యాలపై సిఎం రేవంత్‌రెడ్డి శనివారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సిఎం క్యాంప్ కార్యాలయంలో అందుబాటులో ఉన్న మంత్రులు, పార్టీ ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలపై సిఎం సమీక్షించారు. స్వతంత్రుల మద్దతుతో సాధ్యం కానున్న మ్యాజిక్ ఫిగర్, అసాధ్యమనుకుంటున్న వాటిపై సమీక్షించారు. ఆ వివరాల ఆధారంగా తదుపరి వ్యూహం ఎలా ఉండాలనేదానిపై టిపిసిసి అధ్యక్షుడు, మంత్రులు, సీనియర్ నాయకులకు సిఎం పలు సూచనలు చేశారు. అదేవిధంగా హంగ్ ఏర్పడిన మున్సిపల్ కార్పోరేషన్లపై సైతం సిఎం సమీక్షించారు. ఇందులో కరీంనగర్, నిజామాబాద్ కార్పొరేషన్లలో బిజెపి మ్యాజిక్ ఫిగర్‌కు దాదాపు దగ్గరగా ఉండడంతో ఎలాంటి వ్యూహాలను అనుసరించాలనే అంశంపై సైతం చర్చించినట్లు సమాచారం. కొత్తగూడెం కార్పొరేషన్‌పై సైతం సిఎం చర్చించారు.

## కానిస్టేబుల్ మరణం పట్ల డిజిపి సంతాపం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని చందనపల్లి ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మునుగోడు పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ షేక్ తయూబ్ దుర్మరణం చెందడం పట్ల డిజిపి బి.శివధర్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఎన్నికల విధులను నిర్వహించి, తిరిగి వస్తున్న క్రమంలో డిసిఎం వాహనం రూపంలో మృత్యువు కబళించడం కలచివేసిందని డిజిపి ఆవేదన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఒక యువ కానిస్టేబుల్‌ను కోల్పోవడం పోలీస్ శాఖకు తీరని లోటని, తయూబ్ సేవలు మరువలేనివన్నారు. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారికి పోలీస్ శాఖ అన్ని విధాలా అండగా ఉంటుందని డిజిపి భరోసా ఇచ్చారు. రోడ్డు ప్రమాదంలో షేక్ తయుబ్ ను కోల్పోయిన బాధలో ఉన్న కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని డిజిపి బి.శివధర్ రెడ్డి తన సంతాపాన్ని తెలియజేశారు.



## జిహెచ్ఎంసిని సందర్శించిన ట్రైనీ ఐఎఎస్‌లు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఐఎఎస్ ప్రొఫెషనల్ కోర్సు శీతాకాల స్టడీ టూర్‌లో భాగంగా 2025 బ్యాచ్‌కు చెందిన వివిధ రాష్ట్రాల ట్రైనీ ఐఎఎస్ అధికారులు శనివారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ట్రైనీలు జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ కలసి తమను పరిచయం చేసుకున్నారు. అనంతరం కమిషనర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిహెచ్ఎంసి పనితీరు, బాధ్యతలు, పాలనా వ్యవస్థపై సమగ్ర అవగాహన కల్పించారు. జిహెచ్ఎంసి నిర్మాణం, చట్టబద్ధ విధులు, నగర పరిపాలనలో ఎదురయ్యే సవాళ్లు, విధానాల అమలు వంటి అంశాలను వివరించారు. వేగంగా విస్తరిస్తున్న మహానగరంలో పౌర సేవలను సమర్థంగా అందించేందుకు చేపడుతున్న చర్యలను తెలియజేశారు. పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, ఇంజనీరింగ్, మౌలిక వసతుల అభివృద్ధి, టిడిఆర్ విధానం అమలు, సంక్షేమ పథకాలు, ఐటీ ఆధారిత సేవలు వంటి ప్రాధాన్య రంగాలపై ప్రత్యేకంగా వివరించారు. భవన అనుమతుల ప్రక్రియను వేగవంతం చేసి పారదర్శకత పెంచేందుకు ప్రవేశపెట్టిన 'బిల్డ్‌నౌ' యాప్‌ను ప్రత్యేకంగా ప్రస్తావించారు. మహానగర పరిపాలన విస్తృతి, సమస్యలు, సవాళ్లను వివరించిన కమిషనర్ సమగ్ర ప్రణాళిక, ఫీల్డ్ స్థాయి పర్యవేక్షణ, సాంకేతికత వినియోగం ద్వారా సేవలను మరింత మెరుగుపరుస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ట్రైనీ ఐఏఎస్‌లు లేవనెత్తిన సందేహాలను నివృత్త చేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సిటీప్లానర్ కె.శ్రీనివాస్, చీఫ్ ఇంజనీర్, అదనపు కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

## నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాలతో ముందుకెళ్లాలి

ఎఐఎఫ్‌బి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జావేద్ లతీఫ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాలకు అనుగుణంగా ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి గెలుపొందిన కౌన్సిలర్లు, కార్పొరేటర్లు సామాజిక బాధ్యతలో వారి మున్సిపాలిటీలలో, కార్పొరేషన్‌లలో స్థానిక సమస్యలపై దృష్టి సారించి, ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన తెలంగాణను నిర్మించడానికి కృషి చేయాలనీ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జావేద్ లతీఫ్ కోరారు. తెలంగాణ రాష్ట్రంలోని మున్సిపల్ ఎన్నికల్లో ఎఐఎఫ్‌బి పార్టీని ఆదరించి, గెలిపించిన రాష్ట్ర ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుని మున్సిపల్ పాలనలో భాగమవుతున్న ఎఐఎఫ్‌బి అభ్యర్థులకు ఇది గొప్ప బాధ్యత అని గుర్తు చేశారు. స్వచ్ఛ భారత్ అభియాన్‌లో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలుపవలసిన బాధ్యత మనందరిపై ఉందని జావేద్ లతీఫ్ అన్నారు.

## ఈ నెల 16న 'ప్రజావాణి'

సిఎంసి కమిషనర్ సృజన



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) పరిధిలోని పౌరుల సమస్యలను నేరుగా విని, వాటిని పరిష్కరించేందుకు ఈ నెల 16వ తేదీ నుంచి 'ప్రజావాణి' కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు కమిషనర్ జి.సృజన తెలిపారు. మాదాపూర్‌లోని న్యాక్ బిల్డింగ్‌లో ఉన్న సిఎంసి కార్యాలయం మొదటి అంతస్తులోని మీటింగ్ హాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంట వరకు నిర్వహిస్తామన్నారు. పౌరులు తమ సమస్యలకు ఫిర్యాదులను నేరుగా అధికారులకు అందజేయవచ్చు అన్నారు. మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్యం, డ్రైనేజీ సమస్యలు, వీధి దీపాల నిర్వహణ, భవన నిర్మాణ అనుమతులు, ఇతర మున్సిపల్ సేవల కోసం ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను స్వయంగా పరిశీలించి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని కమిషనర్ చెప్పారు. కార్పొరేషన్ పరిధిలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు.

**బొకేలు, శాలువాలు వద్దు.. ప్రజా సమస్యలే ప్రాధాన్యం : కమిషనర్**

ఆర్భాటాలకు దూరంగా, ప్రజలకు చేరువగా ఉండాలనే లక్ష్యంతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కొత్త కమిషనర్ జి. సృజన కీలక నిర్ణయం తీసుకున్నారు. తనను కలిసేందుకు వచ్చే వారు ఎవరూ కూడా బొకేలు, శాలువాలు, మిఠాయిలు తీసుకురావద్దని ఆమె విజ్ఞప్తి చేశారు. ఇటీవలే బాధ్యతలు చేపట్టిన కమిషనర్, మర్యాదపూర్వక కలయికల్లో అనవసర ఖర్చులను తగ్గించాలని కోరారు. బహుమతులపై సమయం, డబ్బు వృథా చేయకుండా, క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారంపైనే పూర్తి దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. 'శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చే ప్రజా ప్రతినిధులు, అధికారులు మరియు ప్రజలు ఎవరూ కూడా ఖరీదైన బహుమతులు లేదా శాలువాలు తీసుకురావద్దు. ఆడంబరాల కంటే ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే మన ప్రథమ కర్తవ్యం' అని ఆమె అన్నారు.

## ఆర్‌టిసి 'చలో సెక్రటేరియట్'కు ఎఐటియుసి మద్దతు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎన్నోయేండ్ల చరిత్ర కలిగిన ఆర్‌టిసి సంస్థ పరిరక్షణ కొరకు, కార్మికుల సమస్యల సాధనకై ఫిబ్రవరి 24న తలపెట్టిన ఛలో సెక్రెటేరియట్ కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొంటామని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ తెలిపారు. ఆర్‌టిసి జెఎసికి సంఘీభావం, మద్దతు తెలుపుతూ, ప్రభుత్వం వెంటనే ఆర్‌టిసి కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆర్‌టిసి ఉద్యోగ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా నియమించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టడంతో పాటు 2021 సంవత్సరం వేతన సవరణ 30శాతం ఫిట్‌మెంట్‌తో వెంటనే అమలు చేయాలని ఆయన కోరారు. మహాలక్ష్మి పథకం పేరుతో ప్రభుత్వం ఇవ్వాల్సిన డబ్బులు ప్రతినెల రూ. 350 కోట్లు ఎలాంటి మినహాయింపులు లేకుండా ఆర్‌టిసికి చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రజాపాలన, సంక్షేమ పాలనలో భాగంగా పాత బకాయిలు రూ. 2500 కోట్లు వెంటనే చెల్లించాలన్నారు. ఆర్‌టిసిలో పనిచేస్తున్న వేలాది డ్రైవర్లు, కండక్టర్లు ఇతర టెక్నికల్ స్టాఫు వారందరికి పెన్షన్ సౌకర్యం వర్తించేలా తగిన చర్యలు తీసుకోవాలని, ఈ న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం పరిష్కరించకుంటే రాష్ట్రంలోని అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని పోరాటాలు, ఉద్యమాలు చేసి అన్ని కార్మిక సంఘాలతో సమ్మెకు పూనుకుంటామని బాల్‌రాజ్ హెచ్చరిక చేశారు.

# అహింసా మార్గంలో జీవకారుణ్యం








మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలోని కెబిఆర్ పార్కులో శనివారం 'డాగ్ అడాప్షన్' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, సీతక్క ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కొండా సురేఖ చేతుల మీదుగా స్వదేశీ కుక్కపిల్లను మంత్రి సీతక్క దత్తత తీసుకుని ఆదర్శంగా నిలిచారు. ఎంపి రేణుకా చౌదరి కూడా మంత్రి సీతక్క చేతుల మీదుగా ఒక కుక్కపిల్లను దత్తత తీసుకున్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ నగర నడిబొడ్డున ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. స్ట్రే డాగ్స్‌ను దత్తత తీసుకోవడం ద్వారా వాటికి జీవించే హక్కు కల్పించడమే కాకుండా సమాజంలో మానవత్వాన్ని పెంపొందించవచ్చని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అహింసా సిద్ధాంతాన్నే అనుసరించిందని, అహింసా మార్గంలోనే దేశానికి స్వాతంత్ర్యం సాధించిందన్నారు. ప్రతి ప్రాణికీ జీవించే హక్కు ఉందని, విశ్వాసానికి మారుపేరు కుక్క అని వ్యాఖ్యానించారు. తెలంగాణలో కొన్ని ప్రాంతాల్లో సర్పంచ్లు కుక్కలను చంపిన ఘటనలను ప్రస్తావిస్తూ, అలాంటి సంఘటనలను ప్రభుత్వం ఖండించిందని, బాధ్యులపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇలాంటి విషయాలను రాజకీయంగా మలచడం సరికాదని, ఎవరూ కుక్కలను హానిచేయకుండా నియంత్రణ చర్యలు పాటిస్తూ మానవత్వంతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో ప్రతి ఇంటికీ ఒక కుక్క ఉండేదని, ఒక కుక్క పది మందితో సమానంగా కాపలా కాస్తుందని మంత్రి సీతక్క అన్నారు. దేశంలో అనేక స్వదేశీ డాగ్ బ్రీడ్స్ ఉన్నాయని, ఇండియన్ డాగ్స్‌ను దత్తత తీసుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్, మాజీ కార్పొరేటర్ విజయారెడ్డి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, జోనల్ కమిషనర్ ప్రియాంక అల పాల్గొన్నారు.

# న్యాయమైన ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు ఆదిల్ షరీఫ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌ను మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ (ఐఎన్‌టియుసి) ప్రతినిధులు కలిసి ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐఎన్‌టియుసి హైదరాబాద్ అధ్యక్షుడు ఆదిల్ షరీఫ్ నేతృత్వంలో యూనియన్ నాయకులు కమిషనర్‌ను కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకపోయారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఏవిఎస్ గాంధీ, మహిళా కమిటీ చైర్పర్సన్ ఎల్. మెర్సీ, అదనపు జనరల్ కార్యదర్శి కె. శివకుమార్, కార్యదర్శి ఉమా మహేశ్వరి, కార్యదర్శి అంజుమ్, కార్యనిర్వాహక కార్యదర్శి పల్లవి పాల్గొన్నారు. అనంతరం ఆదిల్ షరీఫ్ మాట్లాడుతూ మూడు కార్పొరేషన్‌ల ఏర్పాటు సమయంలో సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్‌లకు బదిలీ చేసిన జిహెచ్ఎంసి ఉద్యోగులను తిరిగి జిహెచ్ఎంసికి రప్పించాలన్నారు. ఉద్యోగుల నివాస ప్రాంతాలను పరిగణనలోకి తీసుకుని 10 కిలో మీటర్ల పరిధిలో పోస్టింగ్ ఇవ్వాలని కోరారు. ఉద్యోగులకు అనుకూలంగా పారదర్శకమైన, న్యాయమైన ట్రాన్స్‌పోర్ట్ పాలసీ రూపొందించాలన్నారు. జిహెచ్ఎంసి నుంచి మలాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లకు బదిలీ అయిన ఉద్యోగుల సీనియారిటీ దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సీనియారిటీ రక్షణతో పాటు పదోన్నతులు, బదిలీల సర్దుబాటు అంశాలలో న్యాయం చేయాలన్నారు. మహిళా ఉద్యోగుల కోసం మానవతా దృక్పథంతో ప్రత్యేక నిబంధనలు అమలు చేయాలన్నారు. జిహెచ్ఎంసి, ఎంఎంసి, సిఎంసి పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఉద్యోగుల ప్రయోజనాలు, మెరుగైన పరిపాలన దృష్ట్యా కమిషనర్ సానుకూలంగా స్పందించారన్నారు.

# మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌లో 'ప్రజావాణి'



ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) పరిధిలోని పౌరుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి సోమవారం 'ప్రజావాణి' కార్యక్రమాన్ని నిర్వహించాలని కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. 74 వార్డులు, 14 సర్కిళ్లు, మూడు జోన్లతో నూతనంగా ఏర్పడిన ఈ కార్పొరేషన్ పౌరులకు మరింత చేరువయ్యేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. సోమవారం ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు అన్ని సర్కిల్, జోనల్, తార్నాకలోని ప్రధాన కార్యాలయాల్లో నిర్వహిస్తామని చెప్పారు. ప్రధాన కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో కమిషనర్‌తో పాటు అన్ని విభాగాల అధిపతులు పాల్గొననున్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవడానికి ఇదొక మంచి అవకాశమని కమిషనర్ తెలిపారు.

**ఆటో నగర్ డంపింగ్ యార్డ్ సందర్శన : పనుల సమీక్ష**

పారిశుధ్య నిర్వహణను మెరుగుపరిచే చర్యల్లో భాగంగా కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి నేడు అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. మన్సూరాబాద్‌లోని ఆటో నగర్ డంపింగ్ యార్డ్‌ను కమిషనర్ సందర్శించారు. వ్యర్థాల నిర్వహణ, తొలగింపు పద్ధతులను సమీక్షించారు. అక్కడ ఉన్న సౌకర్యాలను మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. నాగోల్ సర్కిల్ పరిధిలోని సౌతెండ్ పార్క్ కాలనీలో నిర్మాణంలో ఉన్న స్టార్మ్ వాటర్ డ్రైన్ పనులను పరిశీలించారు. వర్షాకాలం దృష్ట్యా ఈ పనులను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. ఈ పర్యటనలో డిప్యూటీ కమిషనర్ రవీందర్ రెడ్డి, సిఇ అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia
దక్షిణమధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

టెండర్ నోటీసు నం: G/E.29/Tr./ టెండర్ నోటీసు/53/2025-26 తేదీ: 13.02.2026
PUB/1939

భారత రాష్ట్రపతి తరపున మరియు వారి తరపున సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/ట్రాక్షన్/గుంతకల్ కింది పనులకు ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

**1. టెండర్ నంబర్:** GTL-TRD-29-eTN-84-2025-26 పని పేరు: GDR-TPTY-KPD మరియు HX-RU విభాగాలలో భద్రతకు సంబంధించి రాతి పిచింగ్, మట్టి నింపడం ద్వారా OHEని బలోపేతం చేయడం. **సుమారు విలువ:** (రూ.) 1,81,40,500/- **EMD:** (రూ.) 2,40,700/-

టెండర్ ముగింపు తేదీ & సమయం: 06.03.2026 మధ్యాహ్నం 3 గంటలకు

**గమనిక:** 1. టెండర్ డాక్యుమెంట్‌ను టెండరుదారులు www.ireps.gov.in నుండి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. టెండర్ మరియు ఇతర వివరాల కోసం http://www.ireps.gov.in కు లాగిన్ అవ్వండి. ఏదైనా సవరణ ఉంటే ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, ట్రాక్షన్, గుంతకల్

టెండర్ నంబర్. 33 2025-26 సీనియర్ DEE TRD HYB, తేదీ: 12.02.2026
PUB/1941

భారత రాష్ట్రపతి తరపున మరియు వారి తరపున వ్యవహరించే సీనియర్ DEE/TRD/HYB టెండర్ నంబర్ 33 2025-26 సీనియర్ DEE TRD HYB, తేదీ: 12.02.2026, **ముగింపు తేదీ:** 11.03.2026, మధ్యాహ్నం 3:00 గంటలకు E-టెండర్లను ఆహ్వానిస్తున్నారు. బిడ్డర్లు తమ అసలు/సవరించిన బిడ్లను ముగింపు తేదీ మరియు సమయం వరకు మాత్రమే సమర్పించాలి. ఇ-టెండర్‌కు వ్యతిరేకంగా స్వయంగా ఇస్తే అనుమతించరు మరియు ఒకవేళ అలాంటి వాటిని స్వీకరించిన బుట్టదాఖలు చేయబడును.

**1. పని వివరణ:** హైదరాబాద్ డివిజన్ ముద్ఖేడ్ జంక్షన్ [MUE (excl.)] - ఉమ్రి (UMRI), నిజామాబాద్ (NZB) మరియు కామారెడ్డి (KMC) డిపోల పరిధిలోని అకనపేట్ [AKE (incl.)] విభాగాల TrD ఆస్తుల కాలానుగుణ నిర్వహణ & బ్రేక్‌డౌన్ శ్రద్ధను అవుట్ సోర్సింగ్ చేయడం మరియు మనోహరాబాద్ (MOB) కింద అకనపేట్ [AKE (incl.)] - గొల్లపల్లి [GLY (excl.)] విభాగాలు, కాచిగూడ (KCG) మరియు తిమ్మాపూర్ (TMX) డిపోల అధికార పరిధి రెండేళ్ల (24 నెలలు) **టెండర్ ప్రకటించిన ధర:** (రూ.) 4,13,77,517.16/- **E.M.D** (రూ.) 3,56,900.00 **పూర్తి కాలం:** 02 సంవత్సరాలు (24 నెలలు) **ముగింపు తేదీ:** 11.03.2026.

వెబ్‌సైట్ వివరాలు: www.ireps.gov.in నోటీసు బోర్డు టెండర్ యొక్క పూర్తి వివరాలను చూడగలిగే స్థానం. : Sr.DEE/TRD/HYB కార్యాలయం, హైదరాబాద్ భవన్, సికింద్రాబాద్ 500025.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్, హైదరాబాద్

టెండర్ నంబర్. 34 2025-26 సీనియర్ DEE TRD HYB, తేదీ: 12.02.2026
PUB/1942

భారత రాష్ట్రపతి తరపున మరియు వారి తరపున వ్యవహరించే సీనియర్ DEE/TRD/HYB టెండర్ నంబర్ 34 2025-26 సీనియర్ DEE TRD HYB, తేదీ: 12.02.2026, **ముగింపు తేదీ:** 11.03.2026, మధ్యాహ్నం 3:00 గంటలకు ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు. బిడ్డర్లు తమ అసలు/సవరించిన బిడ్లను ముగింపు తేదీ మరియు సమయం వరకు మాత్రమే సమర్పించగలరు. ఇ-టెండర్‌కు వ్యతిరేకంగా స్వయంగా ఇస్తే అనుమతించరు మరియు ఒకవేళ అలాంటి వాటిని స్వీకరించిన బుట్టదాఖలు చేయబడును.

**1. పని వివరణ: 1)** హైదరాబాద్ డివిజన్ గొల్లపల్లి [GLY (excl.)] - గద్వాల్ [GWD (excl.)] & దేవరకద్ర [DKC (excl.)] - మహబూబ్ నగర్ (MBNR) మరియు మక్తల్ (MKTL) డిపోల అధికార పరిధిలోని [KSN (excl.)] విభాగాల కాలానుగుణ నిర్వహణ & విచ్ఛిన్న శ్రద్ధను అవుట్ సోర్సింగ్ చేయండి. **2)** హైదరాబాద్ డివిజన్ - గద్వాల్ జంక్షన్ [GWD (excl.)] - ధోన్ [DHNE (excl.)] & గద్వాల్ జంక్షన్ [GWD (incl.)] - రాయచూర్ జంక్షన్ [RC (excl.)] గద్వాల్ (GWD), కర్నూల్ నగరం (KRNT), పాండురంగస్వామి రోడ్డు (PASR) డిపోల అధికార పరిధిని రెండేళ్ల (24 నెలలు) కాలానికి అవుట్ సోర్సింగ్ చేయండి. **టెండర్ ప్రకటించిన ధర:** (రూ.) 3,22,84,831.59/- **E.M.D** (రూ.) 3,11,400.00/- **పూర్తి కాలం:** 02 సంవత్సరాలు (24 నెలలు) **ముగింపు తేదీ:** 11.03.2026

వెబ్‌సైట్ వివరాలు: www.ireps.gov.in నోటీసు బోర్డు టెండర్ యొక్క పూర్తి వివరాలను చూడగలిగే స్థానం Sr.DEE/TRD/HYB కార్యాలయం, హైదరాబాద్ భవన్, సికింద్రాబాద్ 500025.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్, హైదరాబాద్

టెండర్ నోటీసు నం: 59/2026
తేదీ.13.02.2026
స్టోర్ వస్తువుల సరఫరా ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు
PUB/1944

కింది టెండర్లు ఆన్‌లైన్‌లో ఫ్లోట్ చేయబడ్డాయి. టెండర్లు www.ireps.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి, వారి ఆఫర్లను ఆన్‌లైన్‌లో సమర్పించాలని అభ్యర్థించబడింది. టెండర్ వివరణ, Qty, EMD, SD వెబ్‌సైట్‌లో చూడవచ్చు. ఇ-టెండర్‌కు వ్యతిరేకంగా స్వయంగా ఇస్తే అనుమతించరు. పోస్ట్ ద్వారా ఆఫర్లు స్వీకరించబడవు. టెండర్ ముగింపు సమయం టెండర్ గడువు తేదీ నుండి మధ్యాహ్నం 02.30 గంటలు. "అన్ని స్వదేశీ ఆఫర్ల కోసం, www.ireps.gov.inలో అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ సిస్టమ్ ద్వారా మాత్రమే EMD అంగీకరించబడుతుంది."

| టెండర్ నెం. | సంక్షిప్త వివరణ |
|---|---|
| 66265001 | ప్లాసర్ మేక్ యొక్క ట్రాక్ మెషిన్ విడిభాగాలు |
| 38263595 | బాక్స్ వ్యాగన్ల కోసం డోర్ అరేంజ్‌మెంట్ |
| 56255393 | సింగిల్ సెక్షన్ డిజిటల్ యాక్సిల్ కౌంటర్(SSDAC) ఫేజ్ రివర్సల్ రకం |
| 33251625A | కిట్ మార్చాలి |
| 38261634 | వెంట్ తో కట్ ఆఫ్ యాంగిల్ కాక్ |
| 66265215 | ప్లాసర్ మేక్ యొక్క ట్రాక్ మెషిన్ విడిభాగాలు |
| 52255011A | డీజిల్ లోకో కోసం IP ఆధారిత VSS |
| 6025PT043 | 12 CMS జింగ్‌లలో 1ని RDSO Drgకి కొనుగోలు చేయడం; T-4220 |
| 30263641 | సైడ్ ఫ్లాంజ్‌ల సెట్ |
| 33261642 | POH కిట్‌ను మార్చాలి |
| 90265001 | M.S. ఫ్లాట్స్ స్టీల్ సైజు 40x6MM నుండి IS;2062/2006 స్పెసిఫికేషన్ E250 గ్రేడ్ A పొడవు 6 MTRSతో |
| 66259415A | వేరియబుల్ సేకరణ ట్రాక్ మెషిన్ కోసం డిస్‌ప్లేస్‌మెంట్ పంప్ |
| 38261900 | బాక్స్‌న్ వేరియంట్లు & బోస్ట్ కోసం ఫ్లాప్ డోర్ అరేంజ్‌మెంట్ వేరియంట్లు |
| 54255015 | 08 లేన్ ఇంటరాక్టివ్ ఫైర్ ఆర్మ్ ట్రైనింగ్ సిమ్యులేటర్ |
| 33261213 | ఇంటర్ కార్ గ్యాంగ్‌వే మౌంటింగ్ |
| 38261219 | షాంక్ వేర్ ప్లేట్‌తో కప్లర్ బాడీ |
| 31261632 | బాడీ సైడ్ విండో Arrgt |
| 66265052 | ట్రాక్ మెషిన్ల కోసం విడిభాగాల సేకరణ. |

గమనిక:- టెండర్ గడువు తేదీలు ప్రారంభం: క్ర.సం.01 నుండి 03 వరకు తేది: 04.03.2026న, క్ర.సం. 04&05 వరకు తేది: 05.03.2026న, క్ర.సం. 06 నుండి 10 వరకు తేది: 09.03.2026న, క్ర.సం. 11 నుండి 13 వరకు 10.03.2026న, క్ర.సం. 14 వరకు తేది: 11.03.2026న, క్ర.సం. 15 నుండి 17 వరకు తేది: 12.03.2026న, క్ర.సం. 18 వరకు తేది: 17.03.2026న.

సవరణ

టెండర్ నోటీసు నం.56/2025 తేదీ. 23.01.2026 టెండర్ నం. 29255018A 09.02.2026న గడువు తేదీ సంక్షిప్త సమాచారం; రూఫ్ మౌంటెడ్ ఎయిర్ కండిషనింగ్ సిస్టమ్ సరఫరా, సంస్థాపన & కమిషన్ చేయడాన్ని గడువు తేదీ 17.02.2026గా చదవవచ్చు. ఇప్పటికే ఉన్న వాటి గురించి తెలియజేయబడింది.

పైన పేర్కొన్న టెండర్లతో పాటు రూ.50 లక్షల కంటే ఎక్కువ విలువ కలిగిన ఇతర టెండర్లు కూడా ఉన్నాయి.

వివరాల కోసం, దయచేసి పైన ఉన్న రైల్వే వెబ్‌సైట్‌ను సందర్శించండి.

ప్రిన్సిపల్ చీఫ్ మెటీరియల్స్ మేనేజర్/సికింద్రాబాద్

A2467

మరిన్ని టెండర్ షరతులు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.

### తెలంగాణలో భారీ విజయం
## ప్రభుత్వ ప్రజావిధానాలకు ఆమోదం


ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ప్రశంసలు

**న్యూఢిల్లీ :** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సామాజిక న్యాయం, గౌరవం, సమ్మిళిత వృద్ధిపై దృష్టి సారించిన ప్రభుత్వ ప్రజాకేంద్రీకృత విధానాలకు ఆమోదం అని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ శనివారం అన్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి పురోగతి చేరే ప్రజాతెలంగాణను సృష్టించాలనే తన దార్శనికతకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని రాహుల్‌గాంధీ అన్నారు. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కూడా పార్టీ విజయాన్ని ప్రశంసించారు. ఇది కాంగ్రెస్‌పై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వానికి ప్రోత్సాహకరంగా, తెలంగాణలో కాంగ్రెస్ మున్సిపల్ ఎన్నికల్లో ఘన విజయం సాధించిందని, బిఆర్‌ఎస్, బిజెపి తమ ఉనికిని చాటుకున్నాయన్నారు. 'తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల విజయం సామాజిక న్యాయం, గౌరవం, సమ్మిళిత వృద్ధిపై ఆధారపడిన కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజలే ముందున్న విధానాలకు స్పష్టమైన ఆమోదం' అని రాహుల్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, నాయకుడికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ విజయం మీకు, తెలంగాణ ప్రజలకు చెందుతుందన్నారు. ప్రతి కుటుంబానికి పురోగతి చేరే ప్రజా తెలంగాణ అనే మా దార్శనికత స్థిరంగా ఉందని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు. పోల్ ఫలితాలను స్వాగతిస్తూ, పార్టీ అధ్యక్షుడు ఖర్గే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా తెలంగాణ గంభీరమైన ధృవీకరణలో 3.8 కోట్ల మందికి సామాజిక న్యాయం, ఆర్థిక సాధికారత, నిరంతర పురోగతి హామీ ఇవ్వబడిన రాష్ట్రంలో దృఢంగా ఉందని అన్నారు. తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రశంసనీయమైన విజయం సాధించినందుకు తెలంగాణ కాంగ్రెస్ నిబద్ధత కలిగిన అట్టడుగు కార్యకర్తలకు కృతజ్ఞతలని, ఈ విజయం ప్రజల విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుందని ఖర్గే పేర్కొన్నారు.

# తెలంగాణలో రూ.3,178 కోట్లతో ఫోర్‌లేన్ హైవే విస్తరణ

- నారాయణపూర్, మహబూబ్‌నగర్ జిల్లాలకు మేలు
- మహారాష్ట్ర, గుజరాత్ సహా మొత్తం రూ.11వేల కోట్లు
- కేంద్ర మంత్రివర్గం ఆమోదం

**న్యూఢిల్లీ:** తెలంగాణలో 167వ నెంబరు జాతీయ రహదారిని నాలుగు లైన్లకు విస్తరించేందుకు కేంద్రమంత్రివర్గం ఆమోదం తెలియజేసింది. దీనివల్ల నారాయణ్‌పేట్, మహబూబ్‌నగర్ జిల్లాలకు ప్రయోజనం కలుగుతుంది. హైదరాబాద్-పనాజీ ఆర్థిక కారిడార్‌లో గుడెబెళ్ళూర్ నుండి మహబూబ్ నగర్ వరకూ రూ.3,178 కోట్ల మూలవ్యయంతో మొత్తం 80.01 కి.మీ నిడివిగల జాతీయ రహదారిని నాలుగు వరుసలకు విస్తరించేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ (సిసిఇఎ) శనివారం ఆమోదం తెలియజేసింది. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంలో హెచ్ఎఎం (హైబ్రీడ్ యాన్యుటీ మోడ్) రహదారి ప్రాజెక్టుల నిర్మాణంలో భాగంగా రూ.11,000 కోట్లపైగా మొత్తంలో బిజెపి పాలిత మహారాష్ట్ర, గుజరాత్‌లతోపాటు తెలంగాణలో కూడా నిర్మాణానికి ఈ కేటాయింపులు వర్తిస్తాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణంవల్ల ప్రయాణ సమయం సగానికి సగం తగ్గిపోతుంది. కేంద్ర రోడ్డు రవాణా,జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ ఈ విషయం వెల్లడించింది. శుక్రవారం మంత్రివర్గ సమావేశ వివరాలను మంత్రిత్వశాఖ శనివారం విడుదల చేసింది. మహారాష్ట్రలోని 160 ఎ జాతీయ రహదారి ఘోతి-త్రయంబక్(మోఖాడ)-జవర్-మనోర్-పాల్‌ఘర్ సెక్షన్‌లో రహదారిని ప్రస్తుతం ఉన్నస్థాయి నుండి మరింతగా విస్తరించేందుకు, పునరావాసం కల్పించేందుకు వీలుగా సిసిఇఎ రూ.3,320.38 కోట్లు పెట్టుబడిని కేటాయించింది. పశ్చిమ నాసిక్ రీజియన్, ప్రత్యేకించి అంబాద్, సత్పూర్ చుట్టుపక్కల మహారాష్ట్ర పారాశ్రామిక అభివృద్ధి కార్పొరేషన్ పరిశ్రమల యూనిట్లను బ్రహ్మాండంగా అభివృద్ధి చేసింది. దీనివల్ల ఈ ప్రాంతంలో చాలా ఎక్కువగా విమాన రవాణా రద్దీ పెరుగుతుంది. ఈ కారణంగా జాతీయ రహదారులకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని మంత్రిత్వశాఖ తన ప్రకటనలో తెలియజేసింది. అదేవిధంగా మహారాష్ట్రలో ఎన్‌హెచ్-160 ఎపై 154.635 కి.మీ సెక్షన్‌లో పునరావాసంతోపాటు ప్రస్తుతం ఉన్న రోడ్లస్థాయిని మరింత బాగా విస్తరించి అభివృద్ధి చేసేందుకు ఇంజనీరింగ్, భూసేకరణలకుగాను ఈ కేటాయింపులు చేశారు. ప్రధానమంత్రి గతిశక్తి కింద ఈ ప్రాజెక్టును ప్రతిపాదించారు. వీటిని ఇతర పథకాల కింద జోడిస్తారు. దీనివల్ల రహదారిలో వాహన రాకపోకలు, రవాణా చాలా సులభంగా వెళుతూ ఎంతో అభివృద్ధి సాధించగలుగుతామని ప్రకటన పేర్కొంది. కాగా గుజరాత్ రాష్ట్రంలో రూ.4,583.64 కోట్లతో నాలుగులైన్‌ల జాతీయ రహదారి నిర్మిస్తారు. ధమసియ-బిటడ/మోవి, నసర్‌పోర్-మాలోథ సెక్షన్‌లో నాలుగు లైన్ల రహదారిని నిర్మాణానికి సిసిఇఎ ఆమోద ముద్ర వేసింది. ఎన్‌హెచ్-56లో భాగంగా 107.67 కి.మీ నిడివిగల ఈ ప్రాజెక్టును నిర్మిస్తారు. రాజస్థాన్‌లోని నింబహెరాలో ఈ ప్రాజెక్టు ప్రారంభమవుతుంది. గుజరాత్‌లోని దహోద్ జిల్లా,మధ్యప్రదేశ్‌లోని అలీరాజ్‌పూర్‌జిల్లామీదుగా ప్రయాణించి ఛోటా ఉదేపూర్‌జిల్లా సమీపంలో తిరిగి గుజరాత్‌లోకి ఈ రహదారి ప్రవేశిస్తుంది.గంటకు వంద కి.మీ వేగంతో ఈ రహదార్లపై ప్రయాణం చేయవచ్చు. సగటున 70 కి.మీ వేగంతో గంటకు ప్రయాణం చేయవచ్చు.



**అంకుర సంస్థల్లో పెట్టుబడులకు రూ.10 వేలకోట్లు**

అంకుర సంస్థల్లో పెట్టుబడుల ప్రోత్సాహానికి వీలుగా 2016లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన స్టార్టప్ ఇండియా ఫండ్ ఆఫ్ ఫండ్స్ (ఎఫ్ఓఎఫ్) 1.0 ఉరవడిని కొనగించేందుకు వీలుగా ఎఫ్ఓఎఫ్-2.0 ప్రాజెక్టుకు కేంద్ర మంత్రివర్గం రూ.10,000 కోట్లు కేటాయించింది. వెంచర్ ప్రాజెక్టులకు పెట్టుబడులను సమీకరించడంలో భాగంగా అంకుర సంస్థలకు ప్రోత్సాహం ఇవ్వడంకోసం ఈ భారీ కేటాయింపు చేశారు. ప్రధానమంత్రి మోదీ అధ్యక్షతన సమావేశంలో ఈ కేటాయింపు చేశారు. మొదటి విడత కేటాయింపులను విజయవంతంగా సద్వినియోగం చేయడంతో ఆ ఉత్సాహాన్ని, ఉరవడిని కొనసాగించడానికి రెండో విడత ఈ కేటాయింపులు చేశారు. పది సంవత్సరాల క్రితం స్టార్టప్ ఇండియా ప్రారంభమైన తర్వాత ప్రభుత్వం వీటిని గుర్తించే ప్రక్రియను వేగవంతం చేసింది. మొత్తం 500 అకుంర సంస్థలను తొలుత గుర్తించారు. ప్రస్తుతం ఈ అంకుర సంస్థలు 2,00,000 లకు విస్తరించాయి. వీటిలో 49,400 అంకుర సంస్థలకు కేవలం 2025లోనే గుర్తింపు ఇచ్చారు.

**బ్రహ్మపుత్ర నది కింద రైల్-కమ్-రోడ్ టన్నెల్**

నది నీటి ప్రవాహానికి ఆటంకంలేకుండా కిందిభాగం నుండి రహదారి ప్రయాణానికి వీలుగా దేశంలో మొదటిసారి అక్విడెట్ టన్నెల్ నిర్మించనున్నారు. ఐతే ఈ అక్విడెట్ టన్నెల్‌కు ఉన్న ప్రత్యేకత ఏమిటంటే, పై భాగంలో నీరు ప్రవహించ వెళుతూ ఉంటే కింద రైల్-కమ్-రోడ్ బ్రిడ్జి నిర్మాణం ఉంటుంది. అసోంలోని బ్రహ్మపుత్ర నది కింది భాగం నుండి దేశంలో మొదటిసారి ఈ రైల్-కమ్-రోడ్ టన్నెల్ ప్రాజెక్టును రూ.18,662 కోట్లతో నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టుకు కేంద్రమంత్రివర్గం ఆమోదం తెలిపింది. గోహ్‌పూర్-నుమలిగర్ మధ్య గ్రీన్‌ఫీల్డ్ కారిడార్‌ను నాలుగు వరుసలతో నిర్మిస్తారు. ప్రస్తుతం ఎన్‌హెచ్ 715 నుమలిగర్ నుండి ఎన్‌హెచ్-15 పైన గోహ్‌పూర్ మధ్య 240 కి.మీ నిడివితో ప్రస్తుతం రహదారి ఉంది. గోహ్‌పూర్ నుండి నుమలిగర్ వరకూ ఎన్‌హెచ్ -15 పైన బ్రహ్మపుత్ర నది కింది భాగం నుండి ఈ టన్నెల్ నిర్మిస్తారు. అసోం అంతటా రహదారి ప్రయాణాలకు, సరుకు రవాణాకు బ్రహ్మాండమైన కొత్త సదుపాయాలు ఈ ప్రాజెక్టువల్ల లభిస్తాయి. అదేవిధంగా ప్రధానమంత్రి కార్యాలయాన్ని ప్రస్తుతం ఉన్న ఇంపీరియల్ సౌత్ బ్లాక్ రైసినా హిల్ నుండి కొత్తగా నిర్మించిన సేవాతీర్థ్ ప్రాంతానికి మార్పు చేస్తారు. దీనికి మంత్రివర్గం ఒక తీర్మానం చేసింది. అదేవిధంగా ఢిల్లీలోని నోయిడా సెక్టర్ 142ను బొటానికల్ గార్డెన్ వరకూ 11.56 కి.మీ మేరకు మెట్రో రైల్‌ను విస్తరిస్తూ కేంద్రమంత్రివర్గం ఒక తీర్మానం చేసింది. నోయిడా, గ్రేటర్ నోయిడా నగరాల కారిడార్ అమలులోకి వచ్చిన తర్వాత మొత్తం 61.62 కి.మీ మేరకు మెట్రోరైల్ నెట్‌వర్కు అందుబాటులోకి వచ్చింది. నగరంలో మౌలిక సదుపాయాల పెరుగుదలకు అనుగుణంగా కారిడార్‌ను నోయిడా సెక్టర్ 142 నుండి బొటానికల్ గార్డెన్ నోయిడా వరకూ భారీ విస్తరణ చేపడతారు. ఈ కారిడార్‌లో 11.56 కి.మీ మేరకు ట్రాక్స్ ప్రవేశపెడతారు.

# పత్తి రైతులకు, వస్త్రపరిశ్రమకు తీవ్ర నష్టం

- భారత్- అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై రాహుల్‌గాంధీ
- అమెరికా నుంచి పత్తిని దిగుమతి చేసుకుంటేనే
- భారత వస్త్ర పరిశ్రమకు సుంకాల మినహాయింపు
- విషయం ఎందుకు దాస్తున్నారని నిలదీత

**న్యూఢిల్లీ:** భారత్-అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోశారు. దేశంలోని పత్తి రైతులను, వస్త్ర ఎగుమతిదారులను మోసం చేస్తోందని మండిపడ్డారు. ఈ ఒప్పందం రెండు రంగాలకు తీవ్ర నష్టం కలిగించే అవకాశం ఉందన్నారు. శనివారం రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పోస్టు చేస్తూ ప్రభుత్వం పత్తి రైతుల ప్రయోజనాలను లేదా వస్త్ర ఎగుమతిదారుల ప్రయోజనాలను కాపాడలేదని విమర్శించారు. ప్రభుత్వానికి దార్శినికత ఉంటే రెండింటినీ రక్షించే, రెండు రంగాలకు శ్రేయస్సును నిర్ధారించే ఒప్పందంపై చర్చలు జరిపి ఉండేది కాదన్నారు. '18 శాతం సుంకం వర్సెస్ '0'శాతం' సుంకంపై ప్రధానమంత్రి, ఆయన మంత్రివర్గం ఎలా గందరగోళాన్ని వ్యాపింపజేస్తున్నారో వివరిస్తానన్నారు. వారు భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం ద్వారా భారత దేశ పత్తి రైతులను, వస్త్ర ఎగుమతిదారులను ఎలా మోసం చేస్తున్నారో తెలియజేస్తానని పేర్కొన్నారు. అమెరికా నుంచి పత్తిని దిగుమతి చేసుకుంటేనే, భారత వస్త్ర పరిశ్రమకు సుంకాల మినహాయింపు ఉంటుందనే విషయాన్ని ఎందుకు దాచారని ఆయన ప్రశ్నించారు.



బంగ్లాదేశ్ కూడా భారత్ నుంచి పత్తి దిగుమతులను నిలిపివేసే సంకేతాలు ఇస్తోందని, తద్వారా రైతులకు నష్టం జరుగుతుందని రాహుల్ గాంధీ ఆరోపించారు. 'భారత్‌లోని టెక్స్‌టైల్ రంగం 5 కోట్ల కుటుంబాలకు ఉపాధినిస్తోంది. నరేంద్ర మోదీ అమెరికాతో చేసుకున్న ఒప్పందం భారత టెక్స్‌టైల్ రంగాన్ని అంతం చేస్తుంది. ఈ విషయం నరేంద్ర మోదీకి, మొత్తం భారతదేశానికి తెలుసు. అదే నేను పార్లమెంటులో చెప్పాను. బంగ్లాదేశ్‌కు '0' శాతం పన్ను, భారత్‌కు 18 శాతం పన్ను విధిస్తున్నారు. అందువల్ల భారత టెక్స్‌టైల్ పరిశ్రమను బంగ్లాదేశ్ టెక్స్‌టైల్ పరిశ్రమ దెబ్బతీస్తుంది. మనకు కూడా ఆ రాయితీ కావాలంటే అమెరికా నుంచి పత్తిని దిగుమతి చేసుకోవాలని కేంద్రమంత్రి ఒకరు చెప్పారు. కానీ అసలు నిజం ఏమిటంటే మన పత్తి బంగ్లాదేశ్‌కు వెళ్తుంది. మన పత్తి ద్వారానే భారత్‌లో టెక్స్‌టైల్ మిల్లులు నడుస్తున్నాయి. ఒకవేళ మనం బంగ్లాదేశ్ లాగా అమెరికా పత్తిపై ఆధారపడితే మన దేశంలో పత్తి రైతులు, వస్త్ర పరిశ్రమ నాశనమైపోతాయి. ఒకవేళ మనం అమెరికా పత్తిని దిగుమతి చేసుకోకపోతే మన టెక్స్‌టైల్ పరిశ్రమ దెబ్బతింటుంది. ఇదే అసలు నిజం. పీయూష్ గోయల్ అబద్ధాలు చెప్పవద్దు. అందుకే 'సరెండర్' అంటున్నాను. ఎందుకంటే ఈ ఒప్పందం వల్ల పత్తి రైతు నష్టపోతాడు' అని రాహుల్‌గాంధీ చెప్పారు.

**మోదీ ప్రభుత్వం పత్తి, వస్త్ర రంగాలకు నష్టం కలిగించింది!**

ఒకవేళ మోదీ ప్రభుత్వం జాతీయ ప్రయోజనాల కోసం ఆలోచించి ఉంటే పత్తి రైతులు, వస్త్ర ఎగుమతిదారుల శ్రేయస్సును రక్షించే విధంగా చర్చలు జరిపి ఉండేదని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. మోదీ, ఆయన ప్రభుత్వం కలిసి రెండు రంగాలకు తీవ్ర నష్టం కలిగించే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. ఈ ఒప్పందం కారణంగా పత్తి, వస్త్ర పరిశ్రమ రంగాలపై ఆధారపడి ఉన్న కోట్లాది మంది భారతీయుల కుటుంబాలను నిరుద్యోగం, ఆర్థిక సంక్షోభం అనే గొయ్యిలోకి నెట్టివేశారని రాహుల్ గాంధీ విమర్శించారు. గత వారం భారత్‌అమెరికా మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. అయితే, ఈ ఒప్పందంలో యూఎస్ పారిశ్రామిక వస్తువులు, విస్తృత శ్రేణి ఆహార, వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలను తొలగించడం లేదా తగ్గించడం వంటివి ఆ ఒప్పందంలో ఉన్నాయి. వీటిలో పశుగ్రాసం కోసం ఎర్ర జొన్న, చెట్ల గింజలు, తాజా ప్రాసెస్ చేసిన పండ్లు, సోయాబీన్ నూనె, వైన్, స్పిరిట్స్, అదనపు ఉత్పత్తులు ఉన్నాయి.

# రాహుల్ అబద్ధాల కోరు : షా



**న్యూఢిల్లీ:** ఇటీవల జరిగిన ఎఫ్‌టిఎ, ఇండో-యుఎస్ వాణిజ్య ఒప్పందంలో భారతదేశ రైతులుష మత్స్యకారుల ప్రయోజనాలు పూర్తిగా రక్షించబడ్డాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అబద్ధాలతో తప్పుదారి పట్టించి భ్రమలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిపై అమిత్ షా మండిపడ్డారు. ఆయన రోజువారీ అబద్ధాలు చెప్పే కొత్త సంప్రదాయాన్ని ప్రారంభించారని ఆరోపించారు. షా శనివారం పదుచ్చేరిలోని కరాయ్‌కల్‌లో నిర్వహించిన బిజెపి ర్యాలీలలో పాల్గొని ప్రసంగించారు. రాహుల్ గాంధీ దేశంలోని మత్స్యకారులను, రైతులను తప్పుదారి పట్టించాలనుకుంటున్నారని, అబద్ధాలు చెప్పడం ద్వారా ఆయన భ్రమను వ్యాప్తి చేయాలని భావిస్తున్నారని షా ఆరోపించారు. ఇండో-యుఎస్ వాణిజ్య ఒప్పందంతో పాటు, యుకె, ఇయుతో సంతకం చేసిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలలో,నరేంద్ర మోదీ రైతులు, మత్స్యకారులు, పశువుల పెంపకందారులకు 100 శాతం రక్షణ కల్పించారని షా అన్నారు. ఎఫ్‌టిఎ, వాణిజ్య ఒప్పందంలోని నిబంధనలను జాగ్రత్తగా పరిశీలించాలని రాహుల్‌గాంధీని కోరుతూ, భారత వాటాదారుల ప్రయోజనాలను '100 శాతం' నిర్ధారించామని షా పునరుద్ఘాటించారు. ఎఫ్‌టిఎల నుండి మత్స్యకారులు ప్రయోజనం పొందుతారన్నారు. దివంగత మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యుపిఎ పాలనలో రైతుల ప్రయోజనాలను అమ్మేసుకున్నారని ఆయన ఆరోపించారు. ఎఫ్‌టిఎలు, వాణిజ్య ఒప్పందం మన రైతులకు ఎటువంటి హాని కలిగించదని, రైతులకు హాని మన్మోహన్ సింగ్ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని ఆరోపించారు. రైతుల ప్రయోజనాలను అమ్మేసేందుకు అప్పట్లో అనేక ప్రపంచ ఒప్పందాలు కుదుర్చుకున్నాయని, అయితే నరేంద్ర మోదీ జీ రైతులు, పశువుల పెంపకందారుల రక్షణను కలిగిస్తారన్నారు. ప్రధాని మోదీ రైతులు, పశుసంవర్ధకంలో పాల్గొన్న సోదరులు, సోదరీమణులు, మత్స్యకారులకు 100 శాతం రక్షణ కల్పించడానికి కృషి చేశారు. వి నారాయణస్వామి నేతృత్వంలోని గత పుదుచ్చేరి కాంగ్రెస్ పాలన (2016-21) అవినీతిపై లక్ష్యంగా చేసుకుని, ఇటీవలి కాగ్ నివేదికను షా ఉదహరించారు. కేంద్రపాలిత ప్రాంతంలో రూ. 15,000 కోట్ల మొత్తం అభివృద్ధి నిధిని మింగేశారని ఆరోపించారు. ఈ విషయంపై దర్యాప్తు ప్రారంభమైందని చెప్పారు.

## స్వదేశీ చెల్లింపుల సమయం, ఖర్చును తగ్గించాలి : కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** స్వదేశీ చెల్లింపుల సమయం, ఖర్చును తగ్గించాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ శనివారం పిలుపునిచ్చారు, ఇవి ఉత్తరప్రదేశ్‌తో సహా అనేక తూర్పు, ఉత్తర రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలకు సహాయపడతాయన్నారు. విదేశాల నుండి భారతదేశం పంపే చెల్లింపులు దేశీయ చెల్లింపుల కంటే ఎక్కువ విధానపరమైన శ్రద్ధను పొందుతున్నప్పటికీ, దేశీయ చెల్లింపుల పరిమాణం, వాటి సామాజిక, ఆర్థిక ప్రొఫైల్ కారణంగా ఇది మారాలని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. '2025లో భారతదేశం విదేశాల నుండి పంపే చెల్లింపులు మొత్తం యుఎస్‌డి 135 బిలియన్లు. ఇది జిడిపిలో దాదాపు 3.4 శాతం. ఈ చెల్లింపులు దేశ చెల్లింపుల బ్యాలెన్స్‌ను నిర్వహించడానికి చాలా ముఖ్యమైనవి. కేరళ వంటి అనేక రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలకు కీలకమైనవి. ఈ చెల్లింపులను బాగా అధ్యయనం చేశారు' అని రమేష్ అన్నారు. మరోవైపు, భారతదేశంలో ఒక రాష్ట్రం నుండి మరొక రాష్ట్రానికి వలస కార్మికులు పంపే డబ్బును సూచించే దేశీయ చెల్లింపుల స్థాయి గురించి తక్కువ అవగాహన ఉందని ఆయన గుర్తుచేశారు. కేరళకు సంబంధించిన అంచనాలను ఆయన ఉదహరించారు. ఈ రాష్ట్రం నుండి వచ్చే దేశీయ చెల్లింపులు దానికి అందే విదేశీ చెల్లింపులలో మూడింట ఒక వంతు ఉండవచ్చునని సూచిస్తుందన్నారు.

# పుల్వామా అమరులకు నివాళి

**న్యూఢిల్లీ :** పుల్వామా దాడి జరిగి ఏడేళ్లు అవుతున్న సందర్భంగా అమరవీరులకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ నివాళులర్పించారు. 2019 ఫిబ్రవరి 14న జమ్ముకశ్మీర్‌లోని పుల్వామా ప్రాంతంలో సిఆర్‌పిఎఫ్ జవాన్లపై ఉగ్రవాదులు భీకర దాడికి తెగబడిన విషయం తెలిసిందే. ఆ ఘటనలో 40 మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. నాటి ఘటనను ప్రధాని మోదీ గుర్తుచేసుకుంటూ.. వారి త్యాగాన్ని భారత్ ఎన్నటికీ మరిచిపోదన్నారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి తమ ప్రాణాలు సైతం పణంగా పెట్టే మన భద్రతా దళాలకు దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుందన్నారు. ఉగ్రవాదం మానవాళికి అతిపెద్ద శత్రువని.. దానిని పూర్తిగా నిర్మూలించేందుకు భారత్ కట్టుబడి ఉందని అన్నారు. పుల్వామా ఉగ్ర దాడిలో ప్రాణాలు అర్పించిన సైనికులకు నివాళులు అర్పిస్తున్నాను. వారి అత్యున్నత త్యాగాన్ని దేశం ఎప్పటికీ మరిచిపోదు. ఉగ్రవాదాన్ని సమర్థవంతంగా ఎదుర్కోడానికి బలమైన, సురక్షితమైన దేశాన్ని నిర్మించడం కోసం భారత ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ పేర్కొన్నారు. పుల్వామా ఉగ్ర దాడిలో ప్రాణాలు అర్పించిన అమరవీరుల అంకితభావం, సంకల్పం, దేశ సేవ, ప్రజల మనసుల్లో శాశ్వతంగా నిలిచిపోతాయి. మాతృభూమి సార్వభౌమత్వం, సమగ్రత కోసం గొప్ప త్యాగం చేసిన ధీర జవాన్లు, వారి కుటుంబాలను చూసి భారత్ ఎప్పుడూ గర్వపడుతోంది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశం తన పోరాటాన్ని కొనసాగిస్తూనే ఉంటుందని హోంమంత్రి అమిత్ షా చెప్పారు. '2019 ఫిబ్రవరి 14న పుల్వామాలో జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన సిఆర్‌పిఎఫ్ జవాన్లకు నివాళులు అర్పిస్తున్నాను. వారి కుటుంబాలకు దేశం ఎల్లప్పుడూ మద్దతుగా ఉంటుంది. భారత్‌కు ఉగ్రవాదం కలిగిస్తోన్న తీవ్రమైన ముప్పును వారి త్యాగం ఎప్పటికీ గుర్తుచేస్తూనే ఉంటుంది. ఉగ్రవాదాన్ని నిర్మూలించి, దేశాన్ని సురక్షితంగా మార్చేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది' అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. 2019లో పుల్వామాలో జరిగిన ఉగ్ర దాడిలో అమరులైన మన సైనికులు ఎప్పటికీ ప్రజల గుండెల్లో నిలిచిపోతారు. వారు చేసిన అత్యున్నత త్యాగానికి దేశం ఎప్పటికీ వారికి రుణపడి ఉంటుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వెల్లడించారు.



# ఈశాన్యాన్ని కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసింది

### అసోంలో తిరుగుబాటును ప్రోత్సహించింది : ప్రధాని మోదీ

**గువాహటి:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం కాంగ్రెస్ పై తీవ్ర స్థాయిలో దాడి చేశారు. కాంగ్రెస్ తన పాలనలో ఈశాన్య ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేసిందని, అసోంలో తిరుగుబాటును ప్రోత్సహించిందని ఆరోపించారు. శనివారం గువాహటిలో బిజెపి కార్యకర్తలతో కూడిన బహిరంగ సభలో మోదీ మాట్లాడుతూ అసోంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు భయం, అభద్రత ప్రబలంగా ఉండటంతో దేశ భద్రతకు ఎల్లప్పుడూ ముప్పు వాటిల్లిందని ఆరోపించారు. కాంగ్రెస్ ధ్రువణీకరణ, ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడిందని, వీటిని ప్రోత్సహించే నిర్ణయాలు తీసుకుందని దుయ్యబట్టారు. ముస్లిం లీగ్ కారణంగా దేశ విభజన జరిగింది, కానీ ఇప్పుడు 'ఎంఎంసి' మావోయిస్టు, ముస్లిం, కాంగ్రెస్ ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మోదీ పేర్కొన్నారు. చొరబాటుదారులను రక్షించడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ప్రధాని ఆరోపించారు. బిజెపి అక్రమ వలసలను అంతం చేయడానికి కట్టుబడి ఉందని, రానున్న ఐదు సంవత్సరాలు రాష్ట్రానికి చాలా ముఖ్యమైనవని చెప్పారు. అసోంలో 10 సంవత్సరాలు అధికారంలో లేని కాంగ్రెస్... అధికారంలో ఉన్నప్పుడు కంటే చాలా ప్రమాదకరమైనదని, ఆ పార్టీ నాయకులు చేసిన విషపూరిత ప్రకటనల ద్వారా స్పష్టంగా తెలుస్తుందన్నారు. ఏడు దశాబ్దాలుగా, కాంగ్రెస్ బ్రహ్మపుత్ర నదిపై కేవలం మూడు వంతెనలను మాత్రమే నిర్మించిందని, కానీ బిజెపి ప్రభుత్వం 10 సంవత్సరాలలో ఐదు వంతెనలను నిర్మించిందని ఆయన నొక్కి చెప్పారు. బిజెపి ప్రభుత్వ కృషి కారణంగా అసోంలో సర్వతోముఖాభివృద్ధి జరుగుతోందని ప్రధాని అన్నారు. అసోం గుర్తింపు, దాని సంప్రదాయాలను కాపాడటానికి బిజెపి కట్టుబడి ఉందని మోదీ పేర్కొన్నారు. బిజెపి విజయానికి దక్కిన ఘనత పార్టీ కార్యకర్తలకే చెందుతుందని, అది సంస్థాగత బలాన్ని విశ్వసిస్తోందని మోదీ చెప్పారు.



**కుమార భాస్కర వర్మ సేతు బ్రిడ్జ్ ప్రారంభం**

మరోవైపు అసోంలోని బ్రహ్మపుత్ర నదిపై నిర్మించిన కుమార భాస్కర వర్మ సేతు బ్రిడ్జ్‌ను ప్రధాని మోదీ శనివారం ప్రారంభించారు. సుమారు 3030 కోట్ల ఖర్చుతో ఆ వారధిని నిర్మించారు. గౌహతి, నార్త్ గౌహతి మధ్య ఈ బ్రిడ్జ నిర్మాణంతో ప్రయాణ సమయం తగ్గనున్నది. ఈశాన రాష్ట్రాల్లో నిర్మించిన తొలి పిఎస్‌సి (ప్రెస్ట్రెస్డ్ కాంక్రీట్) బ్రిడ్జ్‌గా దీన్ని పిలుస్తున్నారు. బ్రిడ్జ్‌ను ఆవిష్కరించిన తర్వాత ప్రధాని మోదీ దానిపై కాసేపు వాకింగ్ చేశారు. అసోం గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య, సిఎం హిమంత బిశ్వ శర్మ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భూకంపాలను తట్టుకునే రీతిలో.. ఐసోలేషన్ టెక్నాలజీ, ఫ్రిక్షన్ పెండ్యూలమ్ బియరింగ్స్‌తో బ్రిడ్జ్‌ను నిర్మించారు. గువాహటి, నార్త్ గువాహటి మధ్య ప్రయాణ సమయం ఏడు నిమిషాలకు చేరనున్నది. హై పర్ఫార్మెన్స్ స్టే కేబుల్స్‌ను నిర్మాణం కోసం వాడారు. బ్రిడ్జ్ హెల్త్ మానిటరింగ్ సిస్టమ్‌ను కూడా ఏర్పాటు చేశారు. డ్యామేజ్ డిటెక్షన్ కోసం అనేక మానిటరింగ్ విధానాలను కూడా పొందుపరిచారు.

## మెడికల్ మాఫియాపై చర్యలు: సిపిఐ

**న్యూఢిల్లీ:** వైద్యారోగ్య రంగంలో అనైతిక, విధ్వంసకర విధానాలను అరికట్టేందుకు, స్వలాభాపేక్షతో పనిచేసే సంస్థలను కట్టడి చేసేందుకు తక్షణమే పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సీపీఐ డిమాండ్ చేసింది. పార్టీ జాతీయ నాయకుడు కె.నారాయణ ఈ మేరకు శనివారం ఒక ప్రకటన చేశారు. మెడికల్ మాఫియా పేట్రేగిపోవడంతో లక్షల మంది సామాన్యులు వైద్యం పేరిట దోపిడీకి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనవసర పరీక్షలు, మితిమీరిన వైద్య ఖర్చులతో ఇబ్బంది పడుతున్నారన్నారు. కమీషన్ల కోసం వైద్య సేవలను వ్యాపారంగా మార్చేయడం ఆమోదయోగ్యం కాదన్నారు. ఆరోగ్య సంరక్షణ అన్నది సామాజిక బాధ్యత అని, లాభాల కోసం పనిచేసే వ్యవస్థగా దీనిని మార్చడం సరి కాదని నారాయణ అన్నారు. మెడికల్ మాఫియా కారణంగా ప్రజలపై ఆర్థిక భారం విపరీతంగా పెరిగిపోతోందని, భరించలేని వైద్య ఖర్చుతో వారు వైద్యులపై నమ్మకాన్ని కోల్పోతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితి వైద్య వృత్తి నైతిక మూలాలను దెబ్బతీస్తున్నదని నారాయణ ఆందోళన వ్యక్తంచేశారు. ప్రైవేటు ఆసుపత్రులు, డయాగ్నొస్టిక్ సెంటర్ల ఆడిట్లు క్రమంగా జరగాలన్నారు. చికిత్సా విధానాలు, వైద్య పద్ధతులు, వైద్య పరికరాలకు సంబంధించి పారదర్శకత, నాణ్యత ఉండేలా చూడాలన్నారు. వైద్య సేవలు, పరీక్షల కోసం ధరలు నిర్ణయించి, వాటిని అమలు చేయాలని, ఇష్టమొచ్చినట్లు రోగులను దోచుకునే పరిస్థితిని నివారించాలని నారాయణ డిమాండ్ చేశారు. కమీషన్ల నెట్‌వర్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. రోగుల హక్కులకు సమర్థ రక్షణ కల్పించాలన్నారు. సమస్యలను పరిష్కరించే స్వతంత్ర వ్యవస్థలు ఏర్పాటు చేయాలని నారాయణ సూచించారు. ప్రభుత్వ వైద్య రంగాన్ని బలోపేతం చేయాలని, వైద్యం పేరిట వ్యాపారం, దోపిడీ అరికట్టాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) కఠిన నిబంధనలను అమలు చేయాలని, వాటిని ఉల్లంఘిస్తే ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదన్నారు. రోగులను ఆదాయ వనరుగా మార్చే విధానాన్ని ఆపాలంటూ హెచ్చరించారు. ఆరోగ్య సేవలు అందరికీ అందాలని, వైద్య ఖర్చు అందరూ భరించేలా ఉండాలని, తద్వారా వైద్య వృత్తి నైతికతను పరిరక్షించాలని, ఇందుకోసం సంస్కరణలు జరిగేలా ప్రభుత్వం తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని నారాయణ డిమాండ్ చేశారు.

# ముంబయిలో కూలిన మెట్రో పిల్లర్

### ఒకరు మృతి.. నలుగురికి గాయాలు

**న్యూఢిల్లీ:** మహారాష్ట్ర రాజధాని ముంబయి నగరంలో దారుణం జరిగింది. నిర్మాణంలో ఉన్న ఒక మెట్రో పిల్లర్ కూలింది. ఈ ఘనటలో ఒకరు మరణించగా, నలుగురు గాయపడ్డట్లు ప్రాథమిక సమాచారం. స్థానిక ములుంద్ ప్రాంతంలోని, ఎల్బీఎస్ రోడ్ జాన్సన్ అండ్ జాన్సన్ ఫ్యాక్టరీ వద్ద నిర్మాణంలో ఉన్న మెట్రో పిల్లర్ శనివారం మధ్యాహ్నం 12.20 గంటల సమయంలో కూలిపోయింది. కూలిన మెట్రో పిల్లర్ రోడ్డుపై వెళ్తున్న ఒక ఆటో రిక్షా, ఒక కారుపై పడింది. దీంతో ఈ వాహనాల్లోని ఒకరు మరణించగా, మరో నలుగురు గాయపడ్డారు. వాహనాలు ధ్వంసమయ్యాయి. ఘటనపై సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది, పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. సహాయ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ముంబై మెట్రోపాలిటన్ రీజన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎంఎంఆర్‌డిఎ) అధికారులు, బిఎంసి అధికారులు, మెట్రో అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు. గాయపడ్డవారికి పూర్తిస్థాయి వైద్య సహాయం అందిస్తామని అధికారులు ప్రకటించారు. ఈ ప్రమాదం నేపథ్యంలో ములుంద్ ప్రాంతంలో ట్రాఫిక్ భారీగా స్తంభించింది. దీంతో ట్రాఫిక్ అధికారులు రంగంలోకి దిగి ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. వాహనదారులు వేరే మార్గాల్లో వెళ్లాల్సిందిగా సూచించారు. ఈ ఘటనపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని విమర్శిస్తున్నారు. ఈ ఘటనపై పూర్తి సమాచారం రావాల్సి ఉంది.



## జడ్జీలు నటిస్తే న్యాయ వ్యవస్థకు దెబ్బ: సిజెఐ

**న్యూఢిల్లీ:** న్యాయమూర్తుల అసమర్థత వల్ల న్యాయ వ్యవస్థకు, నాయకత్వానికి (జుడిషియల్ లీడర్‌షిప్)కు హాని కలగదుగానీ, దానిని కల్పిపుచ్చేందుకు సామర్థ్యం ఉన్నట్లు నటిస్తే మాత్రం దెబ్బ తప్పదని సి జెఐ సూర్యకాంత్ హె చ్చరించారు. జుడిషియల్ లీడర్‌షిప్ పొందే విధానంలో సమూల మార్పునకు పిలుపునిచ్చారు. సభ్యదేశాల కోసం న్యాయ విద్య, బార్ అండ్ బెంచ్ ఏకీకృతమయ్యే 'కామన్‌వెల్త్ అ పెక్స్ బాడీ' అవసరమని సిజెఐ అన్నారు. 11వ కా మన్‌వెల్త్ జ్యుడిషియల్ ఎడ్యుకేటర్స్ (సిజెఇ) ద్వై వార్షిక సదస్సులో ఆయన ప్రారంభోపన్యాసం చే శారు. న్యాయ వ్యవస్థల వలే న్యాయమూర్తులకు వృద్ధి, దిద్దుబాట్లు, మెరుగుదలకు అవకాశం ఉం టుందని చెప్పారు. న్యాయం అందించడంలో న్యా యమూర్తుల పాత్రకు పూర్వ నిర్ణయాలపై పట్టు మాత్రమే కాకుండా చట్టాన్ని అర్థం చేసుకునే చు రుకుదనం కూడా ఉండటం అవసరమని సిజెఐ సూర్యకాంత్ తెలిపారు. జ్యుడిషియల్ లీడర్లంతా పరిపూర్ణులు కాదని, వారంతా తమ పరిజ్ఞానమెం తో గ్రహించి... పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు పెం చుకున్నారు కాబట్టే ఉన్నతంగా ఎదిగారని చెప్పారు. వినయంగా ఉండటం అనేది వ్యక్తి స్వభావం కాదని, వృత్తిపరమైన రక్షణ కవచమని, సిజెఐ సూచించారు.





## కొత్త తూనీగ జాతి..



కేరళలో లైరియోథెమిస్ కేరలెన్సిస్ అనే కొత్త తూనీగ జాతిని పరిశోధకులు గుర్తించారు. ఇది ఇంతకుముందు ఈశాన్య భారతదేశానికి మాత్రమే పరిమితమై ఉందని భావిస్తూ వచ్చిన వర్గానికి చెందినది. అయితే కేరళలో దీని గుర్తింపు రాష్ట్ర జీవ వైవిధ్య సమృద్ధిని మరోసారి స్పష్టం చేసింది. ఈ ఆవిష్కరణ కేవలం ఒక కొత్త జాతి గుర్తింపుకే పరిమితం కాకుండా, పర్యావరణ పరిశోధనలో సూక్ష్మ విశ్లేషణ ఎంత కీలకమో తెలియజేస్తుంది. ఈ తూనీగ జాతి కేరళలో 2013 నుంచే కనిపిస్తున్నప్పటికీ, దాన్ని లైరియోథెమిస్ అసిగాస్ట్రాగా పొరబడ్డారు. దాదాపు పదేళ్లకు పైగా ఈ తప్పు కొనసాగింది. అనంతరం సూక్ష్మ దర్శిని పరిశీలనలు, మ్యూజియంలో భద్రపరచిన నమూనాలతో చేసిన సరిపోల్చు అధ్యయనాల ద్వారా ఇది వేరే జాతిగా నిర్ధారించారు. శరీర నిర్మాణంలోని సూక్ష్మ తేడాలు, రెక్కల నమూనాలు, వర్ణ వైవిధ్యం వంటి లక్షణాల ఆధారంగా దీని ప్రత్యేకతను శాస్త్రవేత్తలు స్థిరపరిచారు. ఇది వర్గీకరణ శాస్త్రంలో ఖచ్చితమైన పరిశీలన అవసరాన్ని రుజువు చేస్తుంది. లైరియోథెమిస్ కేరలెన్సిస్ ప్రత్యేక లక్షణాలలో ముఖ్యమైనది లైంగిక ద్విరూపత్వం (సెక్సువల్ డైమోర్ఫిజమ్). మగ తూనీగలు గాఢ రక్తవర్ణంలో నలుపు గుర్తులతో ఆకర్షణీయంగా కనిపిస్తాయి. ఆడ తూనీగలు పసుపురంగులో నలుపు గుర్తులతో ఉంటాయి. ఈ స్పష్టమైన వర్ణ తేడాలు వాటిని క్షేత్రస్థాయిలో గుర్తించడంలో సహాయపడతాయి. ఈ జాతి రుతుపరమైన ఉనికిని కూడా చూపిస్తుంది. దక్షిణ–పశ్చిమ మాన్సూన్ కాలం, అంటే మే చివరి నుంచి ఆగస్టు వరకు, ఇవి పెద్దల రూపంలో స్పష్టంగా కనిపిస్తాయి. మిగిలిన కాలంలో ఇవి జలావాసాల్లో లార్వా దశలో కొనసాగుతాయి. ఈ తూనీగ జాతి ఎక్కువగా మానవ మార్పులతో కూడిన సాగుభూములలో, ముఖ్యంగా అనాస పండ్ల తోటలు, రబ్బరు తోటలు, నీడ ఉన్న కాలువల పరిసరాలలో కనిపిస్తోంది. ఆశ్చర్యకరంగా, దీని జనాభాలో పెద్ద భాగం రక్షిత అటవీ ప్రాంతాల బయటే ఉంది.స్థూలంగా చెప్పాలంటే, లైరియోథెమిస్ కేరలెన్సిస్ గుర్తింపు కేరళ రాష్ట్ర జీవవైవిధ్యానికి ఒక కొత్త మలుపు. దీనిద్వారా వర్గీకరణలో ఖచ్చితత్వం, పర్యావరణ పరిశోధనలో నిరంతర అధ్యయనం మరియు భూమి వినియోగ విధానాలలో జీవవైవిధ్య సున్నితత్వం ఎంత అవసరమో స్పష్టమవుతోంది.

## ఏడారి నుంచి హిమాలయాలకు వ్యాధికారక సూక్ష్మ జీవులు!



పశ్చిమ భారతదేశంలోని ఎడారి ప్రాంతాల నుంచి ఎగిసే ధూళి మేఘాల ద్వారా వ్యాధికారక సూక్ష్మ జీవులు తూర్పు హిమాలయ ప్రాంతాలకు చేరుతున్నాయని, వాటి ప్రభావంతో శ్వాసకోశ, చర్మ, జీర్ణాశయ సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని ఇటీవలి పరిశోధన వెల్లడించింది. ఈ అధ్యయనాన్ని కోల్‌కతాలోని బోస్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు నిర్వహించారు. శక్తివంతమైన ధూళి తుఫాన్లు వందల కిలోమీటర్లు ప్రయాణించి, ఇండోగంగా మైదానాన్ని దాటి హిమాలయ కొండ చరియలపై చేరుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు. ఈ ధూళి మేఘాలు కేవలం ఖనిజ కణాలే కాకుండా, వ్యాధులను కలిగించే బ్యాక్టీరియా సహా గాలిలో వ్యాపించే సూక్ష్మ జీవులను మోసుకెళ్తున్నాయి. ఈ వ్యాప్తి వెనుక రెండు ప్రధాన ప్రక్రియలు ఉన్నాయి. మొదటిది ఎడారి ధూళి, దానిలోని సూక్ష్మ జీవుల దీర్ఘదూర అడ్డగామి రవాణాకాగా, రెండవది, హిమాలయ అడవిపాద ప్రాంతాల నుంచి కాలుష్య గాలుల పైకి ఎగసివచ్చే నిలువగామి చలనం. ఈ రెండు కలిసి ఎత్తైన ప్రాంతా ల వాతావరణ సూక్ష్మ జీవ సమూహ నిర్మాణాన్ని మారుస్తున్నాయి. సరిహద్దులు దాటి వచ్చే ధూళి రవాణా, హిమాలయ వాతావరణ సూక్ష్మ జీవ వైవిధ్య మార్పుల మధ్య పరిమాణాత్మక సంబంధాన్ని మొదటిసారిగా నిరూపించడం ఈ పరిశోధన ప్రత్యేకతగా పేర్కోవచ్చు.

## ఈజిప్టులో తమిళ ఆనవాళ్లు..

ఈజిప్ట్‌లోని 'వ్యాలీ ఆఫ్ ది కింగ్స్' ప్రాంతంలోని సమాధుల వద్ద ఇటీవల ఇద్దరు పరిశోధకులు తమిళ బ్రాహ్మీ, ప్రాకృ తం, సంస్కృత భాషల్లో దాదాపు 30 శాసనాలను గుర్తించడం విశేషం.



ఇది ప్రాచీన భారత ఉపఖండం, ఈజిప్ట్ మధ్య ఉన్న సాంస్కృతిక, వాణిజ్య సంబంధాలపై కొత్త చర్చకు దారితీసింది. ఈ శాసనాలు అక్కడి సమాధుల గోడలపై లేదా సమీప ప్రాంతాల్లో చెక్కబడి ఉండవచ్చని భావిస్తున్నారు. ఇటువంటి ఆధారాలు ప్రాచీనకాలంలో సముద్ర మార్గాల ద్వారా జరిగే అంతర్జాతీయ పరస్పర సంబంధాలను సూచిస్తాయి. వ్యాలీ ఆఫ్ ది కింగ్స్ అనేది ప్రాచీన ఈజిప్ట్ రాజులు, అంటే ఫరోల సమాధి స్థలం. ఇది నైలునది పశ్చిమ తీరంలో, దక్షిణ ఈజిప్ట్‌లోని ప్రాచీన థీబ్స్ నగరానికి సమీపంగా ఉంది. క్రీస్తుపూర్వం 1539 నుండి 1077 వరకు ఉన్న న్యూ కింగ్‌డమ్ కాలంలో 18వ, 19వ, 20వ వంశాలకు చెందిన ఫరోలను ఇక్కడ సమాధి చేశారు. ఈ కాలంలో పిరమిడ్ల నిర్మాణాన్ని నిలిపివేసి, బండ రాళ్ల కొండల్లో లోతుగా గుహాకార సమాధులను త్రవ్వడం ప్రారంభించారు. ఈ సమాధులు బయటకు కేవలం ఒక ద్వారం మాత్రమే కనిపించేలా నిర్మించారు.

— బిఎస్ఎస్ మైత్రేయి

పెట్రోలు రిటైల్ ధరల నిర్ణయానికి కేంద్రప్రభుత్వం 2017లో డైనమిక్ విధానాన్ని నిర్ణయించింది. అంటే అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిలు ధర పెరుగుదల లేదా తగ్గుదలకు అనుగుణంగా రిటైల్ ధరను రోజువారీ ప్రాతిపదికపై సవరించేందుకు ఆయిలు మార్కెటింగ్ కంపెనీలకు అధికారం ఇవ్వబడింది. అయితే అది కొద్దికాలం అమలు జరిగి నిలిచిపోయింది. ఎందుకు కొనసాగించటంలేదు? చాలాకాలంగా రిటైల్ ధర దాదాపు స్థిరంగా ఎందుకు ఉంటోంది? కేంద్రప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తులను పాడిఆవుగా ఉపయోగించుకుంటూ వినియోగదారుల జేబులు కత్తిరిస్తూ ఖజానా నింపుకోవటమే ఇందుకు ప్రధాన కారణం. 2022 నుంచి క్రూడ్ ఆయిలు ధర 41.5శాతం తగ్గినప్పటికీ, పెట్రోలు ధర కన్నీటి తుడుపుగా 1.9శాతమే తగ్గిందని అధికారిక గణాంక సమాచారం విశ్లేషణ తెలుపుతోందని 'ద హిందూ' పత్రిక వెల్లడించింది. పెట్రోలియం ప్లానింగ్ అండ్ ఎనాలిసిస్ విభాగం డేటా ప్రకారం, 2022 మార్చి–జులై కాలంలో క్రూడ్ ఆయిలు ఇండియన్ బాస్కెట్ ధర బ్యారెల్ 100డాలర్లకు పెరిగింది. ఆ సంవత్సరం ఫిబ్రవరిలో రష్యా ఉక్రేన్‌పై దండయాత్ర ప్రారంభించింది. పర్యవసానంగా క్రూడ్ ధర పెరిగింది. ఈ పెరుగుదలను తట్టుకునేందుకుగాను ఆయిలు మార్కెటింగ్ కంపెనీలు 2022 ఏప్రిల్‌లో పెట్రోలు లీటరు రిటైల్ ధరను రూ.105.1కి పెంచాయి. క్రూడ్ సగటు ధర రమారమీ 110 డాలర్లకు పెరగటంతో లీటరు పెట్రోలు ధర రూ.96.7వద్ద కంపెనీలు స్తంభన విధించాయి. ఆ తర్వాత 21 నెలలకు పైగా – 2024 మార్చి నెల మధ్యవరకు

## ఇదెక్కడి న్యాయం?

ఇంధన ధరలు మార్పు లేకుండా స్థిరంగా ఉన్నాయి.

2022 జూన్‌లో బ్యారల్ క్రూడ్ ధర రూ.116 డాలర్లకు పెరిగింది. 2025 ఫిబ్రవరి నాటికి ఇండియన్ బాస్కెట్ ధర 67.9 డాలర్లకు – అనగా 41.5శాతం తగ్గింది. అప్పుడు రిటైల్ ధర లీటరుకు రూ.96.7 నుంచి రూ.94.8కి – అనగా 1.9శాతం తగ్గింది. అది ప్రభుత్వ నిర్ణయమే గాని మార్కెటింగ్ కంపెనీల నిర్ణయం కాదు. ప్రజల్లో అలజడి దృష్ట్యా ప్రభుత్వం ఎంతో మెహర్బానీ చేసినట్లు 2024 మార్చిలో లీటరుకు రెండు రూపాయలు ఎక్సైజ్ సుంకం తగ్గించటంవల్ల ఆ తగ్గుదల సంభవించింది. ఆ తర్వాత స్వల్పంగా పెరిగి రూ.94.8కి పెరిగింది.

క్రూడ్ ఆయిలు ధరలు తగ్గినా ఆ ప్రయోజనాన్ని వినియోగదారులకు అందజేయకుండా ప్రభుత్వం ఖజానా నింపుకోవటాన్ని పార్లమెంటులో ప్రతిపక్షాలు నిలదీసినప్పుడల్లా పెట్రోలియం – ఖనిజ వాయువు మంత్రి మూసకట్టు సమాధానం ఒక్కటే : ఇంధన ధర నిర్ణయం ఆయిలు మార్కెటింగ్ కంపెనీలకు ప్రత్యేకించిన అధికార పరిధి. అందులో ప్రభుత్వానికి ఎట్టి పాత్ర లేదు! దీన్ని ప్రభుత్వం ఆచరణలో పాటిస్తున్నదా? పెట్రోలు రిటైల్ ధర తగ్గితే ప్రభుత్వం విధించే విలువ ఆధారిత ఎక్సైజ్ సుంకం తగ్గిపోతుంది. పెట్రోలియం ఉత్పత్తుల మార్కెటింగ్ ధరలో దాదాపు సగానికిపైగా కేంద్ర, రాష్ట్ర పన్నులేనని మరువకూడదు. జిఎస్‌టి పరోక్ష పన్నుల విధానం అమలులోకి వచ్చాక కూడా ఎక్సైజ్ పన్ను విధింపు ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వినియోగదారులను పిండుకుంటున్నాయి. దీనివల్ల ఒకవైపు సరుకు, ప్రయాణ రవాణా వ్యయభారాన్ని వినియోగదారులు మోస్తున్నారు. రెండోవైపున అన్ని రకాల సరుకుల ధరలు వినియోగదారులపాలిట శరాఘాతమవుతున్నాయి. 2025 ఏప్రిల్‌లో పెట్రోలు లీటరుపై ఎక్సైజ్ సుంకం రూ.2/– పెంచినా దాన్ని వినియోగదారులపై మోపకుండా దయదలిచినట్లు పార్లమెంటులో మంత్రి సమాధానం తెలియజేస్తోంది.

యుపిఎ ప్రభుత్వ కాలంలోనే, అంతవరకు అమలులో ఉన్న పెట్రోలియం ఉత్పత్తుల నియంత్రిత ధరను డైనమిక్ విధానంలోకి మార్చటం జరిగింది. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ధరలు విపరీతంగా పెరిగినందున పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ రిటైల్ ధరను పదేపదే పెంపుచేయటం అనివార్య మైంది. ప్రజాగ్రహం నుంచి తప్పుకునే మార్గంగా మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ధరల రెగ్యులేషన్ అధికారాన్ని ఆయిలు మార్కెటింగ్ కంపెనీలకు బదిలీ చేసింది. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న బిజెపి అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా పెట్రోలు రిటైల్ ధర తగ్గించాలని ఆందోళన చేసి ప్రజల మనసు దోచుకునే ప్రయత్నం చేసింది. అయితే 2014లో అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ ప్రభుత్వం ఆయిలు మార్కెటింగ్ కంపెనీలను డమ్మీలను చేసి డైనమిక్ ధరల విధానాన్ని ఆచరణలో అటకెక్కించింది. నినాదాలు – ఆచరణకు మధ్యనున్న తేడాకు ఇది అద్దంపడుతోంది. ●

# ఎప్‌స్టీన్ ఫైల్స్‌తో సాంస్కృతిక భూకంపం!

జెఫ్రీ ఎప్‌స్టీన్ ఫైల్స్ వెలుగులోకి తీసుకొచ్చినది కేవలం ఒక వ్యక్తి చేసిన నేరాల చిట్టా కాదు. అవి ఒక వ్యవస్థను, ఒక మౌన ఒప్పందాన్ని, ఒక ద్వంద్వ నైతిక ప్రపంచాన్ని బయటపెట్టాయి. ఈ పత్రాలు, చిత్రాలు, వీడియోలు ప్రజల ముందుకు వచ్చిన క్షణం ఒక న్యాయపరమైన ప్రక్రియలా కాకుండా, ఒక సాంస్కృతిక భూకంపంలా అనిపించాయి. అమెరికా న్యాయశాఖ (డిఒజె) ఆధ్వర్యంలో వెలువడిన ఈ సమాచారం, మన సమాజం నిర్మించుకున్న నైతిక నిర్మాణాన్ని తీవ్రంగా కుదిపేసింది. మొదట చూస్తే, ఈ వివరాల్లో కొత్తదనం పెద్దగా కనిపించలేదు. విమాన ప్రయాణాల లాగ్స్, సంప్రదింపుల జాబితాలు, ఇ–మెయిల్స్, ప్రైవేట్ సమావేశాల రికార్డులు వంటివన్నీ ఇప్పటికే ఎప్‌స్టైన్ చుట్టూ ఉన్న చీకటి ప్రపంచాన్ని సూచించాయి. అంతేగాక, ప్రజల ముందు నీతిని బోధించే వారి ప్రవర్తన, వ్యక్తిగత జీవితంలో వారు అనుసరించిన నైతిక ప్రమాణాల మధ్య ఉన్న లోతైన అంతరాన్ని ఈ చిట్టా బహిర్గతం చేసింది. ఈ ఫైల్స్‌లో కనిపించిన పేర్లు ఎవరో చిన్నపాటి అధికారవర్గానికో చెందిన వారు కాదు.... విశ్వవిద్యాలయాల్లో నైతికతపై ఉపన్యాసాలు ఇచ్చే ప్రొఫెసర్లు... ఆత్మ నియంత్రణ, స్వయంక్రమశిక్షణ అంటూ కోట్ల మందికి బోధనలు చేసే మోటివేషనల్ గురువులు... పవిత్ర జీవనం అంటూ మాట్లాడే హెల్త్ ఇన్‌ఫ్లుయెన్సర్లు... మానవత్వం, కరుణ గురించి ప్రసంగించే దాతలు... విలువల గురించి రోజూ మాట్లాడే రాజకీయ నాయకులు.

ఈ జాబితా చూసినప్పుడు కలిగిన షాక్ నేరానికి సంబంధించినది అనేకంటే, నమ్మకానికి జరిగిన ద్రోహంగా పేర్కోవడం ఉత్తమం. ఇక్కడే ఈ కుంభకోణం బలంగా ప్రజల మనస్సుల్లోకి చొచ్చుకుపోతుంది. ఎందుకంటే, ఈ నివేదికలో ఉన్నవారు కేవలం శక్తివంతులు మాత్రమే కాదు. వీరు నైతిక కథనకర్తలు. ఏది సరైనది, ఏది తప్పు, విజయం అంటే ఏమిటి, వైఫల్యం అంటే ఏమిటి, క్రమశిక్షణ అంటే ఏమిటి? అనే అనేకానేక విషయాలపై వివరణలు, ఉపన్యాసాలు ఇస్తూ, సమాజాన్ని సన్మార్గంలో నడిపిస్తున్నామని ప్రకటించుకునే వారు. అలాంటి వారే దోపిడీ, దుర్వినియోగం జరిగిన వాతావరణాలకు దగ్గరగా ఉండటం, ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వాటిని సహించటం, ప్రజల మనస్సులో తీవ్రమైన ప్రతిఘటన భావనను సృష్టించింది. ఈ పరిణామాలకు ప్రతిస్పందన వేగంగా, ప్రపంచవ్యాప్తంగా జరిగింది. సోషల్ మీడియాలో స్క్రీన్‌షాట్లు, చిన్న చిన్న క్లిప్పులు, వ్యాఖ్యానాలుగా ఈ వివరాలు ప్రపంచమంతా విస్తరించాయి. అతిథుల జాబితాలు నేటి కాలపు అభియోగ పత్రాల్లా మారాయి. కొన్ని వీడియోలు అసభ్యంగా, కొన్ని భయంకరంగా అనిపించాయి. సమాజానికి నీతిని బోధించే వారు, తమకోసం మాత్రం ప్రత్యేక నియమాలను అనుసరిస్తున్నారనే విషయాన్ని ఎప్‌స్టీన్‌ఫైల్స్ బలపరిచాయి. ఇక్కడి నుంచి ప్రజల్లో ఒక లోతైన అపనమ్మక భావన మొదలైంది. స్వీయ నియంత్రణ గురువు ఇలాంటి వ్యక్తితో ఎలా మెలగగలడు? నిజాయితీపై పరిశోధనలు చేసే అకాడెమీ స్పష్టమైన నైతిక హెచ్చరికలను ఎలా పట్టించుకోలేకపోయాడు? మానవతా సేవ గురించి మాట్లాడే బిలియనీర్లు ఇలాంటి విషపూరిత వాతావరణాల్లో ఎలా సౌకర్యంగా ఉన్నారు? ఈ ప్రశ్నలకు సమాధానాలు వినిపించకముందే, ఒక పెద్ద నిరాశ సమాజాన్ని కమ్మేసింది.ప్రతిఫలంగా నమ్మకం విచ్ఛిన్నమైంది. కుప్పకూలింది.

ఈ దశలో తాత్వికుడు ఫ్రెడ్రిక్ నీచే ఆలోచనలు మనకు కొత్త దారి చూపుతాయి. నైతికత అనేది నిజంగా శాశ్వతమైన, తటస్థమైన సత్యమా? లేక అది చరిత్రలో శక్తికోసం జరిగిన పోరాటాల ఫలితమా? అంటూ 'ఆన్ ది జీనియాలజీ ఆఫ్ మొరాలిటీ' లో నీచే ఒక మౌలిక ప్రశ్న వేస్తాడు. నీచే అభిప్రాయం ప్రకారం, నైతిక వ్యవస్థలు తరచుగా సార్వత్రిక సూత్రాలుగా నటిస్తాయి, కానీ వాస్తవంలో అవి వాటిద్వారా లాభపడే వర్గాల ప్రయోజనాలను కాపాడుతాయి. నీచే ముఖ్యంగా నైతిక నటనపట్ల అనుమానంగా ఉండేవాడు. సద్గుణాల ప్రదర్శన వెనుక అసూయ, నియంత్రణ, కోరిక, ఆధిపత్య ఆశ దాగి ఉండవచ్చని ఆయన హెచ్చరించాడు. నైతిక శ్రేష్ఠత అనేది చాలాసార్లు ఇతరులపై అధికారం చెలాయించే సాధనంగా మారుతుందని విశ్లేషించాడు.. ఇది నైతికతను పూర్తిగా తిరస్కరించమనే పిలుపు కాదు. ఎవరు నైతికతను నిర్వచిస్తున్నారు? ఎవరు దాన్ని అమలు చేస్తున్నారు? ఎవరు మినహాయింపులు పొందుతున్నారు? అనే కఠిన ప్రశ్నలు వేయమని స్పష్టం చేస్తున్న వైనం. ఈ కోణంలో చూస్తే, ఎప్‌స్టీన్ ఫైల్స్ చేసినవి ఆరోపణలు కావు.... అవి ఒక లక్షణం. ఇక్కడ బయటపడింది యాధృచ్ఛిక ద్వంద్వత్వం కాదు... వ్యవస్థాగత ద్వంద్వ నైతికత. సమాజానికి క్రమశిక్షణ, నియంత్రణ, పారదర్శకత బోధించే నైతిక ఎలైట్, తమ వ్యక్తిగత జీవితాల్లో మాత్రం మినహాయింపుల ప్రపంచంలో జీవిస్తున్నారు. ప్రజల ముందు సద్గుణాల నాటకం, వెనుకపట్టున వేరే నియమాలు. ఈ నటన అధికారాన్ని నిలబెట్టుకోవడానికి అవసరం. అసలు శక్తి మాత్రం వెలుగుకు అందని చోట పనిచేస్తుంది. నీచే ఇలాంటి విరుద్ధతలు ప్రమాదకరమని హెచ్చరించాడు.







ఎందుకంటే నైతికత ఖాళీగా కనిపించినప్పుడు ప్రజలు విముక్తులు కారు. వారు నిరాశావాదులు (నిహిలిస్టులు) అవుతారు. విలువలు తమ విశ్వసనీయతను కోల్పోతాయి. నిజాయితీ, నాయకత్వం, నైతికత వంటి పదాలు అర్థహీనంగా అనిపిస్తాయి. ఇది అల్లకల్లోల తిరుగుబాటును రేకెత్తిస్తుంది. అదే సమయంలో, అలసిపోయిన విరక్తి పెంచుకునే ప్రమాదం కూడా ఉంది. ఏదీ నమ్మదగినదిగా అనిపించని స్థితిగా దీనిని పేర్కోవచ్చు.. ఎప్‌స్టీన్ ఫైల్స్ ఈ ప్రమాదాన్ని మరింత తీవ్రతరం చేశాయి. నైతిక బోధకులు భోగవిలాసాలతో ముడిపడినట్లు కనిపించినప్పుడు, నైతిక భాషనే ప్రజలు తిరస్కరించడం ప్రారంభిస్తారు. నియమాలు యాధృచ్ఛికంగా అనిపిస్తాయి. ఉపదేశాలు మోసపూరితంగా అనిపిస్తాయి. ఫలితంగా నైతిక స్పష్టత కాకుండా, నైతిక అలసట ఏర్పడుతుంది. అయితే నీచే విమర్శ నిరాశతో ముగియడం లేదనే విషయాన్ని గుర్తుచేసుకోవాలి. అది ఒక శస్త్రచికిత్స లా ఉంటుంది మారుతుంది. అన్యాయాన్ని, అక్రమ విధానాలను కత్తిరిస్తుంది. ఇది హింస కాదు.. ఏ కొంతమందినో విమర్శించి లేదా వారిపై బురదచల్లే ప్రక్రియ అంతకంటే కాదు. సమాజాన్ని పట్టిపీడిస్తున్న కొన్ని విధానాలు.. కొంతమంది ప్రముఖుల దుర్మార్గపు పోకడల నుంచి ప్రజలను చైతన్యవంతులను చేయడంతోపాటు, సమస్యను పూర్తిగా తుడిచివేయడానికి చేసే ప్రయత్నం. తెచ్చిపెట్టుకున్న లేదా కేవలం మాటలకు మాత్రమే పరిమితమైన పవిత్రతను తొలగించడం ద్వారా, జీవనంతో, సృజనాత్మకతతో, నిజాయితీతో నిండిన కొత్త విలువలకు స్థలం కల్పించడమే ఆయన లక్ష్యం. నైతికతను దాని ఫలితాల ఆధారంగా తీర్పు చేయాలని ఆయన సూచించాడు. అది మానవ వికాసాన్ని, బాధ్యతను, గౌరవాన్ని పెంపొందిస్తున్నదా? లేక కేవలం అధికార కట్టడాలను రక్షిస్తున్నదా? ఈ సందర్భంలో మనం ఒక కీలక దశలో ఉన్నాం.

ఎలైట్ ద్వంద్వత్వం బయటపడినందుకే నైతికత అప్రయోజనమైందని అర్థం కాదు. నైతిక అధికారాన్ని ఊహించుకోవడం కాదు, సంపాదించుకోవాలనేది దీని మూల సూత్రం. మాటలకు, చర్యలకు మధ్య సమన్వయం ఉండాలి. ప్రతిష్ఠ కాదు, పారదర్శకతే నమ్మకానికి మూలధనం కావాలి. నీతి మాట్లాడేవారే ఎక్కువగా పరిశీలనకు లోనవ్వాలి. సంస్థల పరంగా చూస్తే, ఇది కేవలం క్షమాపణలతో ముగిసే విషయం కాదు. నిజమైన బాధ్యత, స్పష్టమైన చర్యలు అవసరం. సాంస్కృతిక నాయకులు తమ విశ్వసనీయత కోల్పోయినప్పుడు, న్యాయ సాంకేతికతల వెనుక దాక్కోవడం కాదు, కనీస నైతికతను పాటిస్తూ పక్కకు తప్పుకోవాలి. సమస్యను ప్రజల పరంగా చూస్తే, అంధ విశ్వాసం పనికిరాదని స్పష్టం చేయడం కూడా ఆయన ఉద్దేశం. తీవ్ర నిరాశకు గురికావడం మంచిది కాదని కూడా చెప్తారు. అంటే, ఈ రెండింటి మధ్య సమతుల్యత అవసరమన్నది ఆయన భావన. ఎప్‌స్టీన్ ఫైల్స్ మనకు ఒక అవకాశం ఇస్తున్నాయి... అవి మనల్ని ఓదార్పు మాయల నుంచి బయటకు లాగుతున్నాయి. మాటలకు, చేతలకు మధ్య ఉన్న దూరాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయి. ఆ అసౌకర్యమైన ఖాళీలోనే పునర్నిర్మాణానికి అవకాశం ఉంది. స్థానం, హోదా, ప్రదర్శనలపై కాకుండా, సామరస్యంపై, పారదర్శకతపై, మానవ గౌరవంపై ఆధారపడిన నైతిక వ్యవస్థను నిర్మించే అవకాశం ఉంటుంది. ఇది వ్యక్తుల గురించిన స్కాండల్ మాత్రమే కాదు. ఇది మన నైతిక వ్యవస్థకు ఒక పరీక్ష. మనం ఇంకా అందంగా మాట్లాడాలే కానీ చెడ్డగా ప్రవర్తించే ఎలైట్‌కే నైతిక బాధ్యతను అప్పగిస్తామా? లేక వెలుగులో నిలబడి పరీక్షను తట్టుకునే నైతికతను డిమాండ్ చేస్తామా? నీచే హెచ్చరించినట్లు, పరిశీలించని నైతికత చివరికి శూన్యవాదంలో కూలిపోతుంది. ద్వంద్వత్వాలు.. వైరుధ్యాలు.. కృత్రిమ నైతికత వ్యాప్తి బోధనలను అనుసరిస్తూ, మన విలువలను కోల్పోవాలా? లేక బయటపడిన వాస్తవాలను గుర్తించి, మరింత బలమైన, వాస్తవ నైతిక పునాదులపై విలువలను తిరిగి నిర్మించుకోవాలా? ఈ రెంటిలో ఎంపిక అత్యవసరం. సమాజం చేసుకునే ఎంపికే, భవిష్యత్తులో నైతికతకు అర్థం మిగులుతుందా లేదా అనే విషయాన్ని నిర్ణయిస్తుంది.

# స్పీకర్‌పై అవిశ్వాస ప్రతిపాదన దేనికి ప్రతిబింబం?

టి.ఎన్.అశోక్

బలమైన వాదోపవాదాలకు, అప్పుడప్పుడు రభసకు దీర్ఘకాలంగా వేదికగా ఉన్న భారత పార్లమెంటు పోరాట క్షేత్రంలో దిగజారింది. ''తటస్థ అంపైర్'' అనే భావనే దిగ్బంధంలో చిక్కుకుంది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై సుమారు 120 మంది ఎంపిలు ఇటీవల అవిశ్వాస తీర్మానం సమర్పించటం కేవలం ప్రొసీజర్ రగడ కాదు. అది వ్యవస్థకు ఏర్పడ్డ చీలిక. ప్రతిపక్ష పార్టీలు ప్రధానమంత్రిని ''ఘెరావ్'' (చుట్టుముట్టటం) చేయబోతున్నారని తనకు గూఢచారి సమాచారం ఉందన్న స్పీకర్ అసాధారణ క్లెయిం ఈ వివాదానికి మూలం. కార్యనిర్వాహక భద్రత, లెజిస్లేటివ్ ప్రివిలేజ్, పార్లమెంటరీ స్వతంత్రత ఒక పద్ధతి ప్రకారం హరించుకుపోవటం మధ్యనున్న ప్రమాదకరమైన అంతర్ సంబంధాన్ని ఈ ఘటన బహిర్గతం చేస్తోంది. ఈ ''పార్లమెంటరీ తుపాను''కు మూలం నియంత్రణాధిపతి క్లెయిం. ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధుల విచ్ఛిన్న కార్యకలాపాల వల్ల ప్రధానమంత్రి గైరుహాజరు కావలసివచ్చిందని స్పీకర్ బిర్లా బహిరంగ వక్కాణింపు భారతదేశ లెజిస్లేటివ్ చరిత్రలో విభాజక రేఖ.

సాంప్రదాయకంగా స్పీకర్ సభ సంరక్షకుడు, కార్యనిర్వాహక వర్గం దూకుడుకు వ్యతిరేకంగా సభ్యుల హక్కుల సంరక్షకుడు. రాష్ట్రపతి ప్రసంగంపై కీలకమైన చర్చ నుండి ప్రధానమంత్రి గైరుహాజరును సమర్థించటానికి గూఢచారి విభాగం సమాచారాన్ని స్పీకర్ ఉటంకించటం ద్వారా స్పీకర్ తన పాత్రను అతిక్రమించాడు. ఎంపిల సంరక్షకుడి పాత్ర నుంచి ప్రభుత్వానికి కవచంగా మార్పు చెందాడు. తన ఛాంబర్‌కు సర్వోన్నతాధికారి అయిన సభాధ్యక్షుడు ఇప్పుడు భద్రతా ఏజన్సీలకు సంధానకర్తగా వ్యవహరిస్తున్నాడు. స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూపు (ఎస్‌పిజి), ఇంటెలిజెన్స్ బ్యూరో స్పీకర్ కుర్చీలో ప్రాక్సీ సీటు కలిగి ఉన్నట్లు ఇది తెలియజేస్తున్నది. దేశంలో అత్యంత శక్తిమంతుడైన ప్రధానమంత్రి అత్యంత భద్రత కలిగిన భవనం లోపల ప్రజాప్రతినిధులను ఎదుర్కోలేకపోతే అది ఘోరమైన భద్రతా వైఫల్యాన్ని లేదా అనువైన రాజకీయ నిష్క్రమణ వ్యూహాన్ని సూచిస్తుంది. ప్రతిపక్ష ఎంపిల ఎప్‌స్టీన్ ఫైల్స్‌తో సంబంధమున్న కుట్రకు, దుస్తులు చింపివేసే పథకాలకు ముడిపెడుతూ అజ్ఞాత వ్యక్తుల నుంచి ''జాడ్య తీవ్రతతో'' వచ్చిన అవమానకరమైన క్లెయిములు వివాదాన్ని మరింత విషతుల్యం చేశాయి. వాటిని ''కృత్రిమ మేథ (ఎఐ) గిమ్మిక్స్''గా ప్రభుత్వం కొట్టివేసినప్పటికీ వ్యవస్థకు జరిగిన నష్టం వాస్తవం. లెజిస్లేటర్లకన్నా మహిళా ఎంపిల భద్రతకు ముప్పు అంటూ ఇంటర్నెట్ ట్రోల్స్ సంచలనాత్మకతను స్పీకర్ అధికారికంగా ప్రస్తావించటం సభ హుందాతనాన్ని దిగజార్చింది.

పార్లమెంటరీ నిరసనను భౌతిక ప్రమాదంగా చిత్రిస్తూ పాలకపక్షం స్పీకర్ కార్యాలయం ద్వారా, ప్రతిపక్షం మూల సారాంశాన్ని చట్టరహితం చేసేందుకు ప్రయత్నించింది. ప్రజాస్వామ్యంలో 'ఘోరావో'లు నినాదాలివ్వటం, వాకౌట్లు నిస్సహాయకుల పనిముట్లు వాటిని 'శాంతి–భద్రతల రిస్క్'గా ముద్రవేయటం పార్లమెంటును అదుపుచేసే ప్రయత్నం, కార్యనిర్వాహకవర్గం ఎప్పుడూ అసౌకర్యవంతంగా లేకుండా ఛాంబర్‌ను ఏకరూప సంస్కృతికి కుదించే ప్రయత్నం అవుతుంది.

స్పీకర్ చర్యలకు సాంకేతిక సమర్థన తరచూ రాజ్యాంగం మౌనంలోకి జారుకుంటుంది. సభ తన సొంత రూల్సు రూపొందించుకోవటాన్ని ఆర్టికల్ 118 అనుమతిస్తున్నప్పటికీ ''ఇంటెలిజెన్స్'' సమాచారం ఆధారంగా సభకు రావద్దని ప్రధానమంత్రికి సలహా ఇచ్చే అధికారం స్పీకర్‌కు ఇస్తున్న స్పష్టమైన నిబంధన ఏమీ లేదు. అంతేగాక రాజ్యాంగ నైతికత కేవలం రాయితీలోనే ఉండదు, ఆచరణ నుంచి వస్తుంది. స్పీకర్ అథారిటీ నిష్పాక్షికత అనే భావనపై ఆధాపడి ఉంటుంది. ఆ భావన పక్షపాత వెసులుబాటుకు ఉపయోగించినపుడు ఆ పదవి నైతిక బలాన్ని కోల్పోతుంది. ప్రతిపక్షం ఫిర్యాదు స్పష్టం : ఇంటెలిజెన్స్ కథనాలను స్పీకర్ బహిరంగంగా ఉపయోగించటం మొదలుపెడితే ఆయన రెఫరీ పాత్రను కోల్పోయి ప్లేయర్ అవుతాడు.

120 మంది ఎంపిల మద్దతు ఉన్న అవిశ్వాస తీర్మానం సంఖ్యాపరంగా ఓడిపోతుంది. బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ 272 గీతను సునాయాసంగా దాటుతుంది, తీర్మానం ఓడిపోతుంది. ఓం బిర్లా సభాధ్యక్షుడు కుర్చీలోనే ఉంటారు. అటువంటప్పుడు ప్రతిపక్షానికి ఎందుకీ చింత అనే ప్రశ్న ఉదయిస్తుంది. జవాబు ''విశ్వాస కొలమానం''లో ఉంటుంది. విచ్ఛిన్నమైన సంబంధాన్ని తీర్మానం రికార్డు చేస్తుంది. వ్యూహాత్మకంగా రాహుల్‌గాంధీ సంతకం లేనప్పటికీ – ఘర్షణను నేరుగా వ్యక్తుల మధ్య నుంచి తొలగించటం ఉద్దేశం కావచ్చు – సభలోని గణనీయమైన సంఖ్య సభాధ్యక్షుణ్ణి తటస్థ తీర్పరిగా ఇంకెంత మాత్రం చూడటంలేదన్న వాస్తవాన్ని అది మరుగుపరచదు. 1954లో జి.వి. మవలాంకర్ నుంచి ఇప్పటివరకు స్పీకర్‌లకు వ్యతిరేకంగాఅవిశ్వాస తీర్మానాలను ప్రతిపాదించిన చరిత్ర ఒక ధోరణి తెలియజేస్తుంది. ఈతీర్మానాలు ఎన్నడూ ఓటింగ్‌లో విజయవంతం కాలేదు–విశ్వాస సంక్షభాన్ని ప్రముఖంగా ముందుకు తెచ్చాయి.

కాంగ్రెస్‌కు చెందిన స్పీకర్ బలరాం జాఖడ్ కూడా సిపిఎం నాయకుడు సోమనాథ్ ఛటర్జీ నుంచి అవిశ్వాస తీర్మానం ఎదుర్కొన్నారు. నిరసన తెలియటానికి ప్రతిపాదించిన తీర్మానం ఓటమి పొందింది. చివరకు, ప్రతిపక్షపార్టీల ప్రభుత్వంలో ఛటర్జీ స్పీకర్‌గా పనిచేశారు.

| సంవత్సరం | స్పీకర్ | ఫలితం | ప్రధాన ఫిర్యాదు |
|---|---|---|---|
| 1954 | జి.వి. మవలాంకర్ | ఓటమి | కాంగ్రెస్ పట్ల పక్షపాతం ఆరోపణ |
| 1979 | జి.ఎం.సి.బాలయోగి | ఓటమి | పక్షపాత ఆరోపణలు |
| 2026 | ఓం బిర్లా | పెండింగ్ | ప్రధాన మంత్రికి కవచంగా సెక్యూరిటీ క్లెయింలను ఉపయోగించటం |

పార్లమెంటు గేట్ల వద్ద నిరసనలను నిషేధించిన స్పీకర్ బిర్లా నిర్ణయం ''దుర్గంలాంటి లెజిస్లేచర్'' ముద్రకు మరింత బలం చేకూర్చింది. నిరసన తెలియజేసే భౌతిక జాగాలను మూసివేయటం, ఎంపిల నడవడికపై నిందలు వేయటానికి స్పీకర్ సీటును ఉపయోగించటం ద్వారా ప్రస్తుత నాయకత్వం భారత పార్లమెంటరీ వ్యవస్థ డిఎన్‌ఎను ప్రాథమికంగా మార్పు చేస్తున్నది.

కాంగ్రెస్ కూడా గతంలో ఇలాగే వ్యవహరించిందన్న బిజెపి ప్రతివాదన ప్రస్తుతం విస్తరించిన వివాదాన్ని నిర్లక్ష్యం చేయటమే అవుతుంది. గత ఉదంతాలు తప్పు అయితే పక్షపాతాన్ని రెట్టింపు చేయటం పరిష్కారం కాదు. ''ఉన్నత ప్రమాణాలు నెలకొల్పటం'' వర్ధమాన అగ్రరాజ్యానికి అవసరం. 2026 అవిశ్వాస తీర్మానం సభలో ఓటింగ్ పరిభాషలో అప్రధానం కావచ్చు. అయితే దాని ప్రతిధ్వనులు బలంగా ఉంటాయి. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యం ''రెఫరీ'' ఏదో ఒకసారి పొరబడ్డారనే ఆరోపణకన్నా, హోంటీం జెర్సీ ధరించారన్న నింద బలంగా ఉంటుంది.

స్పీకర్ పదవి మెజారిటీపైకన్నా విశ్వాసంపై మనుగడ సాగిస్తుంది. ప్రతిపక్షం భద్రతా ముప్పు అని ఆరోపించినపుడు, వ్యావహారిక లెజిస్లేచర్‌కు అవసరమైన ''పరస్పర విశ్వాసం'' అంతర్ధానమవుతుంది. సభ తిరిగి సమావేశమైనపుడు స్పీకర్ చేతిలోని సుత్తి బల్లను మోదుతుంది. కాని దాని శబ్దం మరింత బోలుగా ఉంటుంది. భారత పార్లమెంటు ఇంకెంతమాత్రం చర్చావేదికగా ఉండబోదు, ప్రజల గొంతు మూయించటానికి కార్యనిర్వాహక వర్గం సెక్యూరిటీని ఉపయోగించబడుతుందనే అనుమానంతో కూడిన సభామందిరంగా ఉంటుంది.

(ఐపిఎ సర్వీసు)

## సాగు భూములన్నింటికీ రైతు భరోసా ఇవ్వాలి

ప్రజాపక్షం/ఉట్కూర్ : తెలంగాణ ప్రభుత్వం ఖరీఫ్ , రబీ సీజన్ అని తేడా లేకుండా సకాలంలో రైతులకు పెట్టుబడి సాయం రైతు భరోసా నిధులను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని మండలంలోని బిజ్వార్ గ్రామంలో శనివారం సామాజిక కార్యకర్త హెచ్.నర్సింహా, కూలీలు రోషన్‌బీ, చిన్న కిష్టమ్మ, శశికళ, ఎల్లమ్మ, నిర్మల తదితరులు డిమాండు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ఎకరానికి రూ.15,000 ఇవ్వాలని చెప్పి ప్రస్తుతం రూ.12,000 మాత్రమే ఇస్తున్నారని వారు పేర్కొన్నారు. అప్పట్లో రూ.3,000 తగ్గించి మోసం చేసినట్లయితే, ఇప్పుడు యాసంగి సీజిన్‌లో కొత్తగా పంటలు వేసిన వారికి శాటిలైట్ ఆధారంగా రైతు భరోసా ఇస్తామని చెప్పడం సరైన విధానం కాదని విమర్శించారు. పంటలు సాగు చేస్తున్న అన్ని భూములకు రైతు భరోసా వర్తింపచేయాలని, ఇప్పటికే ఆలస్యం జరిగినందున వెంటనే రైతుల ఖాతాల్లో నిధులు జమ చేసి ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

## సద్గురు సేవాలాల్ మహరాజ్ శోభాయాత్ర గోడ పత్రిక ఆవిష్కరణ



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్: సద్గురు సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి సందర్భంగా నేడు నిర్వహించనున్న శోభాయాత్రకు సంబంధించిన గోడ పత్రికను మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సద్గురు సేవాలాల్ మహరాజ్ బోధనలు సమాజానికి మార్గదర్శకమని, వారి ఆధ్యాత్మిక స్ఫూర్తి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రంలో అధ్యక్షులు రఘునాయక్, రవీందర్ నాయక్, డిజె వెంకీ, మహేశ్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా



ప్రజాపక్షం/దామరగిద్ద: దామరగిద్ద మండలం మల్‌రెడ్డి పల్లి గ్రామంలో శుక్రవారం 1వ వార్డులో వాటిలోని సమస్యలను పరిష్కరించి వారిని అభివృద్ధి పథంలో అర్పించేందుకు గ్రామ సర్పంచ్ శ్వేత శివకుమార్ మార్నింగ్ నిర్వహించారు. వార్డులో ఇంటింటికి తిరుగుతూ సమస్యలను తెలుసుకున్నారు. మండలంలో ఎవరు చేయని రీతిలో పద్ధతిలో మార్నింగ్ వాక్ నిర్వహించి శభాష్ సర్పంచు అనిపించుకున్నారు. వార్డులో ప్రజలు వివిధ సమస్యలు సర్పంచు దృష్టికి తీసుకువచ్చారు. 1.డ్రైనేజీ సమస్య, 2.ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేయాలని, 3.అంగన్వాడి వెల్డింగ్ నిర్మించాలని, 4.కరెంటు స్తంభాల సమస్య, వివిధ సమస్యలు ప్రజలు సర్పంచ్ శ్వేతా శివ కుమార్‌కి తెలిపారు. సమస్యలు ఎమ్మెల్యే సహకారంతో పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని తెలిపారు. ఏదైనా సమస్యలుంటే నేరుగా నాదృష్టికి తీసుకుని వస్తే తప్పకుండా పరిష్కారం చేస్తానని అన్నారు. గ్రామ పంచాయితీ సెక్రెటరీ జగదీష్, ఉపసర్పంచు లాలప్ప, వార్డు సభ్యులు రవి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుర్వ గోపాల్, కాలనీవాసులు, కోతి శ్రీను, వెంకటప్ప, బీంషప్ప, ఆశా వర్కర్స్, మహిళలు, తదితరులు ఉన్నారు.

## ఘనంగా కాకతీయ విద్యాసంస్థలు 16వ వార్షికోత్సవం



ప్రజాపక్షం/గద్వాల్ టౌన్ : కాకతీయ విద్యా సంస్థలు 16వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎక్స్ ఎమ్మెల్యే డీకే భరత సింహారెడ్డి, డిస్టిక్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ కె. విజయలక్ష్మి , జిహెచ్ ఎంసి టి. శ్రీనివాస్, ఎంఈఓ ఎస్. శ్రీనివాస్. ఎస్‌వి ఈవెంట్ ఫంక్షన్ హాల్ కృష్ణా రివర్ రోడ్ గద్వాల నందు హాజరయ్యారు.

## గద్వాల నూతన కౌన్సిలర్లకు మంత్రి శుభాకాంక్షలు



ప్రజాపక్షం/గద్వాల్ : గద్వాల మున్సిపల్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కౌన్సిలర్లకు మంత్రి హార్దిక శుభకాంక్షలు తెలిపి, అభినందించారు.

**కాంగ్రెస్ వశం కానున్న గద్వాల మున్సిపాలిటీ?**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గద్వాల మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులే కైవసం చేసుకోబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా తీర్పుతో గద్వాల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని స్పష్టం చేశారు. అభివృద్ధిలో గద్వాలను ఆదర్శంగా నిలుపుతాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో సాగుతున్న 'ప్రజా పాలన' గురించి మంత్రి పలు కీలక వ్యాఖ్యలు చేశారు.

**వాగ్దానాలు అమలు :** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా కొత్త కౌన్సిలర్లు కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు.

**ఆదర్శ మున్సిపాలిటీ :** గద్వాల మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఒక మోడల్ (ఆదర్శ) మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.''బంగారు తెలంగాణ'' నిర్మాణంలో భాగంగా అందరూ కలిసికట్టుగా పనిచేసి, ప్రజలకు పారదర్శకమైన పాలన అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో... అంచనాలు తారుమారు

### ఆరుగురిలో మిగిలింది ఇద్దరు
### డిప్యూటీ మేయర్‌గా ఇద్దరు పోటీ



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పోరేషన్ బీసీ మహిళకు రిజర్వేషన్ కావడంతో ముఖ్యంగా నలుగురు అభ్యర్థులు మేయర్ పదవి ఆశించారు. అందులో ప్రస్తుతం గెలిచిన ఇద్దరిలో ఒకరికి మాత్రం మేయర్ పదవి దక్కుతుందనే ఆశలో ఉన్నారు. 37 డివిజన్ నుంచి సీనియర్ కాంగ్రెస్ నేత ఎన్‌పి వెంకటేశ్ తన కూతురు నేహ శ్రీని బరిలో ఉంచారు. ఇక్కడ ఈమె గెలుపొందితే మేయర్ పీఠం దక్కే అవకాశం ఉండేది. కానీ ఇక్కడ ఫలితం ఆమెకు దక్కలేదు. ఇక్కడ బిజెపం అభ్యర్థికి విజయం వరించింది. 41 డివిజన్ అభ్యర్థి ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ సతీమణి స్వప్న పోటీలో ఉన్నారు. ఈయన భార్యకే మేయర్ పదవి కట్టబెట్టాలని సీనియర్ కాంగ్రెస్ నేతలు అనుకున్నారు. కానీ ఇక్కడ అనుకున్న ఫలితం రాలేదు. కాంగ్రెస్ పార్టీ గెలుస్తామనుకున్న ఈ స్థానంలో గులాబీ పార్టీ గెలుపొందింది. అలాగే సీనియర్ కాంగ్రెస్ నేత బురుజు సుధాకర్ రెడ్డి సతీమణి కూడా మేయర్ స్థానం కోసం పోటీలో ఉంది. తీవ్రంగా శ్రమించి నా ఓటమి వెంటాడింది. దీంతో కాంగ్రెస్ ఆశావహుళ మేయర్ ఆశలు గల్లంతయ్యాయి. కొందరు కాంగ్రెస్ నేతలు తమకు మేయర్ పదవి వస్తుందనే ఉద్దేశ్యంతో తమ ఓటమికి పనిచేశారని, ఈ విషయంపై డీసీసీకి, ఎమ్మెల్యేకు పార్టీ అధిష్టానం కు ఫిర్యాదు చేస్తామని వారు అంటున్నారు. ప్రస్తుతం మేయర్ పదవి దక్కదనే అక్కసుతోనే ఇతర డివిజన్లలో పోటీ చేసిన కొందరు నాయకులు తమ ఓటమికి ప్రయత్నం చేశారని వారు ఆరోపిస్తున్నారు. మొదటి నుంచి మేయర్ పదవి ఆశిస్తున్నా మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ తన భార్య ప్రసన్న లక్ష్మికి మేయర్ పదవి ఇవ్వాలని ఎన్నికల ముందునుంచే తన వాయిస్ గట్టిగానే వినిపిస్తున్నారు. ఎందుకంటే గతంలో ఆయన బిఆర్ఎస్ నుంచి మున్సిపల్ చైర్మన్ దక్కించుకుని అప్పటి బీఆర్ఎస్ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌తో విబేదాలు వచ్చి కొంతకాలానికి ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతో పాటు పలువురు కౌన్సిలర్లను తన వెంట తెచ్చుకున్నారు. ప్రస్తుతం 49 డివిజన్ నుంచి ఎన్నికైన తన భార్య ప్రసన్నకు మేయర్ పదవి ఇవ్వాలని ఎమ్మెల్యే యెన్నంపై ఒత్తిడి తెస్తున్నారనే సమాచారం. మరో డివిజన్ అభ్యర్థి కూడా మేయర్ పదవి తనకే ఇవ్వాలని ఎమ్మెల్యే, డీసీసీపై ఒత్తిడి పెంచుతోంది. 58 డివిజన్ నుంచి కాంగ్రెస్ పార్టీ కార్పోరేషన్ అభ్యర్థిగా ఏకగ్రీవం అయిన రమాదేవి కూడా మేయర్ పదవి కావాలని పట్టుబడుతున్నారు. డిప్యూటీ మేయర్ పదవిని ఇద్దరు నేతలు ఆశిస్తున్నారు. అందులో సురేందర్ రెడ్డి ఒకరు కాగా మరొకరు సీనియర్ కాంగ్రెస్ నేత రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్ కుమారుడు ఆశిస్తున్నారు.

**చీరాలకు పాలమూరు కార్పోరేటర్లు**

మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికల అనంతరం పాలమూరు రాజకీయాలు ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా చీరాల సముద్ర తీరానికి చేరాయి. గెలిచిన 29 మంది కాంగ్రెస్ అభ్యర్థులతో పాటు, కీలకమైన స్వతంత్ర అభ్యర్థులను కాంగ్రెస్ అధిష్టానం చీరాలలోని ఒక ప్రైవేట్ బీచ్ రిసార్ట్‌కు తరలించినట్లు సమాచారం. శుక్రవారం అర్ధరాత్రి బస్సుల్లో బయలుదేరిన అభ్యర్థుల బృందం శనివారం ఉదయానికి చీరాల తీరానికి చేరుకుంది. మేయర్ ఎంపికపై ఏకాభిప్రాయం కుదరకపోవడం, ఇతర పార్టీల నుంచి ప్రలోభాలు వచ్చే అవకాశం ఉండటంతో అధిష్టానం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు ఎప్పటికప్పుడు పరిస్థితి సమీక్ష చేస్తున్నారు. చీరాల క్యాంప్‌లో ఉన్న అభ్యర్థులకు కూడా తమలో మేయర్ ఎవరనే క్లారిటీ ఇవ్వకపోవడం గమనార్హం.

## జనరల్ స్థానాల్లో కూడా బిసిలు గెలవడం ఐక్యతకు నిదర్శనం

### బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం



ప్రజాపక్షం/హైదరాబాద్: జనరల్ స్థానాల్లో కూడా బిసి అభ్యర్థులు గెలవడం బిసిల ఐక్యతకు నిదర్శనమని బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం అన్నారు. అబిడ్స్ గన్‌ఫౌండ్రీలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ బిల్లును రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకొని, అమలు విషయంలో మాత్రం అన్ని పార్టీలు మోసం చేశాయన్నారు. మున్సిపల్ ఎన్నికలలో బిసిల విజయం ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక అని, తాజాగా జరిగిన 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో మొత్తం 2900 కు పైగా వార్డుల్లో మెజారిటీ స్థానాల్లో బిసి అభ్యర్థులు విజయం సాధించారని కొనియాడారు. ఈ ఫలితాలతో బిసిలను కేవలం ఓటు బ్యాంక్‌గా చూసే రోజులు పోయాయన్నారు. ఇకపై తమ హక్కులను విస్మరిస్తే ప్రజాస్వామ్య మార్గంలో మరిన్ని తీర్పులు ఇస్తామని గుజ్జ సత్యం హెచ్చరించారు. బిసి దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్రు కుమార స్వామి మాట్లాడుతూ బిసిల ఐక్యతే ఈ విజయానికి మూలమని, ఇకపై బిసిల హక్కుల కోసం మరింత సంఘటితంగా పోరాటం కొనసాగుతుంది అని స్పష్టం చేశారు. బిసి జెఎసి కన్వీనర్ రాజునేత మాట్లాడుతూ బిసిల ఓటు శక్తి ఎంత ప్రభావవంతమో ఈ ఎన్నికలు రుజువు చేశాయన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రీయ ఓబిసి జాతీయ అధ్యక్షులు ఐలయ్య గౌడ్, మనోజ్ కుమార్, జోగు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్లు, మేయర్లుగా బిసిలకు 60 శాతం ఇవ్వాల్సిందే



బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో ఈనెల 16వ తేదీన జరగనున్న 116 మున్సిపల్ చైర్మన్లు, ఏడు కార్పొరేషన్ మేయర్ల ఎంపికలో బిసిలకు 60 శాతం కేటాయించాల్సిందేనని, రాష్ట్రంలోని అన్ని పార్టీలు బిసిలకు జనాభా దామాషా ప్రకారం అవకాశం కల్పించాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈనెల 11వ తేదీన జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో కూడా బిసిలు పోటీ చేసి, మొత్తంగా 60 శాతం మంది బిసిలు కౌన్సిలర్లుగా, కార్పొరేటర్లుగా విజయం సాధించారని, ఇది బిసిల రాజకీయ చైతన్యానికి నిదర్శనమని కొనియాడారు. రాష్ట్రంలో జనరల్ స్థానాలు అనగానే కేవలం రెడ్డి, రావులకే రిజర్వేషన్ అయినట్టు చూస్తున్నారని, రాష్ట్రంలో చాలా మున్సిపాలిటీలలో 90 శాతం బడుగులకు చెందిన కౌన్సిలర్లు గెలుపొందితే, ఒకరిద్దరూ మాత్రమే అగ్రకులాల వారు గెలిచారని, 90 శాతం ఉన్న వారిని కాదని 9 శాతం ఉన్న అగ్రకులాలకు మున్సిపల్ చైర్మన్లుగా కట్టబెట్టాలని చూస్తే, చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని ఆయన హెచ్చరించారు. ప్రధానంగా భువనగిరి మున్సిపల్ ఎన్నికలలో 35 వార్డులలో ఒక్క రెడ్డి తప్ప మిగతా 34 చోట్ల బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ అభ్యర్థులు విజయం సాధించారని, స్థానిక ఎంఎల్‌ఎ అనిల్ కుమార్ రెడ్డి బిసిలకు కాదని, రెడ్డికి అవకాశం ఇవ్వాలని చూస్తున్నట్లు తెలిసిందని, ఇదే గనక జరిగితే అనిల్ రెడ్డిని వచ్చే ఎన్నికల్లో భువనగిరి గడ్డ నుంచి తరిమికొడతామని జాజుల శ్రీనివాస్ గౌడ్ తీవ్రంగా హెచ్చరించారు.

# మున్సిపల్ ఎన్నికలు ట్రైలర్ మాత్రమే

### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



ప్రజాపక్షం/హైదరాబాద్ : మున్సిపల్ ఎన్నికలు కేవలం ట్రైలర్ మాత్రమేనని, అసలు సినిమా ముందుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కేంద్ర కార్యాలయంలో కవిత, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజిరెడ్డి, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ లతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ తాము రాజకీయ పార్టీగా మారబోతున్నామని ప్రకటించగానే బిఆర్ఎస్ నేతలు ట్రోలింగ్‌కు దిగుతున్నారని విమర్శించారు. ఇప్పుడే కారుకూతలు కూయకండి అంటూ హెచ్చరించారు. గతంలో 90 శాతం మున్సిపాలిటీల్లో గెలిచిన బిఆర్ఎస్ ఇప్పుడు 16 స్థానాలకు మాత్రమే పరిమితమైందని, ప్రజల ప్రేమ ఎందుకు కోల్పోయారో ఆ పార్టీ సమీక్షించుకోవాలని సూచించారు. ఉత్తర తెలంగాణలో బిజెపి, బిఆర్ఎస్ ఒకరికి ఒకరు సహకరించుకున్నాయని, ఇది భవిష్యత్తులో పొత్తుకు తొలి మెట్టు కావచ్చని కవిత అభిప్రాయం వ్యక్తం చేశారు. సిపిఐ అడగకుండానే మద్దతు ప్రకటించడం వెనుక ఉద్దేశ్యాన్ని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో చేసిన ఆరోపణలను బిఆర్ఎస్ అంగీకరిస్తుందా అని ప్రశ్నించారు. సమయం తక్కువగా ఉన్నప్పటికీ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్‌తో కలిసి పోటీ చేశామని, ప్రజలు తమ అభ్యర్థులను 40 స్థానాల్లో గెలిపించారని తెలిపారు. అధికారికంగా 33 స్థానాలు ఉన్నప్పటికీ, బీ ఫారమ్ సమస్యల వల్ల మరో ఏడు స్థానాల్లో కూడా తమ అభ్యర్థులే గెలిచారని తెలిపారు. వడ్డేపల్లిలో స్పష్టమైన మాండేట్ లభించిందని, కానీ కాంగ్రెస్ ప్రలోభాలకు దిగుతోందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలు రాజకీయాల్లోకి రావాలనుకునే యువతకు మంచి వేదిక అని, వార్డు సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని కవిత సూచించారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజిరెడ్డి మాట్లాడుతూ జాగృతితో కలిసి పోటీ చేసిన తమ అభ్యర్థులను ప్రజలు గెలిపించడం ఆనందంగా ఉందన్నారు. కరీంనగర్‌లో బిజెపికి స్పష్టమైన మెజార్టీ రాలేదని, తమ నేతలను బెదిరించి కండువాలు కప్పే ప్రయత్నం చేశారని ఆరోపించారు. హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ భవిష్యత్తులో హెచ్ఎంఎస్, జాగృతి, ఫార్వర్డ్ బ్లాక్ కలిసి కార్మికుల హక్కుల కోసం పనిచేస్తాయని తెలిపారు. ఈ సమావేశంలో ఫార్వర్డ్ బ్లాక్ సెంట్రల్ కమిటీ సభ్యుడు ఆర్‌విఆర్ ప్రసాద్, జాగృతి ప్రధాన కార్యదర్శులు ఎల్. రూప్ సింగ్, నవీన్ ఆచారి పాల్గొన్నారు.

# రౌడీషీటర్ల ఇళ్లపై పోలీసుల ఆకస్మిక దాడులు



ప్రజాపక్షం/హైదరాబాద్: చార్మినార్ జోన్ పరిధిలో పోలీసులు భారీ కూంబింగ్ ఆపరేషన్ నిర్వహించి రౌడీ షీటర్ల ఇళ్లపై శనివారం రాత్రి ఆకస్మిక దాడులు చేశారు. నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యంగా చేపట్టిన ఈ ఆపరేషన్‌లో సుమారు 300 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. చార్మినార్ జోన్ డిసిపి కిరణ్ ఖారే ప్రభాకర్ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ తనిఖీలు జరిగాయి. ప్రతి పోలీస్ స్టేషన్ నుంచి ఇన్‌స్పెక్టర్లు, ఎసిపిలు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి జోన్ వ్యాప్తంగా సమన్వయంతో దాడులు నిర్వహించారు. రైన్ బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో మీర్‌చౌక్ ఎసిపి శ్యామ్ సుందర్, ఎస్‌హెచ్‌ఓ నేతాజీ, డిఐ నయీముద్దీన్ తదితరులు రౌడీ షీటర్ల ఇళ్లలో సోదాలు చేపట్టారు. ఒమర్ ఖాన్, ఆరిఫ్ ఖాన్, గౌసిద్దీన్, కలీముద్దీన్, సాయిుద్దీన్, జాఫర్ హుస్సేన్ నివాసాల్లో మారణాయుధాలు, గంజాయి వంటి నిషిద్ధ వస్తువుల కోసం తనిఖీలు నిర్వహించినప్పటికీ ఎటువంటి అక్రమ పదార్థాలు లభించలేదని పోలీసులు తెలిపారు.మీడియా సమావేశంలో డిసిపి మాట్లాడుతూ జోన్‌లో 90 మందికి పైగా రౌడీ షీటర్ల ఇళ్లలో ఏకకాలంలో తనిఖీలు చేసినట్లు వెల్లడించారు. 'కార్డన్ అండ్ సెర్చ్', 'ఆపరేషన్ కవచ్', వాహన తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పేర్కొన్నారు. రౌడీయిజంపై జీరో టోలరెన్స్ విధానం అమలు చేస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘిస్తే రూ50 వేల నుంచి రూ1 లక్ష వరకు జరిమానాతో పాటు కఠిన కారాగార శిక్ష తప్పదని హెచ్చరించారు.అదనంగా, రౌడీ షీటర్లకు పగలురాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించడంతో పాటు కౌన్సెలింగ్ కూడా చేపడతామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఈ ఆపరేషన్‌ను హైదరాబాద్ సిటీ పోలీస్ శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా చేపట్టింది.

## బాలాపూర్‌లో భారీ కార్డెన్ అండ్ సెర్చ్

### 800 ఇళ్ల సోదాలు, వాహనాలు స్వాధీనం



ప్రజాపక్షం/హైదరాబాద్: హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు భారీ స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. శంషాబాద్ జోన్ డిసిపి బి.రాజేష్ పర్యవేక్షణలో, ఆదిబట్ల డివిజన్ ఎసిపి డి.వి. ప్రదీప్ కుమార్ రెడ్డి మార్గదర్శకత్వంలో, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ ఎం. సుధాకర్ నేతృత్వంలో ఈ చర్యలు చేపట్టారు. బాలాపూర్ పరిధిలోని వాడిఎసాలెహీన్, షాహీన్ నగర్ ప్రాంతాల్లో జరిగిన ఈ తనిఖీలలో 300మందికి పైగా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఆపరేషన్‌లో భాగంగా 10 సెర్చ్ పార్టీలు, 18 కట్‌ఆఫ్ పార్టీలు, 10 లిఫ్టింగ్ పార్టీలు పని చేశాయి. ప్యారడైజ్ ఫంక్షన్ హాల్ వద్ద హోల్డింగ్ పాయింట్ ఏర్పాటు చేశారు.సుమారు 800 ఇళ్లలో క్షుణ్ణంగా సోదాలు నిర్వహించిన పోలీసులు పలు అనుమానాస్పద వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నంబర్ ప్లేట్లు లేని లేదా సరిగా లేని 27 బైక్‌లు, 2 ఆటో రిక్షాలు, అక్రమంగా నిల్వ ఉంచిన 9 గ్యాస్ సిలిండర్లు పట్టుబడ్డాయి. అపరిశుభ్ర పరిస్థితుల్లో నడుస్తున్న ఫ్రైడ్ ఆనియన్ తయారీ యూనిట్‌ను కూడా గుర్తించారు. అదేవిధంగా 17 మంది రౌడీ షీటర్లు, 7 మంది అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు. నేరాల నియంత్రణ, ప్రజల భద్రత, పోలీస్–ప్రజల మధ్య సమన్వయం బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.



## తెలంగాణసాహితీ దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండి

ప్రజాపక్షం/కల్వకుర్తి : తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఈ రాష్ట్రంలో సాహిత్యంపైన పలు దఫాలుగా పలుప్రాంతాల్లో లిటరరీ ఫెస్ట్‌లు జరిపి సాహితిసేవ చేసినటువంటి తెలంగాణసాహితి ఏర్పడి పదేళ్లయిన సందర్భంగా హైదరాబాద్ లోని ఏవి కళాశాల, తెలంగాణ సాహితి సంయుక్త ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఉత్సవాలలో కథ, నవల, కవిత్వం, పాట మొదలగు సాహిత్య ప్రక్రియలపై రెండురోజులపాటు చర్చలు, సమావేశాలు, గోష్టులు, పుస్తక ఆవిష్కరణలు జరుగుతాయని నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి వహీద్‌ఖాన్ తెలిపారు. దశాబ్ది ఉత్సవాల గోడపత్రికలను ఆవిష్కరించారు. సాహితిసభలు, నవ సృజనకారులను ఉత్సాహపర్చి మంచి సృజననుకావించే విధంగా ఉపయోగపడుతుందన్నారు. ఆవిష్కరణ కార్యక్రమంలో రాచమల్ల మల్లిఖార్జున, వెంకటేశ్వర్లు, రామ్, శ్రీనయ్యగౌడ్, రఘురాములుగౌడ్, మల్లయ్య, బక్కయ్య, సుధాకర్, చంద్రయ్యలు పాల్గొన్నారు.

## నా ఓటమికి కారకులు అయూబ్ ఖానే



### కాంగ్రెస్ పార్టీకి వెన్నుపోటు పొడిచిన నాయకులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాపక్షం/అమరచింత : మున్సిపల్ ఎన్నికల్లో 3వ వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిగా పోటీ చేసి గెలుపు దిశలో ఉన్న తనకు ఓటమికి కారకులైన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అయూబ్ ఖాన్, మార్కెట్ యార్డు కమిటీ డైరెక్టర్ పోసిరి విష్ణు వీరితో పాటు వారి అనుచరులు కారకులయ్యారని సోషల్ మీడియా ఇంచార్జ్, కాంగ్రెస్ అభ్యర్థి తౌఫిక్ ఆరోపించారు. శనివారం అమరచింత పట్టణంలోని ఫంక్షన్ హాల్ లో విలేకరుల సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో మైనార్టీలకు కాంగ్రెస్ పార్టీ ఇద్దరికీ అధిష్టానం అవకాశమిచ్చి గెలిచే సీట్లను ఓడించేందుకు శతవిధాల వారు కుట్రలు చేసి తమను 1,3,9 ఇతర వార్డులలో కూడా కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించేందుకు ప్రత్యర్థులతో చేతులు కలిపి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఓడించారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అయూబ్ ఖాన్, పోసిరి విష్ణు, అనుచర వర్గం మహేష్, ముస్లిం కమిటీ అధ్యక్షుడు ఎన్, అయూబ్, ఇతరులు తనను ఓడించారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలని మైనార్టీలకు రెండు సీట్లు కేటాయించారు. రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, టిపిసిసి కల్లుగీత సెల్ డిపార్ట్మెంట్ అధ్యక్షుడు కేశం నాగరాజు గౌడ్‌లు మైనార్టీలకు ఒకటి, మూడు వార్డులను కేటాయించారు. అందుకు విరుద్ధంగా కాంగ్రెస్ పార్టీకి కట్టుబడకుండా వ్యతిరేకంగా ఎన్నికల్లో ఇతర పార్టీల అభ్యర్థులకు గెలుపుకు తీవ్రంగా కృషిచేసి కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించేందుకు కుట్రలు చేశారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఓడించిన కాంగ్రెస్ నాయకులపై తగిన కఠిన చర్యలు తీసుకోవాలని అధిష్టానంకు ఫిర్యాదు చేస్తున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు అల్లాఫ్, అశ్వత్, దుబాయ్ మైనద్దీన్, తౌఫిక్, అజ్జు, అనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటమి సాంకేతికమే.. నైతిక విజయం మాదే



ప్రజాపక్షం/మక్తల్: మక్తల్ మున్సిపాలిటీ ఎన్నికలలో 10 వార్డులో ఐదుగురు అభ్యర్థులు రాజకీయ ప్రాతినిధ్యం కోసం పోటీ చేశారు. ఈ ఐదుగురిలో నలుగురు వివిధ పార్టీలు కుటుంబాలుగా 15 సంవత్సరాలుగా రాజకీయ ప్రాతినిధ్యం కోసం పోటి కొనసాగిస్తూనే ఉన్నారు. వీరిలో మొదటి సారిగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన డి.స్వరూపరాణి కుర్చీ గుర్తుకు 88 ఓట్లు వచ్చాయి. గెలుపోటముల సంగతి అటుంచితే అసెంబ్లీ ఎన్నికలను తలపించిన ఈ ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ తదితర పార్టీలు మనీ, మద్యం, మాంసం (దీనిని విటమిన్ M 3గా అభివర్ణించవచ్చు) వెదజల్లి ప్రజలను ఏమార్చాయి. సాధారణ ప్రజలు, చిన్న, చిన్న పార్టీలు, కమ్యూనిస్టూ విప్లవ శక్తులు పోటీ చేయలేనంత పరిస్థితులు నెలకొనడం అనారోగ్యకరమే కాదు సామాజిక విషాదంలో అంతకు మించి ప్రజాస్వామ్య, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. అంతిమంగా ఇది సామాజిక అనారోగ్యానికి దారి తీసే పరిణామం ఒక్కో వార్డుకు, ఒక్కో అభ్యర్థి 10,20 లక్షల చొప్పున ఖర్చు చేయడం సాధారణ విషయంగా మారింది. ఎలాంటి రాజకీయ ప్రాతినిధ్యం, పోటీ చేసిన అనుభవం లేని డి.స్వరూప రాణి స్వతంత్ర అభ్యర్థిగా ఈ ఎన్నికలలో నిలబడి నీతి, నిజాయితీ, నిబద్ధతతో 88 ఓట్లే సాధించినా దానిని నైతిక విజయంగానే భావిస్తున్నాము. మా రాజకీయ దృక్పథానికి విస్తృత సమాజమే కేంద్రం అయినప్పటికి మొదటి మెట్టుగా మేం పోటీ చేసిన 10 వార్డు అంబేద్కర్ నగర్, భరత్ నగర్, సుందర్ నగర్ కాలనీ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజల భాగస్వామ్యంతో ప్రత్యేక కేంద్రీకరణగా నిర్మాణాత్మకమైన కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.స్వరూపరాణి, డి.చంద్రశేఖర్, భగవంతు, భుట్టో, ఆంజనేయులు, విజయ్‌కుమార్, సాత్విక, సత్యవతి, చంద్రకళ, కమ్మరి నారాయణ, రఘు, శ్రీకర్, జుట్ల రాములు, రాంచందర్ పాల్గొన్నారు.



## చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపికపై సమీక్ష

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఈనెల 16న మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల సందర్భంగా చేపట్టాల్సిన పనులపై మున్సిపల్ మీటింగ్ హాల్‌లో సబ్ కలెక్టర్ ఎం.నారాయణ్‌అమిత్ మున్సిపల్ అధికారులు, సిబ్బందితో శనివారం సమీక్ష నిర్వహించారు. ఎన్నికను పారదర్శకంగా పకడ్బందీగా నిర్వహించాలని ఆయన కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించాలని ఆదేశించారు. నూతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సోమవారం ఉదయం 11గంటలకు ప్రారంభమవుతుందని, కౌన్సిలర్లు తొలుత ప్రమాణ స్వీకారం చేస్తారని కమిషనర్ జి.శ్రీనివాస్ తెలిపారు. అనంతరం సబ్ కలెక్టర్ పర్యవేక్షణలో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక జరుగుతుందని అన్నారు. మిర్యాలగూడ ఎక్స్ అఫీషియో సభ్యులుగా మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పేరు నమోదు చేయించుకున్నారని ఆయన తెలిపారు. దీంతో కౌన్సిల్ సభ్యుల సంఖ్య 49కు పెరిగింది. కార్యక్రమంలో వేములపల్లి తహసీల్దార్ హేమలత, డిటీ ప్రవీణ్‌కుమార్, ఆర్‌ఐ రామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ ఎండి.అబ్బాస్, మాస్టర్ ట్రైనరుల బాలు, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ వెంకన్న, మేనేజర్, రెవెన్యూ ఆఫీసర్ జ్ఞానేశ్వరి, టీపీఎస్ కె.అంజయ్య, చరణ్, నవీన్, వెంకటరమణ, శంకర్, షహబాజ్, శ్వేత ఉన్నారు.

## విద్య మనిషిని ఉన్నత స్థాయిలో నిలబెడుతుంది



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** సమాజంలో అత్యంత స్థానంలో నిలబెట్టేది విద్య ఒకటేనని ధనం, అధికారం కాదని నల్లగొండ డిఎస్‌పి శివరాంరెడ్డి అన్నారు.శనివారం పట్టణంలోని అప్పాజీపేట గురుకుల పాఠశాలలో పి ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లాస్ట్ మినిట్ రివిజన్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి డి.ఎస్.పి శివరాం రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసి మాట్లాడారు. చదువురాని మనిషి వ్యక్తిత్వం వికసించడమే కాకుండా సమాజాభివృద్ధికి బలమైన పునాది పడుతుందనీ, విద్య ఉన్నచోట అవగాహన ఉంటుందని, అవగాహన ఉన్నచోట అభివృద్ధి జరుగుతుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు వచ్చిన అనేకమంది విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉండి తమ లక్ష్యాలను నెరవేర్చుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం పి ఆర్ ఆర్ పౌండేషన్ చైర్మన్ చలం పాండురంగరావును డిఎస్‌పి అభినందించారు. ఈ సందర్భంగా పిఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారావు మాట్లాడుతూ విద్యతోనే సమాజ పురోగతి సాధ్యమవుతుందని విద్య మనిషిని అంధకారంలో నుంచి వెలుగు వైపు నడిపించే మార్గదర్శిఅని అన్నారు.ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ప్రిన్సిపాల్ భవాని, ఉపాధ్యాయులు,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతు భరోసా డబ్బులు ఇప్పించండి సారూ...

### 99 సంవత్సరాల వృద్ధురాలి వేడుకోలు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండల పరిధిలో గల గోపాలపురం గ్రామానికి చెందిన కురవృద్ధురాలు 99 సంవత్సరాల రైతు చీకూరి సైదమ్మ తన భర్త వెంకటయ్యకి రెండు ఎకరాల ఐదు గుంటల భూమి (2.5) పాస్ బుక్ నెంబర్ 1064 సర్వే నెంబర్ 551/అ1 వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా (నాలాగా) మార్చారు. గత ప్రభుత్వ కాలం నుంచి పోరాడుతున్న రైతుబంధు ఇవ్వలేదు. స్వాతంత్ర్య సమరయోధుడైన సైదమ్మ భర్త (రజకారుల పోరాట) స్వతంత్ర్య సమరయోధుడు ఫించన్ కూడా తన భర్తకి ఇవ్వలేదని, రైతుబంధు అన్న ఇస్తారని ఎదురు చూసి తాను కాలం చేశారని ఆవేదన వ్యక్తం చేసింది. అధికారుల నిర్లక్ష్యం వల్ల కష్టపడి సంపాదించిన భూమిని నాలా నుంచి తొలగించి పాస్‌బుక్ ఇవ్వాలని దీనిపై గత కొన్ని సంవత్సరాలుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడంలేదని అవేదన వ్యక్తం చేసిం ది. ప్రభుత్వం రైతు భరోసా ఇస్తారా ఆశపడింది. తన చివరి కొరిక ఆ డ బ్బులు అందుకోవాలని ఆశ పడుతున్నాను అని విన్నపం ఒక పోరాటం. స్వ చ్ఛంద సంస్థకు వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షురాలికి లీలావతి కోరినది.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి , జిల్లా కలెక్టర్ దృష్టికి సైదమ్మ కు రువృద్ధురాలు ఆమె చివరి కోరికను తీర్చాలని విన్న పం, పోరాటం ద్వారా తెలియజేస్తున్నామన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో ఫుడ్‌సెఫ్టీ కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం నుండి వచ్చే ఫుడ్ పిల్లలకు సక్రమంగా అందే విధంగా చూసుకునే పూర్తి బాధ్యతలు ఆ గ్రామ సర్పంచ్‌కి అప్పగించి ప్రతి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో ఫుడ్ సెఫ్టీ కమిటిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రత్యేకంగా తీసుకున్ని ర్ణయం మేరకు శనివారం మండల పరిధిలోని పరెడ్డిగూడెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్ కేతుపల్లి నర్సయ్య ఆధ్వర్యంలో ఫుడ్ సెఫ్టీ కమిటిని ఎన్నుకున్నారు. ఈ కమిటికి సర్పంచ్ నర్సయ్య, ఉప సర్పంచ్ మేకల మల్లారెడ్డి చైర్మన్‌లుగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతి చిన్నారికి ఫుడ్ అందే విదంగా చూస్తామని అన్నారు. కేంద్రానికి వచ్చే ఆహార పదార్దాలను వృధా కాకుండా సకాలంలో అందించడానికి కమిటి పనిచేస్తుందని అన్నారు. ఈ కమిటి కన్వీనర్‌గా అంగన్‌వాడీ టీచర్ సుగుణ, ప్రాధమిక పాఠశాల హెచ్‌ఎం రజిత, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి అంబ టి పాపిరెడ్డి, అంగన్‌వాడీ పిల్లల తల్లులు ప్రియాంక, అనంతు స్వరూప, లావణ్య, రాణి, నాగమణి, రమాదేవితో పాటు మరికొంత మందిని ఎన్నుకున్నారు.

## 16న ప్రజావాణి రద్దు

**ప్రజాపక్షం/ప్రజాపక్షం :** మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నందున, 16న (సోమవారం) నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ హనుమంత రావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ కోరారు.

# సూర్యాపేట పట్టణాభివృద్ధికి అవిరళ కృషి

### అవినీతి రహిత పురపాలక సంఘంగా తీర్చిదిద్దండి
### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి




**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట పురపాలక సంఘాన్ని అవినీతి రహిత పురపాలక సంఘంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి హితవుపలికారు. గతంలో సూర్యాపేట పురపాలక సంఘంలో చోటుచేసుకున్న అవినీతి అక్రమాలు పునరావృతం కాకుండా నూతన పాలక మండలి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన ఉద్భోదించారు. నూతనంగా ఎన్నికైన సూర్యాపేట పురపాలక సంఘం ప్రతినిధులు శనివారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. 48 వార్డులకు గాను 31 స్థానాల్లో విజయం సాధించిన కౌన్సిలర్లను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి మీద ఉన్న సూర్యాపేట పట్టణం ఇప్పటి వరకు ఊహించిన మేరకు అభివృద్ధి సాధించలేకపోయిందన్నారు. పట్టణ ప్రజలు కాంగ్రెస్ పార్టీ మీద చూపిన ఆదరణ అనన్య సామాన్యమైనదని, ప్రజలు మనమీద అపారమైన నమ్మకంతో గురుతర బాధ్యత మోపారని వారి నమ్మకాన్ని నిలబెట్టేందుకు కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లు పని చేయాలని ఉపదేశించారు. జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రిగా సూర్యాపేట పట్టణాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. ఎప్పటికప్పుడు పట్టణాభివృద్ధిపై సమీక్షించుకుని ప్రత్యేక ప్రణాళికలు రూపొందించేందుకు కార్యాచరణ పథకాన్ని రూపొందించుకుందామన్నారు. అందుకు సరిపడా నిధులు తెచ్చి సూర్యాపేట పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, సూర్యాపేట మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, పిసిసి కార్యదర్శి చకిలం రాజేశ్వర్‌రావు, రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్, డిసిసిబి మాజీ డైరెక్టర్ ముదిరెడ్డి రమణారెడ్డి, సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి మొరిశెట్టి నివేదిత లక్ష్మాదితోపాటు నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ అహంకారానికి ప్రజల తీర్పే చెంపపెట్టు

### ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య
### అక్రమంగా కాంగ్రెస్ పీఠం లాక్కున్ననాడే గొంగిడి దంపతుల పతనం మొదలైంది
### యాదాద్రి అభివృద్ధి పేరిట ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బతీసిన బిఆర్ఎస్ : సిపిఐ నేత గోదా శ్రీరాములు



**ప్రజాపక్షం/యాదాద్రి :** 'ప్రజా తీర్పును గౌరవించకుండా, అక్రమ పద్ధతుల్లో అధికార పీఠాలను కైవసం చేసుకునే వారికి పతనం తప్పదని మున్సిపల్ ఎన్నికల ఫలితాలు నిరూపించాయి' అని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. శనివారం యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి దంపతులను లక్ష్యంగా ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 2020 మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా, ఎక్స్ అఫిషియో ఓట్లతో యాదగిరిగుట్ట చైర్మన్ పీఠాన్ని బీఆర్ఎస్ అక్రమంగా లాక్కుందని అయిలయ్య మండిపడ్డారు. 'మహేందరన్నా.. ఆ రోజే నీ పతనానికి బీజం పడింది. కర్మ ఎవరినీ వదిలిపెట్టదు అనడానికి ఈనాటి ఫలితాలే సాక్ష్యం. అప్పుడు అక్రమంగా గద్దెనెక్కిన బీఆర్ఎస్.. నేడు కేవలం ఒక్క స్థానానికే పరిమితమైంది. ఇప్పుడు నీ తల ఎక్కడ పెట్టుకుంటావు?' అని ప్రశ్నించారు. ఓటమి తప్పదని తెలిసినా ప్రగల్భాలు పలికే అహంకార పూరిత మాటలను ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు.ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సమానంగా కొనసాగుతున్నాయని, అందుకే ప్రజలు ప్రతి ఎన్నికలో కాంగ్రెస్‌కు బ్రహ్మరథం పడుతున్నారన్నారు.

**విజయాల పరంపర:** అసెంబ్లీ, పార్లమెంట్, ఎమ్మెల్సీ, సర్పంచ్ ఎన్నికల నుంచి నిన్నటి మున్సిపల్ ఎన్నికల వరకు కాంగ్రెస్ జైత్రయాత్ర కొనసాగుతోందని గుర్తుచేశారు. తాజా మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతం స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించడం ప్రభుత్వ పాలనపై ప్రజలకున్న విశ్వాసానికి నిదర్శనమని చెప్పారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డిల సహకారంతో ఉమ్మడి జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులే ఈ విజయానికి పునాదులని కొనియాడారు.

**సేవకుడిగా మీ వెంటే ఉంటా..**

'నా బలం పదిమంది నాయకులు కాదు.. నా కార్యకర్తలు, నా నాయకత్వంపై ప్రజలకున్న నమ్మకం' అని అయిలయ్య భావోద్వేగంతో అన్నారు. ఆలేరు బిడ్డగా గడపగడపకు తిరిగి సమస్యలు తెలుసుకున్నానని, ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటానని స్పష్టం చేశారు.

**జీవన ప్రమాణాలను దెబ్బతీసిన బిఆర్ఎస్: సిపిఐ నేత గోదా శ్రీరాములు**

ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బతీసిన బిఆర్ఎస్ కు ఈ మున్సిపల్ ఎన్నికల్లో యాదగిరిగుట్ట పట్టణ ప్రజలు మంచి తీర్పు ఇచ్చారని సిపిఐ రాష్ట్ర నాయకులు గోదా శ్రీరాములు అన్నారు. కాంగ్రెస్ సిపిఐ కూటమిని ఆదరించిన ప్రజలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. యాదగిరిగుట్ట పట్టణంలో సుమారు 3వేల మందికి సొంత ఇల్లు లేవని సొంత స్థలాలు కూడా లేవని వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇచ్చే విధంగా ఐలయ్య కృషి చేయాలని కోరారు. తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన యాదగిరిగుట్టను తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరి రాజయ్య, సిపిఐ ఎం జిల్లా నాయకులు షేక్ ఉస్మాన్ షరీఫ్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు మంగ సత్యనారాయణ, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం పాల్గొన్నారు.

# పక్కా ప్రణాళిక... ప్రత్యర్థులకు పట్టు దొరక విలవిల

### అన్నీ తానై వ్యవహరించి..
### తండ్రిని మించిన తనయుడుగా ఎమ్మెల్యే జై వీర్‌రెడ్డి
### వ్యూహాత్మక ప్రణాళికలు...
### ఎమ్మెల్యే ప్రతిష్టను పెంచిన ఎన్నికలు...



**ప్రజాపక్షం/హాలియా:** పక్కా ప్రణాళిక...వ్యూహాత్మక రచన..అన్నీ తానై వ్యవహరించిన తీరు ప్రత్యర్థులకు అర్థం కాక విలవిలలాడారు... ఒక ఎమ్మెల్యే క్షేత్రస్థాయి నుంచి రచనలు చేస్తూ.. ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ తాము అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన అభివృద్ధిని ఇంటింటికి వివరిస్తూ ప్రచారం చేసిన తీరు రాజకీయ ఉద్దండలకు కూడా అర్థం కాని రీతిలో వ్యవహరించి రెండు మున్సిపాలిటీలను ఒంటి చేతిపై గెలిపించిన ఘనత ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి సొంతం.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇక్కడ ఎమ్మెల్యేగా ప్రజలతో మమేకమై సమస్యను వారు చెప్పకుండానే తాను చేసిన పర్యటనలలో వాటిని గుర్తించి దానిని ఎవరికి తెలియకుండానే పరిష్కరించి చక్యంగా వ్యవహరిస్తున్న తీరుకు ప్రజలు పుర ఎన్నికల్లో పట్టం కట్టారు.మున్సిపల్ ఎన్నికల్లో ఎమ్మెల్యే జై వీర్రెడ్డి తమ పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు పడిన శ్రమ అంతా ఇంతా కాదు. ఒక ఎమ్మెల్యే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించడం అనేది ముందు తరాలకు ఆదర్శప్రాయంగా నిలిచేలా వ్యవహరించిన తీరు పలువురిని ఆకట్టుకుంది. నియోజకవర్గంలో ఉన్న రెండు మున్సిపాలిటీలలో 24 మంది కౌన్సిలర్ సభ్యులు ఉన్నారు. ఇందులో 22 మంది కౌన్సిలర్లను గెలిపించారంటే ఆయన చేసిన ఎన్నికల ప్రచారం ఏ స్థాయిలో ఉందో గెలిచిన అభ్యర్థులే అందుకు నిదర్శనం. గెలిచిన ప్రతి అభ్యర్థి 150 ఓట్లకు పైనే మెజారిటీ సాధించిన తీరు ఎమ్మెల్యే శ్రమకు తగిన ఫలితం. అభ్యర్థులను ఎప్పటికప్పుడు పలకరిస్తూ ప్రచారంలో ఏ మాత్రం ఆదమర్చి వ్యవహరించినా అసలుకే ప్రమాదం వస్తుందని దీనిని అభ్యర్థులు తప్పక గుర్తించి అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేసి ప్రచా రం నిర్వహించారు. ఆ కఠోర శ్రమనే ఇంతటి భారీ విజయాన్ని తెచ్చిపెట్టింది. తండ్రిని మించిన తనయుడుగా ఎమ్మెల్యే జై వీర్ రెడ్డిని ఈ ఎన్నికలు నిలబెట్టాయనడంలో సందేహం లేదేమో.

## దేశంలో, రాష్ట్రంలో చదువుకున్న యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

### సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**ప్రజాపక్షం/మునగాల:** దేశంలో, రాష్ట్రంలో చదువుకున్న యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, మునగాల పరగాణ అంటేనే ఒక చరిత్ర నేపథ్యమున్న మండలమని, జగన్నాధపురం గ్రామంలో అనేక మంది తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో అనేక మంది అసువులు బాసారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. శనివారం మండల పరిధిలోని జగన్నాధపురం గ్రామంలో నిర్వహించిన తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల స్మారక సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలు ఓటువేసి అధికారం ఇచ్చిన తర్వాత హామీలు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఉచిత విద్యతోపాటు ఉచిత వైద్యాన్ని అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నాలు చేస్తుందన్నారు. రేపు జరగబోయే ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికల్లో సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా సిపిఎం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. సిపిఎం మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి, ముల్కలపల్లిరాములు, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రమేష్ పాల్గొన్నారు.



# బృందావన్ ఫార్మా కంపెనీలో భారీ అగ్ని ప్రమాదం





**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఎల్లగిరి గ్రామపంచాయతీ పరిధిలోని బృందావన్ ఫార్మా పరిశ్రమలో రియాక్టర్ పేలి భారీ శబ్దంతో మంటలు ఎగిసిపడ్డాయి. శుక్రవారం సాయంత్రం పరిశ్రమలో షార్ట్ సర్క్యూట్ జరగడంతోనే సంభవించవచ్చు అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భారీగా పొగలు ఎగిసి పడడంతో పరిసర ప్రాంత ప్రజలు భయాందోళనకు గురయ్యారు. చౌటుప్పల్ పరిధిలోని వివిధ గ్రామాల్లో వందలాది ఫార్మా బల్క్ డ్రగ్స్ పరిశ్రమలలోనే ఉండడంతో ఇలాంటి దుర్ఘటనలు జరుగుతున్నా.. పరిశ్రమ యజమాన్యాలు ముందు జాగ్రత్తలు తీసుకోవడంలో విఫలమవుతూనే ఉన్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం రసాయన రియాక్షన్ లేదా షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కూడా సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ ఘటనలో ఫ్యాక్టరీలోని భద్రత ప్రమాణాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పరిశ్రమలలో నిబంధనలు అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు కోరుతున్నారు. పూర్తిస్థాయి సమాచారం విచారణ అనంతరం ప్రమాదానికి గురైన కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన ఆంజనేయులు ఇల్లు విద్యుదాఘాతంతో శనివారం దగ్ధమైంది. దీంతో ఇంట్లోని విలువైన సామాగ్రి దగ్ధమైంది. విషయం తెలుసుకున్న మిర్యాలగూడ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, వార్డు కౌన్సిలర్ నూకల కవిత వేణుగోపాల్‌రెడ్డి వెళ్లి బాధితులను పరామర్శించారు. జరిగిన నష్టానికి పరిహారం గురించి అధికారులతో మాట్లాడుతానని అన్నారు. ప్రభుత్వం నుంచి సాయం త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన కోరారు. ఆయన వెంట ఆర్‌ఐ టి.రామకృష్ణ, విద్యుత్ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏడెల్లి తిరుపతిరెడ్డి, మన్య కృష్ణ మూర్తి, కృష్ణకిశోర్‌రెడ్డి, ఇంజం లచ్చిరెడ్డి, గుడిపాటి కృష్ణ శ్రీను నాయక్, ఎండి.రఫీ, ధనావత్ కిషన్‌నాయక్ పాల్గొన్నారు.




## రైతు- కార్మిక సమస్యలపై ఉద్యమాలకు సిద్ధం కావాలి

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు పిలుపు

**ప్రజాపక్షం/మునుగోడు:** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం సిపిఐ ప్రజల పక్షాన అండగా నిలుస్తుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తీర్పారి వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. శనివారం మునుగోడులోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవసాయ,కార్మిక రంగాలను సంక్షోభంలోకి నెట్టే విధానాలు అమలు చేస్తోందని ఆయన ఆరోపించారు. వ్యవసాయ రంగంలో సమూల మార్పుల పేరుతో రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. వరి, పత్తి వంటి పంటలను రైతులు మార్కెట్లో అమ్మలేని పరిస్థితి తీసుకువచ్చిందని తెలిపారు.ఎరువుల సబ్సిడీలు తగ్గించడం వల్ల రైతులపై అధిక భారం పడిందన్నారు.పత్తి కొనుగోలులో ఆన్లైన్ స్లాట్ బుకింగ్ పేరుతో దళారుల దోపిడీ పెరిగిందని,యూరియా కోసం రైతులు గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. స్లాట్ బుకింగ్ విధానం మాయ మార్కెట్‌గా మారిందని పేర్కొన్నారు. రైతులకు,పేద ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన కోసం ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురజా రామచంద్రం మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు బిజెపి, బిఆర్ఎస్ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పారని పేర్కొన్నారు. ఈ సమావేశానికి బి.లాలు అధ్యక్షత వహించగా సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీనివాస్,జిల్లా కౌన్సిల్ సభ్యులు సురిగి చలపతి, మాజీ జెడ్‌పిటిసి గోస్కొండ లింగయ్య,మండల కార్యవర్గ సభ్యులు సర్పంచ్ బండమీది యాదయ్య, దుబ్బ వెంకన్న,మందుల పాండు,మునుగోటి దయాకర్,మాధగోని సత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ అభివృద్ధికి కృషి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** తెలంగాణలో గ్రామ గ్రామాన గ్రంథాలయాలు నెలకొల్పి గ్రామాలలో వసూలు చేస్తున్న గ్రంథాలయ పన్నును విధిగా గ్రంథాలయానికి కేటాయించాలని గ్రంథాలయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆచార్య లక్ష్మణరావు అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల లో నల్లగొండ గ్రంథాలయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మేధావులు రచయితలు,సాహిత్య కారుల పాత్ర అనే అంశంపైఒకరోజు సదస్సును నిర్వహించారు.డాక్టర్ గోనారెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలంటే ప్రభుత్వ డాక్టర్స్ సహాయ సహకారాలు కావాలని ప్రభుత్వాల నుంచి సహకారం అందిస్తేనే గ్రంథాలయాలు ఏర్పాటు చేయబడతాయని తెలుపుతూ కోమటిరెడ్డి ప్రతిక్ ఫౌండేషన్ తరపున గ్రంథాలలకు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలోఆచార్య బెల్లి యాదయ్య,రవి కుమార్ చేగొని,గ్రంధాలయ శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ రాజారామ్,కవి మూనాస వెంకట్,సుధారాణి, బైరెడ్డి కృష్ణారెడ్డి,మేరెడ్డి యాదగిరి రెడ్డి, ఎలికట్ట శంకర్,డాక్టర్ హస్సేనా,అంబటి వెంకన్న పాల్గొన్నారు.

## బాల్య వివాహాలను అరికట్టాలంటే చదువే ఆయుధం




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** బాల్య వివాహాలను అరికట్టాలంటే ఒకే ఒక ఆయుధం చదువేనని సీడబ్లుసీ చైర్మన్ చింత కృష్ణయ్య అన్నారు. శనివారం అవంతీపురం జంగాల కాలనీలో, మిర్యాలగూడలోని తెలంగాణ మైనార్టీ స్కూల్‌లో అంకూర్ మీడియా ఆధ్వర్యంలో బాల్య వివాహ రహిత 100 రోజుల అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండే వరకు బాల్యం అంటారని, బాల్యంలో పిల్లలందరు చదువుపైనే శ్రద్ధ చూపాలన్నారు. ఆడ పిల్లలు అన్ని రంగాల్లో ముందుండాలంటే చదువును మధ్యలో ఆపివేయవద్దన్నారు. ఎక్కడైనా ఎవరికైనా బాల్య వివాహాలు జరిపిస్తున్నట్లు తెలిస్తే వెంటనే 1098కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో మైనార్టీ స్కూల్ ప్రిన్సిపాల్ అరుణకుమారి, అంకూర్ మీడియా కోఆర్డినేటర్ గౌరీ శంకర్, ఉమెన్ అండ్ ఛైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ లీగల్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకన్న, అవంతీపురం సర్పంచ్ సుజాతసురేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ నాగమణి, రాధిక, హెచ్‌ఏబీ మహిళా శక్తి సాధికారత శ్రీదేవి, మల్లేష్‌యాదవ్, రమణి, అంగన్‌వాడి టీచర్లు సువర్ణ, వసుమతి, అంజలిదేవి, సుజిత, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రపంచకప్‌లో సఫారీల హ్యాట్రిక్

గత సీజన్ రన్నరప్ దక్షిణాఫ్రికా ఈసారి దుమ్మురేపుతోంది. తమ ఆటకు తిరుగులేదని చాటుతూ లీగ్ దశలో బలమైన న్యూజిలాండ్‌ను చిత్తు చేసి హ్యాట్రిక్ విజయం నమోదు చేసింది. భారీ ఛేదనలో కెప్టెన్ ఎడెన్ మర్క్‌రమ్(86 నాటౌట్) అర్ధ శతకంతో కదం తొక్కగా.. కివీస్‌పై 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. అంతకు ముందు మార్కో యాన్సెన్(440) సంచలన స్పెల్‌తో రెండొందలకు పైగా కొట్టేలా కనిపించిన బ్లాక్ క్యాప్స్‌ను 175కే కట్టడి చేసింది ప్రొటీస్ జట్టు. వరుసగా మూడో విక్టరీతో సూపర్ 8కు చేరువైంది మర్క్‌రమ్ బృందం. పొట్టి ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా జోరు కొనసాగుతోంది. తొలి రెండు మ్యాచుల్లో అలవోకగా గెలుపొందిన సఫారీ జట్టు ఈసారి ఫేవరెట్ న్యూజిలాండ్‌ను మట్టికరిపించింది. ప్రత్యర్థి నిర్దేశించిన భారీ ఛేదనలో కెప్టెన్ ఎడెన్ మర్క్‌రమ్(86 నాటౌట్) తొలి ఓవర్ నుంచే దంచేశాడు. క్వింటన్ డికాక్(20) , రియాన్ రికెల్టన్(21)తో కలిసి కివీస్ బౌల్లను చెడుగుడు ఆడుకున్న మర్క్‌రమ్ అర్ధ శతకంతో జట్టును విజయ తీరాలకు చేర్చాడు. పెర్గూసన్ వేసిన 18వ ఓవర్ మొదటి బంతినే డేవిడ్ మిల్లర్(24 నాటౌట్) సిక్సర్‌గా మలచగా 7 వికెట్ల తేడాతో ప్రొటీస్ టీమ్ జయభేరి మోగించింది.



# టీ20 చరిత్రలోనే ఐర్లాండ్ టాప్ స్కోరు!

టీ20 ప్రపంచ కప్ 2026లో ఐర్లాండ జట్టు ఎట్టకేలకు ఫామ్‌లోకి వచ్చింది. వరుస ఓటములతో సతమతమవుతున్న ఆ జట్టు ఒమన్‌పై జరిగిన మ్యాచ్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగిపోయింది. కొలంబో వేదికగా జరిగిన ఈ మ్యా చ్‌లో ఐర్లాండ బ్యాటర్లు.. బౌలర్లు సమిష్టిగా రాణించి 96 పరుగుల భారీ విజయాన్ని నమోదు చేశారు. ఈ టోర్నీలో ఐర్లాండ్‌కు ఇదే తొలి విజయం కావడం విశేషం. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాండ్ జట్టుకు ఒమన్ బౌలర్లు ఏమాత్రం అడ్డుకట్ట వేయలేకపోయారు. ప్రారంభం నుంచే ఐర్లాండ్ బ్యాటర్లు ధాటిగా ఆడారు. ముఖ్యంగా తాత్కాలిక కెప్టెన్ లోర్కాన్ టక్కర్ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో జట్టును ముం దుండి నడిపించాడు. లోర్కాన్ టక్కర్ కేవలం కొద్ది పరుగుల తేడాతో సెంచరీ మిస్ చేసుకున్నప్పటికీ.. 94 పరుగులతో నాటౌట్‌గా నిలిచి జట్టు భారీ స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. అతనికి తోడుగా గెరెత్ డెలానీ (56) అద్భుత అర్ధ శతకంతో అలరించగా, ఇన్నింగ్స్ చివరలో జార్జ్ డాక్రెల్ విధ్వంసం సృష్టించాడు. డాక్రెల్ కేవలం 9 బంతుల్లోనే 5 సిక్సర్లతో 35 పరుగులు చేయడంతో ఐర్లాండ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 235 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. ఐర్లాండ్ సాధించిన ఈ 235 పరుగుల స్కోరు వారి టీ20 అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలోనే అత్యధిక స్కోరుగా రికార్డులకు ఎక్కింది. అంతేకాకుండా, టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఇది రెండో అత్యధిక జట్టు స్కోరు కావడం విశేషం. ఒమన్ బౌలర్లలో షకీల్ అహ్మద్ 3 వికెట్లు తీసినప్పటికీ.. భారీగా పరుగులు సమర్పించుకోవాల్సి వచ్చింది. ఐర్లాండ బ్యాటర్ల ధాటికి ఒమన్ బౌలింగ్ విభాగం పూర్తిగా తేలిపోయింది. 236 పరుగుల హిమాలయ సమానమైన లక్ష్యంతో బరిలోకి దిగిన ఒమన్ జట్టుకు ఆరంభం ఆశాజనకంగానే ఉన్నా.. అది ఎక్కువ సేపు నిలవలేదు. ఓపెనర్ అమీర్ కలీమ్ (50 పరుగులు), హమ్మద్ మీర్జా (46 పరుగులు) పోరాడినప్పటికీ మిగిలిన బ్యాటర్లు చేతులెత్తేశారు. ఐర్లాండ పేసర్ జోషువా లిటిల్ తన నిప్పులు చెరిగే బంతులతో ఒమన్ బ్యాటర్లను బెంబేలెత్తించాడు. లిటిల్ 3 వికెట్లు పడగొట్టి ఒమన్ పతనాన్ని శాసించగా, మాథ్యూ హంఫ్రీస్, బారీ మెకార్తీ చెరో రెండు వికెట్లతో రాణించారు. దీంతో ఒమన్ జట్టు 139 పరుగులకే కుప్పకూలి భారీ ఓటమిని చవిచూసింది.




# స్కాట్లాండ్‌పై విజయంతో సూపర్ 8 రేసులోకి ఇంగ్లాండ్




టీ20 ప్రపంచకప్‌లో ఇంగ్లాండ్ మళ్లీ పుంజుకుంది. వెస్టిండీస్ చేతిలో కంగుతిన్న బ్రూక్ సేన.. ఉత్కంఠ పోరులో స్కాట్లాండ్‌పై విజయంతో సూపర్ 8 రేసులోకి దూసుకొచ్చింది. హిట్టర్లతో నిండిన ఇంగ్లాండ్‌ను స్కాట్లాండ బౌలర్లు బెంబేలెత్తించి సవాల్ విసిరారు. ప్రధాన ఆటగాళ్లు విఫలమైనా టామ్ బ్యాంటన్(63 నాటౌట్) సమయోచితంగా ఆడాడు. 19వ ఓవర్లో విల్ జాక్స్ (16 నాటౌట్) 4, 6 బాదడంతో 5 వికెట్ల తేడాతో గెలిచింది. లీగ్ దశలో రెండో విజయంతో సూపర్ 8 అవకాశాల్ని మెరుగు పరుచుకుంది. పదో సీజన్ పొట్టి ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాపై జింబాబ్వే విజయం ఓ సంచలనం. శనివారం స్కాట్లాండ్ సైతం రెండుసార్లు ఛాంపియన్ ఇంగ్లాండ్‌కు షాకిచ్చేలా కనిపించింది. కానీ, టామ్ బ్యాంటన్(63 నాటౌట్) ఒంటరి సైనికుడులా పోరాడి జట్టుకు ఓటమిని తప్పించాడు. 153 పరుగుల ఛేదనలో తొలి ఓవర్లోనే మెక్ముల్లెన్ (123) డేంజరస్ ఓపెనర్ ఫిల్ సాల్ట్(2)ను ఔట్ చేసి ఇంగ్లాండ్‌కు షాకిచ్చాడు. రెండో ఓవర్లో జోస్ బట్లర్(3) సైతం డగౌట్ చేరగా.. బ్యాంటన్, జాకబ్ బెథెల్(32) మూడో వికెట్‌కు 66 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఇంగ్లాండ్‌ను గెలుపు దిశగా నడిపిస్తున్న ఈ ద్వయాన్ని డేవిడ్సన్ విడదీశాడు. బెథెల్ ఔటయ్యాక.. హ్యారీ బ్రూక్(4), సామ్ కరన్(28) సాయంతో బ్యాంటన్ పోరాడి స్కాట్లాండ ఆశలపై నీళ్లు చల్లాడు. 17 బంతుల్లో 15 పరుగులు అవసరమైన దశలో విల్ జాక్స్(16 నాటౌట్) ధనాధన్ ఓడించడం గ్లండ ఓటమిని తప్పించుకుంది. అంతకుముందు ఆదిల్ రషీద్(336) స్పిన్ ధాటికి స్కాట్లాండ బ్యాటర్లు చేతులెత్తేశారు. మైఖేల్ జోన్స్(33), రిచీ బెరింగ్టన్(49)ల మెరుపులతో ఆ జట్టు152 పరుగులు చేయగలిగింది. ఇంగ్లండ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్(224), లియాం డాసన్(234)లు రెండేసీ వికెట్లతో రాణించారు.




# అదే అనిశ్చితి...

భారతీయ స్టాక్ మార్కెట్‌లో ఈ వారం నమోదైన తీవ్ర పతనం ఇన్వెస్టర్లలో ఆందోళన రేకెత్తించింది. వరుసగా లాభాల్లో ఉన్న సూచీలు ఒక్కసారిగా క్షీణించడంతో దాదాపు రూ.2.80 లక్షల కోట్ల మార్కెట్ విలువ ఆవిరైంది. దీనితో మార్కెట్ ధోరణిపై సందేహాలు పెరుగుతున్నాయి. వచ్చే వారమైనా పరిస్థితి చక్కబడుతుందా? లేదా? అనే అనుమానాలు పెరుగుతున్నాయి. శుక్రవారం ఒక్క రోజే స్టాక్ మార్కెట్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. విస్తృత స్థాయిలో జరిగిన విక్రయాలతో ఇన్వెస్టర్ల సంపద ఏకంగా రూ.7.02 లక్షల కోట్లు క్షీణించింది. ఈ భారీ పతనంలో ఐటి రంగం ప్రధానంగా దెబ్బతింది. ఇన్ఫోసిస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, విప్రో వంటి కంపెనీల షేర్లు సగటున 6 శాతం నష్టాలను చవిచూశాయి.దీనికి కారణంగా అమెరికాకు చెందిన ఏఐ స్టార్టప్ 'ఆంత్రోపిక్' విడుదల చేసిన కొత్త టూల్‌ను మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ టెక్నాలజీ లీగల్, కాంట్రాక్ట్ సంబంధిత సేవలను ఆటోమేట్ చేయగలదనే వార్తలతో భవిష్యత్తులో ఐటీ సేవల డిమాండ్ తగ్గవచ్చన్న భయం ఇన్వెస్టర్లను అమ్మకాల వైపు నెట్టింది. అమెరికా ఆర్థిక పరిస్థితుల ప్రభావం కూడా మార్కెట్‌పై పడింది. జనవరి ఉద్యోగాల నివేదిక అంచనాల కంటే మెరుగ్గా రావడంతో ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపును ఆలస్యం చేయవచ్చన్న సంకేతాలు వెలువడ్డాయి. వడ్డీ రేట్లు ఎక్కువ కాలం ఉన్నత స్థాయిలో ఉంటే గ్లోబల్ లిక్విడిటీ తగ్గుతుందనే ఆందోళనతో విదేశీ ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గు చూపారు. ఇలావుంటే, దేశీయంగా హిందుస్థాన్ యూనిలీవర్ మూడో త్రైమాసిక ఫలితాలు నిరాశపరిచాయి. నికర లాభం సుమారు 30 శాతం



తగ్గ డంతో షేరు అమ్మకాల ఒత్తిడికి గురైంది. అదనంగా, గత కొద్ది రోజుల లాభాల తర్వాత ప్రాఫిట్ బుకింగ్ కూడా పెరిగింది. మధ్యప్రాచ్యంలో ఇరాన్–అమెరికా ఉద్రిక్తతలు గ్లోబల్ అనిశ్చితిని మరింత పెంచాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి ఇప్పట్లో తగ్గే తొలిగే అవకాశాలు కనిపించడం లేదు. ఈ పరిస్థితుల్లో ఇన్వెస్టర్లు జాగ్రత్తగా వ్యవహరించాలి. పోర్ట్‌ఫోలియోను విభిన్న రంగాల్లో విస్తరించడం ఉత్తమ వ్యూహంగా నిపుణులు సూచిస్తున్నారు.

## ఈ వారం స్టాక్ మార్కెట్లు

బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్‌ఇ/ క్లోజింగ్): సెన్సెక్స్ పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 83,580.40 పాయింట్లు. నష్టం 953 .64 పాయింట్లు).

జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ/ క్లోజింగ్): నిఫ్టీ పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 25,693.70 పాయింట్లు. నష్టం 222.60 పాయింట్లు).

## బులియన్...

**బంగారం ధరలు..**

- 24 క్యారెట్ బంగారం 10 గ్రాములకు: రూ. 1,55,770
- 22 క్యారెట్ బంగారం 10 గ్రాములకు: రూ. 1,42,790
- 18 క్యారెట్ బంగారం 10 గ్రాములకు: రూ. 1,16,830

(ఇవి చెన్నై, ముంబై, ఢిల్లీ, హైదరాబాదు, బంగళూరు వంటి ప్రధాన నగరాల సగటు ధరలు).

- **వెండి ధర** 1 గ్రాము: సుమారు రూ. 279.90.
- 10 గ్రాములు: సుమారు రూ. 2,799.
- 100 గ్రాములు: సుమారు రూ. 27,990.
- 1 కిలో: సుమారు రూ. 2,79,900.

(ఇవి చెన్నై, ముంబై, ఢిల్లీ, హైదరాబాదు, బంగళూరు వంటి ప్రధాన నగరాల సగటు ధరలు).



## ఆర్థిక జాతీయవాదం..

ఆర్థిక జాతీయవాదం అనేది దేశీయ ఆర్థిక వ్యవస్థపై స్వీయ నియంత్రణకు ప్రాధాన్యం ఇచ్చే విధానాల సమాహారం. గ్లోబల్ ఫ్రీ మార్కెట్ సమర్థత కంటే జాతీయ భద్రత, సామాజిక స్థిరత్వాన్ని ముందుకు ఉంచుతుంది. ఇందులో ప్రభుత్వ జోక్యం, దిగుమతి పరిమితులు, వ్యూహాత్మక రంగాల్లో పెట్టుబడి మార్గదర్శనం వంటి చర్యలు ఉంటాయి. భారతదేశంలో ఇది వలస పాలన కాలంలో ప్రారంభమైంది. దాదా భాయి నౌరోజీ ప్రతిపాదించిన డ్రెయిన్ థియరీ బ్రిటన్ భారత సంపదను దోచుకుపోతుందనే భావనను వెలుగులోకి తెచ్చింది. 1905 స్వదేశీ ఉద్యమం ద్వారా దేశీయ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వడం ఆర్థిక స్వావలంబన దిశగా మొదటి అడుగు. స్వాతంత్ర్యం అనంతరం (1947–1991) దిగుమతి ప్రత్యామ్నాయ విధానం, లైసెన్స్ రాజ్, ప్రభుత్వ రంగ ఆధిపత్యం ద్వారా స్వీయాభివృద్ధి లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే పోటీ లేకపోవడం వల్ల వృద్ధి మందగించింది. 2014 తర్వాత



ఆత్మనిర్భర్ భారత్ ద్వారా ఆర్థిక జాతీయవాదం 2.0 రూపుదిద్దుకుంది. ఇది ప్రపంచం నుంచి వేరుపడటం కాదు; బలమైన దేశీయ ఆధారంతో ప్రపంచంతో అనుసంధానం. ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహకాలు (పిఎల్ఐ), డిజిటల్ డేటా రక్షణ చట్టం 2023, సెమీకండక్టర్ మిషన్ వంటి చర్యలు సాంకేతిక స్వావలంబనను బలోపేతం చేస్తున్నాయి.భారతదేశం భారీ బహుపాక్షిక ఒప్పందాల నుంచి దూరంగా ఉండి, విశ్వసనీయ దేశాలతో ద్వైపాక్షిక ఒప్పందాలకు ప్రాధాన్యం ఇస్తోంది. ఉదాహరణకు 2019లో ఆర్‌సిఇపిలో చేరలేదు.

'బిజినెస్' శీర్షికన ఇస్తున్న సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. పెట్టుబడులు లేదా లాభనష్టాలపై 'ప్రజాపక్షం' ఎలాంటి బాధ్యత వహించదు. నిపుణులను సంప్రదించి, మార్కెట్ తీరును సమీక్షించుకొని, వ్యక్తిగత బాధ్యతపై నిర్ణయాలు తీసుకోవాలని సూచిస్తున్నాం.

# బదిలీ వర్కర్లకు జనరల్ అసిస్టెంట్ ట్రైనీగా నియామకాలు

## యాజమాన్యం అంగీకరించిందని రాజ్ కుమార్ ప్రకటన



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణిలో పని చేస్తున్న బదిలీ వర్కర్‌లకు మార్చి 2026 నుంచి జనరల్ అసిస్టెంట్ ట్రైనీగా అపాయింట్మెంట్ ఆర్డర్‌లు ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించిందని గుర్తింపు సంఘం ఎఐటియుసి ప్రధాన కా ర్యదర్శి కొరిమి రాజ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో బదిలీ వర్కర్ నుంచి జనరల్ అసిస్టెంట్‌గా మారాలంటే గతంలో కనీసం మూడు సంవత్సరాల సమయం పట్టేదని ఆయన పేర్కొన్నారు.ఈ సమస్యను గుర్తింపు సంఘం ఏఐటియుసి యాజమాన్యం తో జరిగిన స్ట్రక్చర్ సమావేశాల్లో మాట్లాడి ఒప్పించి మార్చి 2026 నుండి బదిలి వర్కర్‌కు బదులు గా జనరల్ అసిస్టెంట్ ట్రైనీగా అపాయింట్మెంట్ ఆర్డర్ ఇచ్చే విధంగా ఒప్పించామని ఆయన తెలిపారు. ప్రస్తుతం బదిలీ వర్కర్లు గా పనిచేస్తు న్న వారిని, భవిష్యత్తులో రిక్రూట్మెంట్ అయ్యేవారికి కూడా జనరల్ అసిస్టెంట్ ట్రైనిగా ఇస్తారని ఆయన తెలిపారు. 190/240 మస్టర్లు పూర్తి కాగానే ట్రైని తీసేసి జనరల్ అసిస్టెంట్ గా మారుస్తారని ఆయన పేర్కొన్నారు. కనుక బదిలీ వర్కర్లందరు ఏఐటీయుసి కృషి ని గమనించగలరని ఆయన పేర్కొన్నారు.

# ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికలకు సిద్ధం కండి

## సిపిఐ శ్రేణులకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పిలుపు

**ప్రజాపక్షం/కరీంనగర్ :** రాబోయే ఎంపిటిసి జెడ్‌పిటిసి ఎన్నికల్లో పోటీ చేయడానికి సిపిఐ శ్రేణులు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కరీంనగర్‌లోని సిపిఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో చిగురు మా మిడి మండలానికి చెందిన ఇందుర్తి రెండు, సీతారాంపూర్, ముల్కనూర్, ముది మాణిక్యం, నవాబుపేట ఎంపిటిసి స్థానాల పరిధిలోగల గ్రామాలకు చెందిన సిపిఐ ముఖ్య నాయకుల సమావేశం అందె చిన్నస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశమునకు ముఖ్య అతిథిగా హాజరైన చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ, సిపిఐ ని ర్మాణం కలిగి ఉన్న చిగురుమామిడి మండలంలో అనేక పర్యాయాలు ఎంపిపి, జెడ్‌పిటిసి స్థానాలు ఉండడంవల్ల మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, ప్రజా సంక్షేమ పథకాలను అర్హులైన నిరుపేదలకు అందించడంలో సిపిఐ ప్రజా ప్రతినిధులు పనిచేశారని, గత పది




సంవత్సరాలుగా మండలంలో అనేక ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోబడడం లేదని, ముఖ్యంగా రైతాంగానికి సాగునీరు అందించడానికి వరద కాలువ పనులు అసంపూర్తిగా ఉన్నాయని వాటిపై సిపిఐ నాయకత్వం ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఇప్పటికీ అర్హులైన నిరుపేదలకు ఇండ్లు లేక,పెన్షన్లు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజా సమస్యల పరిష్కారం కావాలంటే అది కేవలం కమ్యూనిస్టులతోనే సాధ్యమవుతుందని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ నాయకులు కార్యకర్తలు నిరంతరం ప్రజల మధ్య ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం పనిచేయాల్సిన అవసరం ఉందని, ప్రజల కోసం పోరాడినప్పుడే ప్రజలు గుర్తిస్తారని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆశీర్వదిస్తారని ఆ దిశగా సిపిఐ శ్రేణులు ఎంపిటిసి జెడ్‌పిటిసి ఎన్నికల్లో పోటీ చేసి గెలవడానికి ఇప్పటినుండే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వెంకటరెడ్డి పిలుపునిచ్చారు.

సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మా ట్లాడుతూ, జిల్లాలో సిపిఐకి మంచి పట్టు ఉన్న మండలం చిగురుమామిడి అని అలాంటి మండలంలో ఎంపిటిసి, జెడ్‌పిటిసి స్థానాలకు కైవసం చేసుకుని తిరిగి పూర్వవైభవాన్ని తీసుకరావాలని అందుకోసం పార్టీ శ్రేణులంతా కలిసికట్టుగా పని చేయాలని శ్రీనివాస్ సూచించారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మాజీ జెడ్‌పిటిసి అందే స్వామి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కాంతాల శ్రీనివాస్ రెడ్డి, అందె చిన్నస్వామి, బూడిద సదాశివ, మాజీ సర్పంచ్ గోలీ బాపు రెడ్డి, ముల్కనూర్ ఉప సర్పంచ్ పైడిపల్లి వెంకటేష్, వార్డు సభ్యులు అందె తిరుపతి, శాఖ కార్యదర్శులు ఎం.డి.ఉస్మాన్ పాషా, మంద ఎల్లయ్య, బోట్ల పోచయ్య, కాదసు మోహన్, కాత మల్లయ్య, చెప్యాల శ్రీనివాస్ తో పాటు సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

# కోడ్‌లు రద్దుచేసే వరకు ఉద్యమాలు తప్పవు

**ప్రజాపక్షం/ వరంగల్:** నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేసి, 29 కార్మిక చట్టాలను కొనసాగించేంత వరకు ఉద్యమాలు ఉధృతం చేస్తామని తూర్పు మాజీ శాసనసభ్యులు నన్నపనేని నరేందర్ సిఐటియు జిల్లా ఆరూర్ కుమార్ ఎఐటియుసియు వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర రామస్వామి ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్ ఎఐసిసిటియు అక్కనపల్లి యాదగిరి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పనస ప్రసాద్ సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ రంగయ్య ఎం సిపిఐయు నగర కార్యదర్శి మాలోత్ సాగర్ సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నగర కార్యదర్శి రాచర్ల బాలరాజ్‌లు డిమాండ్ చేశారు. వరంగల్ శివనగర్‌లోని సిపిఐ కార్యాలయంలో ఆల్ ట్రేడ్ యూనియన్స్ వామపక్ష పార్టీలు, బిఆర్‌టియు ఆధ్వర్యంలో ఏఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పోరాటం ఇంతటితో ఆగిపోదని బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేసి 29 కార్మిక చట్టాలను కొనసాగించేంత వరకు వరంగల్ జిల్లాలో ఉమ్మడిగా కలిసి పోరాటం ఉధృతం చేస్తామన్నారు.భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన 78 సంవత్సరాల తర్వాత కూడా రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు నేడు ముప్పు వాటిల్లిందని, కార్పొరేట్ల ప్రయోజనాల కోసం నాలుగు లేబర్ కోడులను అమలుకు తెస్తున్నారన్నారు. 12 గంటల పనిని చట్టబద్ధం చేస్తున్నారని, సామాజిక భద్రత పథకాలకు నిధులు తగ్గిస్తున్నది కార్మిక సంఘాల రిజిస్ట్రేషన్ ను కట్టినంతరం చేసి కార్మిక సంఘాలను రద్దు చేసేందుకు బిజెపి ప్రభుత్వం బరితెగించింది రాజ్యాంగం కల్పించిన హక్కులన్నిటిని తుంగలోకి తొక్కి కార్మికులుగా గుర్తించకుం డా వెట్టి చాకిరి చేసే విధంగా ప్రయత్నం సాగితుందన్నారు. నాలుగు లేబర్ కోడులను తిప్పి కొట్టి కార్మిక చట్టాలను కాపాడుకోవడం కార్మిక వర్గాని కి చాలా అవసరం ఉందన్నారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేస్తూ కొత్త చట్టాన్ని తీసుకొస్తూ ఉపా ధి హామీ పథకాన్ని నీరుగార్చే విధంగా ముమ్మర ప్రయత్నాలు కొనసాగిస్తూ, గ్రామీణ పేదల కడు పు కొట్టే విధంగా చట్టాలు ముందుకు తీసుకొస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ కార్మిక వర్గంలో పెద్ద ఎత్తున ప్రచారాన్ని కొనసాగించాలన్నారు. ఫిబ్రవరి 12న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేసినందుకు వరంగల్ జిల్లా కార్మిక వర్గానికి రైతాంగానికి ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కా ర్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు చెన్నకేశవులు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎండి బషీర్, ఏసిటియు జిల్లా అధ్యక్షులు సుంచు జగదీశ్వర్, బిఆర్‌టియు జిల్లా నాయకులు దుబ్బ శ్రీనివాస్, ఎఐటియుసి జిల్లా సహకార దర్శి సంఘీ ఏలేందర్, యాకూబ్ , బిఆర్‌టియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఇండ్ల జాగా వచ్చేవరకు ఇంచు కూడా కదలం



## సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** పేదల జాగా కోసం పోరుకు సిద్ధం కావాలని, ఇండ్ల జాగా వచ్చేవరకు ఇంచు కూడా కదలకుండా ఉద్యమించాలని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమకుల జంగయ్య పిలుపునిచ్చారు. శనివారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పట్టణం లోని 75వ సర్వే నంబర్ లో గల భూ పోరాట కేంద్రంలో ఈరోజు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జికి కె.రామస్వామి అధ్యక్షతన జరిగిన మూడు సంవత్సరాల వార్షికోత్సవ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ వార్షికోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ భూమి భుక్తి విముక్తి కోసం నాడు తెలంగాణ సాయుధ రైతన్న పోరాటం చేసిన చరిత్ర కలిగిన కమ్యూనిస్టు పార్టీ నేడు పేదల కోసం బడుగు జీవుల కోసం జానెడు జాగ కోసం ఎర్రజెండా పార్టీ పేదల తరపున పోరాడుతున్నదని జంగయ్య తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కమ్యూనిస్టు పార్టీలను ఎర్రజెండాను గొప్పగా కీర్తించడం సంతోషం కానీ అదే పార్టీలు పేదల తరపున పోరాడుతుంటే పోలీసు కేసులు పెట్టించడం లేదా భూ పోరాటాలు నిర్వహిస్తున్న మహిళలపై దౌర్జన్యాలు చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు.చేవెళ్ల పట్టణంలో సిపిఐ ఆధ్వర్యంలో మూడు సంవత్సరాలుగా పేదలు జానెడు జాగా కోసం ప్రభుత్వం భూమి సర్వే నెంబర్ 75 లో గుడిసెలు వేసుకొని అక్కడే జీవిస్తున్నారు అక్కడ కరెంటు సౌకర్యం లేకపోయినా మంచినీళ్ల సౌకర్యం లేకపోయినా అవస్థలు పడుతూ పేదలు పోరాడుతుంటే ప్రభుత్వ అధికారులు కానీ స్థానిక ఎమ్మెల్యే గాని వారిని పట్టించుకోకపోవడం బాధాకరమని ఆయన విమర్శించారు.అంతకు ముందు సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి రాష్ట్ర నాయకులు పుస్తకాల నర్సింగ్ రావు వార్షికోత్సవ సందర్భంగా పార్టీ పతక ఆవిష్కరణ చేశారు.

ఈ సభలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు,జిల్లా కార్యవర్గ సభ్యు డు ఎం ప్రభు లింగం,జిల్లా కార్యవర్గ సభ్యులు వడ్ల సత్యనారాయణ,మండల కార్యదర్శి ఎం సత్తిరెడ్డి,జిల్లా సమితి సభ్యులు మంజుల,అంజయ్య,సుధాకర్ గౌడ్,స్వామి,కార్యకర్తలు బాబురావు,యాదగిరి,నర్సింలు, శ్రీను,రవి,లలిత,పెంటయ్య,వెంకటమ్మ,యాదయ్య,తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతయ్య మరణం కార్మిక వర్గానికి తీరని లోటు

## రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వివిఎస్ బోస్

**ప్రజాపక్షం/కాప్రా :** కామ్రేడ్ తిరుపతయ్య మరణం కార్మిక వర్గానికి తీరని లోటని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వివిఎస్ బోస్ అన్నారు.సిపిఐ సీనియర్ నాయకులు,ఏఐటియూసి అనుబంధ ఇసీఐఎల్ కంపెనీ మాజీ ఉద్యోగి కామ్రేడ్ తిరుపతయ్య అకాల మరణం పట్ల సిపిఐ ఆధ్వర్యంలో ఇసీఐఎల్ సిపిఐ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో ఆయన ఆంధ్రప్రదేశ్‌లోని కనిగిరి తన ఇంటిలో మరణించారని,అన్ని పోరాటాలలో తనతో పాటు తిరుపతయ్య క్రియాశీలంగా పాల్గొని అన్న అనే పిలుపుతో నిత్యం పార్టీ ఎదుగుదలకు గణనీయంగా కృషి చేసారని అన్నారు.ఇసీఐఎల్ కంపెనీలో కార్మికుల సమస్యల పరిష్కారంలో నిరంతరం పనిచేసినటువంటి వ్యక్తిగా గుర్తుండిపోయారని,పార్టీలో 35 సంవత్సరాలుగా సిపిఐ సభ్యుడిగా అనేక ఆటుపోటులను ఎదుర్కొంటూ తన కొన ఊపిరి వరకు కొనసాగారని అన్నారు.అలాంటి వ్యక్తి అకాల మరణంతో మన మధ్యన లేకపోవడం పార్టీకి తీరని నష్టమని జిల్లా,మండల పార్టీ తీవ్ర సంతాపాన్ని తెలియజేస్తున్నామని వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జి దామోదర్‌రెడ్డి,సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు శంకర్‌రావు,జిల్లా సమితి సభ్యులు నారా నర్సింహ,మిరియాల సాయిలు,నర్సింహరావు, మోహన్,రాఘవేంద్రరావు,చలం,సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.





## బాధ్యతాయుత వ్యక్తిని తీర్చిదిద్దడంలో 'విద్య' కీలకపాత్ర

### ఆక్స్‌ఫర్డ్ 'కిల్కారీ' వేడుకలో మంత్రి వివేక్ వెంకటస్వామి

**ప్రజాపక్షం/సోమాజిగూడ :** విద్య, ఒక నాగరిక, బాధ్యతాయుత వ్యక్తిని తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషిస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డా. వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం హైదరాబాద్ లలితా కళా తోరణంలో ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ హైస్కూల్ తన ఫౌండేషనల్ స్టేజ్ వార్షికోత్సవాన్ని "కిల్కారీ" అనే రంగుల థీమ్‌తో ఘనంగా నిర్వహించింది. ఈ థీమ్ బాల్యంలోని నవ్వులు, అమాయకత్వ, ఆనందాన్ని ప్రతిబింబించింది. దీనికి మంత్రి వివేక్ వెంకటస్వామి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్య నాయకత్వ గుణాలను పెంపొందించి, పిల్లలను సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనేలా తయారుచేస్తుందని తెలిపారు. ఆక్స్‌ఫర్డ్ స్కూల్ 45 ఏళ్లపాటు విద్యాసేవలను అందించడం ప్రశంసనీయమన్నారు. పిల్లల్లో క్రమశిక్షణ పెంపునకు తల్లిదండ్రుల పాత్ర ఎంతో ముఖ్యమని, తమ పిల్లల విద్యాప్రయాణంలో వారు చురుకుగా పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో గౌరవ అతిథులు ఎవిఎస్ శిరీష, కౌసర్ సయీద్, స్కూల్ డైరెక్టర్ ప్రార్థనా మణికొండ, డీన్ రమాంజుల, ప్రిన్సిపాల్స్ రేఖారావు, ఫాతిమా కాజిమ్, తదితర సిబ్బంది పాల్గొన్నారు.




## సెల్‌ఫోన్ల రికవరీ

**ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట:** మొబైల్ ఫోన్‌లు పోగొట్టుకున్న వారు తక్షణమే సిఇఐఆర్ పోర్టర్‌లో ఫిర్యాదు చేస్తే సంబంధిత పోలీస్‌స్టేషన్ సిబ్బంది రికవరీ చేసి అప్పగిస్తారని చత్రినాకా ఎసిపి సిహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు శనివారం చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎసిపి సిహెచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ వివిధ ప్రాంతాల్లో 32 మంది పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేసి తిరిగి వారికి అప్పగించడం జరిగిందన్నారు. దొంగతనం, పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల రికవరీ కోసం ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు.



## సమాజానికి కులాంతర వివాహాలే ఆదర్శం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సమాజానికి కులాంతర వివాహాలే ఆదర్శమని పలువురు వక్తలు అన్నారు. ప్రపంచ ప్రేమికుల దినోత్సవం సందర్భంగా శనివారం బాగ్ లింగంపల్లి సుందర విజ్ఞాన కేంద్రం కాట్రగడ్డ శ్రీనివాస రావు ఆడిటోరియంలో అభ్యుదయ వాదులు, విప్లవ ఆధ్వర్యంలో కులాంతర ముఖాంతర వివాహాలు చేసుకున్న వంశీ, స్వాతి, రాజు, లావణ్య, తదితర దంపతులను ఘనంగా సన్మానించి, ఆర్థిక సహాయంతో పాటు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అథితిగా హాజరైన రమణ మూర్తి మాట్లాడుతూ జై భారత్ మూవ్ మెంట్ ,విజయ విహారం తరుపున సుమారు 600 వివాహాలు చేశామని, విప్లవ్ సేవను కొనియాడారు. సోషల్ కార్యకర్త, వ్యాపార వేత్త సూర్య ప్రభ ఆర్థిక సహాయం చేస్తూ, దంపతులను దీవించారు. అవధానం రఘు కుమార్, కుల నిర్మూలన సంఘం కిషన్ చాంద్ మాట్లాడుతూ ప్రేమికుల పట్ల, కుల, మతాంతర వివాహాల పట్ల వ్యతిరేకత కొనసాగుతోందని, జయభారత్ సంస్థ మాత్రమే కుల మత ఇతర సమాజ వ్యతిరేక పరిస్థితులపై పోరాడుతుందన్నారు. ఈ సందర్భంగా ఆర్‌వి రామారావు రచించిన ఇందుమతి కేల్కర్ పుస్తకం ను రమణ మూర్తి, తదితర అధితులు ఆవిష్కరించారు.

## ట్రాన్స్‌ఫార్మర్ తొలగింపు

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ప్రజలకు ఇబ్బందికరంగా ఉండే రైల్వే వంతెన పక్కనున్న ట్రాన్స్ఫార్మర్‌ని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావ నిజంగయ్య యాదవ్ విద్యుత్ అధికారుల చేత తొలగించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి జంగయ్య యాదవ్ మాట్లాడు తూ



ఎన్నో సంవత్సరాల నుండి రైల్వే వంతెన సమీపంలో వాహదారులకు ఇబ్బందికరంగా ఉన్న ట్రాన్స్ఫార్మర్‌ని ఏఈ,ఏడి అధికారులతో చర్చించి అక్కడ నుండి తొలగింప చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమానికి ఏఈ యెశ్వంత్,కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షులు ఫరూక్,యూత్ ఉపాధ్యక్షులు రఫిక్,సల్మాన్ రాజ్,సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## దహన సంస్కారాలకు ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** మల్కాజ్‌గిరి కార్పొరేషన్ పరిధిలోని 5వ డివిజన్ నాగారంలో ప్రతి నిత్యం ఇడ్లీలు అమ్ముకుని జీవనం కొనసాగిస్తున్న నాగారం లో నివాసముండే కమలమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె ఇంటికి మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి వెళ్లి పరామర్శించి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. ఆమె దహన సంస్కారాలకు కౌకుట్ల చంద్రారెడ్డి, బండారి మల్లేష్‌యాదవ్, అనంత్‌రెడ్డిలు కలసి 25 వేల రూపాయల ఆర్థిక సహాయం అంద చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# బిసిలకు 70 చైర్మన్ పదవులివ్వాలి

### లేనిపక్షంలో 'పరిషత్తు' ఎన్నికల్లో బుద్ధి చెబుతాం

### బిసి పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాల్‌రాజ్‌గౌడ్



**ప్రజాపక్షం/సోమాజిగూడ :** రాష్ట్రంలోని 116 మున్సిపల్ చైర్మన్ల స్థానాలలో బిసిలకు 70 కేటాయించాలని, ఏడు కార్పొరేషన్లలో నాలుగు మేయర్ పదవులు ఇవ్వాలని బిసి పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాల్‌రాజ్ గౌడ్ వివిధ రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఫ్రంట్ కన్వీనర్ అంబాల నారాయణ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాలరాజ్‌గౌడ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి, మాట్లాడారు.

మన్సిపల్ ఎన్నికల్లో బిసిలకు రిజర్వేషన్ల ప్రకారం 31శాతం స్థానాలు రావాల్సి వుండగా, కాంగ్రెస్ పార్టీ 53 శాతం, బిఆర్‌ఎస్ 53 శాతం, బిజెపి 49 శాతం టికెట్‌లివ్వడం బాగుందన్నారు. కానీ, చైర్మన్ల, మేయర్ పదవులివ్వడంలో కూడా అదే ప్రాధాన్యం బిసిలకు కల్పించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ 80 స్థానాలు మున్సిపల్ చైర్మన్లు కైవసం చేసుకొంటున్న నేపథ్యంలో 60 మున్సిపల్ చైర్మన్ పదవులు బిసిలకివ్వాలని కోరారు. బిఆర్‌ఎస్ 13 మున్సిపల్ చైర్మన్లలో 10 పదవులివ్వాలని, లేనిపక్షంలో బిఆర్‌ఎస్ వ్యతిరేక పార్టీగా పరిగణించాల్సి వస్తుందన్నారు.

కాంగ్రెస్ పార్టీకి ఐదు మేయర్ స్థానాల్లో మూడు బిసిలకు మేయర్ పదవులివ్వాలని, బిజెపి కరీంనగర్ మేయర్ స్థానాన్ని బిసిలకిచ్చి బిసి పక్షపాతిగా ఆ పార్టీని నిరూపించుకోవాలని సవాల్ చేశారు. సిఎం రేవంత్‌రెడ్డికి బిసిలపై ఉన్న చిత్తశుద్ధికి ఇదే సరైన సమయమన్నారు. బిసిలను విస్మరిస్తే వచ్చే ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికల్లో ఆయా పార్టీలకు తగిన బుద్ధిచెప్తామని హెచ్చరించారు. సమావేశంలో ఫ్రంట్ వైస్ చైర్మన్ ఎస్.దుర్గయ్యగౌడ్, కన్వీనర్‌లు బైరు శేఖర్‌గౌడ్, అయిలి వెంకన్నగౌడ్, యెలికట్టె విజయ్ కుమార్‌గౌడ్, ఉపాధ్యక్షులు నాగభూషణం, హైదరాబాద్ అధ్యక్షులు దామోదర్, శ్రీకాంత్ గౌడ్, శ్రీను, నరేశ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌ఎంటి నగర్ పెద్ద చెరువు సుందరీకరణ



**ప్రజాపక్షం/ఉప్పల్:** నాచారంలోని హెచ్‌ఎంటి నగర్ పెద్ద చెరువు సుందరీకరణ పనుల కోసం రూ.30 కోట్ల నిధులు మంజూరు చేయించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కి నాచారం డివిజన్ పుర ప్రముఖులు,హెచ్‌ఎంటి నగర్ వెల్ఫేర్ సంఘ సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు,కార్యకర్తలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ చెరువు అభివృద్ధి పనులను వేగవంతంగా ప్రారంభించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. త్వరలోనే చెరువులో ఉన్న నీటిని పూర్తిగా బయటకు పంపించి సుందరీకరణ పనులను ప్రారంభిస్తామని పేర్కొన్నారు. నాచారం ప్రాంతంలో దోమల సమస్యను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. అలాగే పటేల్ కుంట చెరువును కూడా ఖాళీ చేసి కూడికతీత పనులను త్వరలోనే ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, భూపాల్ రెడ్డి, ఎర్రం శ్రీనివాస్ రెడ్డి, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# పురపీఠంపై పట్లోళ నీరజబాల్‌రెడ్డి...!

* చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు హ్యాట్రిక్ కౌన్సిలర్‌కే
* నిర్ణయానికి వచ్చిన అధిష్టానం, ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/తాండూరు:** హ్యాట్రిక్ కౌన్సిలర్‌గా విజయం సాధించిన పట్లోళ నీరజ బాల్‌రెడ్డికి తాండూరు పురపీఠం వరించనుంది...? పట్టణ ప్రజలు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్న తాండూరు మున్సిపల్ చైర్మన్ ఎవరు అనేది దాదాపు ఖరారయ్యింది. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను హ్యాట్రిక్ కౌన్సిలర్‌లుగా గెలుపొందిన కౌన్సిలర్‌లకు పదవులను కట్టబెట్టేందుకు అధిష్టానం నిర్ణయానికి వచ్చినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. తాండూరు మున్సిపల్ ఎన్నకల్లో కాంగ్రెస్ పార్టీ చైర్మన్ అభ్యర్థిని ప్రకటించకుండానే 36వార్డులలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు బరిలో దించిన విషయం తెలిసిందే. హోరాహోరీగా సాగిన ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 19 కౌన్సిలర్ స్థానాలను కైవసం చేసుకుని పురపీఠానికి కావాల్సిన మ్యాజిక్ ఫిగర్‌ను కైవసం చేసుకుంది. అయితే ఎన్నికల ముందు నుంచే పార్టీ చైర్మన్ అభ్యర్థిని ప్రకటించకుండా సస్పెన్స్‌ను కొనసాగించడంతో పాటు అధిష్టానమే తేలుస్తుందని చెప్పుకొచ్చారు. కాగా ఎన్నికల సమయంలో సాయిపూర్‌కు చెందిన పట్లోళ నీరజబాల్‌రెడ్డి, బండు వేణు పేర్లతో పాటు 27వ వార్డు అభ్యర్థి ఉప్పరి స్వరూప పేరు కూడా బలంగా వినిపించిన విషయం తెలిసిందే. మున్సపల్ ఎన్నికల కౌటింగ్ పూర్తి అయిన వెంటనే గెలుపొందిన అభ్యర్థులను క్యాంపుకు తరలించారు. ఈ నెల 16న చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ చైర్మన్ అభ్యర్థి ఎవ్వరనే దానిపై తాండూరులో జోరుగా చర్చలు జరుగుతున్నాయి.

తాండూరు మున్సిపల్ ఎన్నికల్లో హ్యాట్రిక్ కౌన్సిలర్‌గా విజయం సాధించి రికార్డు కొట్టిన పట్లోళ నీరజ బాల్‌రెడ్డినే మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా ఎంపిక చేసినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తుంది. కాగా వైస్ చైర్మన్ పదవి కూడా హ్యాట్రిక్ కౌన్సిలర్‌గా రికార్డు సాధించిన మైనార్టీ వర్గానికి చెందిన రజాక్‌కు అప్పగించేందుకు అధిష్టానం నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ఉన్న కౌన్సిలర్‌లలో నీరజ బాల్‌రెడ్డికి సీనియర్ కావడంతో పురపాలనపై మంచి పట్టుఉంది. ఇంతకు ముందే రెండు పర్యాయాలు కౌన్సిలర్‌గా పనిచేసిన అనుభవం ఉండడంతో అధిష్టానం తాండూరు పుర పీఠాన్ని నీరజ బాల్‌రెడ్డికి కట్టబెట్టేందుకు సిద్ధమైనట్లు తెలుస్తుంది. మొదటిసారిగా 2014 ఎన్నిక ల్లో పట్లోళ నీరజ బాల్‌రెడ్డి కౌన్సిలర్‌గా పోటీచేసి గెలుపొందారు. తిరిగి 2019లో జరిగిన మున్సిపల్ ఎన్నిల్లో 11వ వార్డు నుంటి పోటీ చేసిన పట్లోళ నీరజ బాల్‌రెడ్డి రెండవసారి విజయం సాధించారు. తాజాగా జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 12వ వార్డు నుండి పోటీ చేసిన పట్లోళ నీరజ బాల్‌రెడ్డి ముచ్చటగా మూడోసారి భారీ మెజార్టీతో విజయం సాధించి హ్యాట్రిక్ సాధించారు. తాండూరు మున్సిపల్ చైర్మన్ పదవి బిసి జనరల్‌కు రిజర్వు కావడంతో మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బిసి సమాజిక వర్గానికి చెందిన పట్లోళ నీరజ బాల్‌రెడ్డికే కట్టబెట్టేందుకు పార్టీ అధిష్టానం దాదాపుఖరారయినట్లు తెలుస్తుంది?

# ప్రజల ఆరోగ్యానికి సిఎంఆర్‌ఎఫ్ భరోసా


### ఎమ్మెల్యే వివేకానంద



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** ప్రజల ఆరోగ్యానికి సిఎం సహాయ నిధి భరోసా ఇస్తుందని ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. శనివారం బాచుపల్లి, రాజీవ్‌గాంధీ నగర్‌కు చెందిన బి.ఆనంద్‌కు చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన రూ.3.25లక్షల ఆర్థిక సహాయాన్ని నిజాంపేట్ లోని బిఆర్‌ఎస్ కార్యాలయంలో బిఆర్‌ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన చికిత్సకోసం ఎదురు చూసేవారు ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, పార్టీ అధ్యక్షుడు రంగ రాయ ప్రసాద్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు సతీష్, మాజీ కార్పొరేటర్లు రాఘవేంద్ర రావు, సుజాత, శెనిగల ప్రమీల యాదవ్, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**శ్రీ సాయి ఎంటర్‌ప్రైజెస్ బిస్కెట్ డిస్ట్రిబ్యూషన్ గోడౌన్ ప్రారంభం**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 126 జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని సంజయ్‌పూరి కాలనీ లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ సాయి ఎంటర్‌ప్రైజెస్ బిస్కెట్ డిస్ట్రిబ్యూషన్ గోడౌన్‌ను శనివారం బిఆర్‌ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి, యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికం గా వ్యాపార సంస్థలు స్థాపించడం వల్ల యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నా రు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కె. జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్రా అశోక్, వెంకటేశ్వరస్వామి ఆలయ మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియన్ నాయకులు మల్లేష్ గౌడ్, పాపిరెడ్డి, బాబుగౌడ్, ప్రవీణ్ గుప్తా, గోడౌన్ యాజమాన్యం రుద్ర, దత్త, సూర్య, విక్కిరెడ్డి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.





**శ్రీ సాయి విద్యానికేతన్ స్కూల్‌లో సైన్స్ ఫెయిర్**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 126 జగద్గిరి గుట్ట పరిధి మగ్ధూమ్‌నగర్‌లోని శ్రీ సాయి విద్య నికేతన్ స్కూల్‌లో శనివారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిఆర్ ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద ముఖ్య అతిథిగా హాజరై సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించి, విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలించి, వారి ప్రతిభను అభినందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్టులు, సాంకేతిక ఆవిష్కరణలు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయన్నారు. విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే సైన్స్‌పై ఆసక్తి పెంపొందించుకోవడం ఎంతో అవసరమని అన్నారు. ఇలాంటి సైన్స్ ఫెయిర్‌లు విద్యార్థులలో సృజనాత్మకతను, పరిశోధన దృక్పథాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులను అభినంది స్తూ, భవిష్యత్తు లో కూడా విద్యార్థులకు ఉత్తమ విద్య అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియన్ నాయకులు బాబు గౌడ్, ముంతాజ్ అలీ, అజమ్, బ్రహ్మానందచారి, పాఠశాల ప్రిన్సిపల్ ఆంజనేయులు, గడ్డమీది బాలరాజు, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.




## నాగోల్ మెట్రోరైలు స్టేషన్ సౌకర్యాలు, భద్రతా చర్యలు, సేవల పరిశీలన

**ప్రజాపక్షం/ఉప్పల్ :** శీతాకాల అధ్యయన పర్యటనలో భాగంగా ట్రైనీ ఐఏఎస్ అధికారులు నాగోల్ మెట్రోరైలు స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రో రైల్ నిర్వహణ విధానం, ప్రయాణికులకు అందిస్తున్న సౌకర్యాలు, భద్రతా చర్యలను పరిశీలించారు. ట్రాఫిక్ రద్దీ తగ్గింపులో మెట్రో సేవల పాత్రపై అధికారులు అవగాహన పొందారు. మెట్రో అధికారుల ప్రజెంటేషన్ అనంతరం పరస్పర చర్చలు జరిగాయి. కార్యక్రమంలో ఉప్పల్ మండల తహసీల్దార్ పూల్ సింగ్ చౌహాన్, తదితరులు పాల్గొన్నారు.




## సైబర్ నేరాల పట్ల అవగాహన

**ప్రజాపక్షం/చార్మినార్:** సమాజంలో జరుగుతున్న వివిధ రకాల సైబర్ నేరాలు.. నివారణ చర్యలపై పౌరులకు అవగాహన కల్పించడం కోసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు పాతబస్తీలోని రెడ్డి జన సంఘం, రాజన్న బావి ఫంక్షన్ హాల్‌లో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న చార్మినార్ జోన్ డిసిపి కిరణ్ ఖరే ప్రభాకర్ మాట్లాడుతూ నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్, 1930కి డయల్ చేయడం ద్వారా సైబర్ మోసాలను వెంటనే నిరోధించేలా, బాధితులకు మార్గనిర్దేశం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో చత్రినాక ఎసిపి సిహెచ్ చంద్రశేఖర్, సిఐ నాగేంద్రప్రసాద్‌వర్మ, ఎస్‌ఐలు త్రిమూర్తులు రాయుడు, స్వప్న, ప్రేంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బొలెరో వాహనంతో గాయపర్చిన వ్యక్తులకు రిమాండ్




**ప్రజాపక్షం/చర్లపల్లి:** ఓ వ్యక్తిని బోలెరో వాహనంతో ఢీకొట్టి గాయపర్చిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం రాంపల్లికి చెంది న సతీష్(45)తన సహ ఉద్యోగి విజయకుమార్‌తో కలసి విండ్సన్ కారు(టిజి 09జి 6069)లో మల్లాపూర్ నుండి రాంపల్లికి వెళ్తుండగా వెనకాల నుండి వచ్చిన బోలెరో వాహనం(టిఎస్ 09 ఎఫ్‌పి 0094) నిర్లక్ష్యం గా, అతి వేగంగా నడుపుతూ కారును ఢీకొట్టి పారిపోతుండగా బోలెరో వాహనాన్ని వెంబడించి హెచ్‌బి కాలనీ ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద బోలెరో వాహనం ముందుకు వచ్చి ఆపేందుకు ప్రయత్నించగా సతీష్‌ను ఢీ కొట్టి పారిపోయాడు. సతీష్‌కు వెనక భాగంలో తీవ్రగాయాలు కాగా శ్రీకర రాఘవేంద్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో బాలాజీనగర్ సంతోష్‌నగర్‌కు చెందిన ఏ1 ఉప్పరి మహేష్(23), ఏ2 అనగందుల తరుణ్(22)పై కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.



## 'యువ ఫర్ తెలంగాణ ఫౌండేషన్' ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి:** పాక్ ఉగ్రమూకల దాడిలో 40మంది సిఆర్పీఎఫ్ జవాన్లు నేలకొరిగి, అమరులైన బ్లాక్‌డే రోజు, దేశంకోసం ప్రాణత్యాగం చేసిన ఆ వీరులను స్మరించుకుంటూ శనివారం 'యువ ఫర్ తెలంగాణ ఫౌండేషన్' ఆధ్వర్యంలో వివేకానందనగర్ డివిజన్, ఎ.ఎస్.రాజు నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పిఎసి చైర్మన్ అరెకూడి గాంధీ ముఖ్య అతిథిగా విచ్చేసి తాజా మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాక్ ఉగ్రమూకల దాడిలో 40మంది సిఆర్పీఎఫ్ జవాన్లు నేలకొరిగి, అమరులైన బ్లాక్ డే రోజు అని, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా స్వచ్ఛందగా రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన దాతలను ఆయన అభినందించారు. యువ ఫర్ తెలంగాణ ఫౌండేషన్ స్టేట్ కన్వీనర్ గవ్వల భారత్ కుమార్, హైదరాబాద్ కన్వీనర్ రుద్ర అభిరామ్‌గౌడ్, కో కన్వీనర్ శివగౌడ్ ఆధ్వర్యంలో ఈ రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్, సంజీవరెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, గోపాల్, శివరాజ్‌గౌడ్, గుడ్ల శ్రీనివాస్, పోశెట్టిగౌడ్, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.



## పరంధామయ్యచారికి నివాళి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** డాక్టర్ ఏఎస్ రావు నగర్ పరిధిలోని జమ్మిగడ్డ భరత్ నగర్ కాలనీకి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కనకమోజు పరంధామయ్యచారి అనారోగ్యంతో శనివారం కన్నుమూశారు. మృతి విషయం తెలుసుకున్న ఎఎస్‌రావు నగర్ మాజీ కార్పొరేటర్ పావనీరెడ్డి, టిడిపి నాయకులు ఆయన నివాసంలో భౌతికకాయంపై పూలమాలలుచేసి నివాళులర్పించారు. ఇందులో నాయకులు కేశెట్టి ప్రసాద్, కొత్త అంజిరెడ్డి, శేరి మణెమ్మ, లక్ష్మి నారాయణ, పాకాల రాజన్న, సందీప్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్దే నా బాధ్యత



**ప్రజాపక్షం/కేశంపేట:** గ్రామాభివృద్ధియే నా బాధ్యత.. అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు సర్పంచ్ శశిరేఖ యాదయ్య తెలిపారు. శనివారం మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో పంచాయతీ నిధులతో నూతనంగా వేసిన బోరుమోటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శశిరేఖ యాదయ్య మాట్లాడుతూ తనపై నమ్మకం పెట్టి గెలిపించిన గ్రామ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తానన్నారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. గ్రామంలో మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరుచడంతో పాటు ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించనున్నట్లు తెలిపారు. విధి దీపాలను ఏర్పాటు చేయడమే కాకుండా సిసిరోడ్లు వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, విద్య, ఉపాధికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. అర్హులైన ప్రజలందరికి ప్రభుత్వ పథకాలను అంధించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గ్రామంలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు గుండె రాణి, మాజీ ఉప సర్పంచ్ సుందరయ్య, వార్డు సభ్యుడు శివానంద్, కుమ్మరి శేఖర్, వర్కల బిక్షపతి, యాదయ్య, కొర్ర రవి, సత్యం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న పేదలకు అండగా ఉంటాం



**ప్రజాపక్షం/యాచారం :** అపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు తాను ఎప్పుడు అండగా ఉంటానని బిఆర్ఎస్ మండల నాయకులు, చౌదర్ పల్లి కాంటేస్టేడ్ సర్పంచ్ జుట్టు ఉర్మిళ శ్రీశైలం న్నారు. శనివారం చౌదర్ పల్లి గ్రామానికి చెందిన కొమ్ము సాయికుమార్ అనారోగ్య కారణంతో మృతి చెందాడు ఈ విషయం తెలుసుకున్న జుట్టు శ్రీశైలం తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అతని ఇంటికి వెళ్ళి మృత దేహంపై పూలమాలలు వేసి కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి తెలిపారు. నాయకులతో కలిసి రూ.10వేల అర్ధిక సహయం అందజేశారు. కాగా గ్రామానికి చెందిన సండూరి మహేందర్ రోడ్డు ప్రమాదంలో గ్రాయ పడి ఆసుపత్రిలో చికిత్స పోందుతున్నాడు ఈ విషయం తెలుసుకోని అసుపత్రికి వెళ్ళి పరామర్శించి రూ.10 వేల రూపాయల అర్థిక సహయం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ ఓడినా గేలిచినా ప్రజా క్షేత్రంలో ఉంటు ఆపద వచ్చిన ప్రతి పేదకు, కార్యకర్తలకు కొండంత భరోసా నిస్తానన్నారు. తనకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెఎస్ఎం టీం సభ్యులు తదితరులు పాల్గోన్నారు.

## జ్యోతి ఎడ్యుకేటేడ్ యూత్‌కు కుర్చీలు అందజేత..



**ప్రజాపక్షం/యాచారం :** యాచారం మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో జ్యోతి ఎడ్యుకేటేడ్ యువజన సంఘానికి 20 కుర్చిలు అంద జేసినట్లు గ్రామ 8 వ వార్డు సభ్యులు కొండాపురం శ్రీశైలం తెలిపారు. ఈ సందర్భంగా శనివారం అయన మాట్లాడుతూ వార్డు సమస్యలను పరిష్కరించడానికి తమ వంతుగా సహయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. జ్యోతి ఎడ్యుకేటేడ్ యువ జన సంఘం సభ్యులు తనకు ఈ అవకాశం కల్పించి నందుకు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు.అనంతరం యూత్ అధ్యక్షులు నూకం కృష్ణ (అంబ్రోస్) మాట్లాడుతూ యువ సంఘానికి క్రీడా సామగ్రీ ఇప్పించడానికి దాతలు ముందుకు రావాలని కొరారు.ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గోన్నారు.

## హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** హోఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 171 వారాలుగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించం ఏంతో సంతోషించదగ్గ విషయమని ఆ భగవంతుని అశీస్సులతో అన్నదాన కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని హోప్ ఫౌండేషన్ చైర్మేన్ కొండ విజయ్ విజయ్ కుమార్ తెలిపారు. శనివారం హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ కుమార్ ప్రజలకు అన్నదాన వితరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొండా విజయ్ కుమార్ సమాజంలో తన వంతుగా కొంత సేవ చేయాలనే మానవత దృక్పధంతో కార్యక్రమబా లు నిర్వహిస్తున్నామని ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేసి భోజనాలు చేయ డం అరుదుగా జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నేతలు మనోధైర్యం కొల్పోవద్దు

**ప్రజాపక్షం/కొత్తూరు :** రాజకీయాల్లో గెలుపు..ఓటములు సమానంగా భావిస్తూ మనోధైర్యం కొల్పోకుండా ఉండాలని, అప్పుడే కార్యకర్తలకు ధైర్యం ఉంటుందని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం కొత్తూరు మండల కేంద్రంలోని బిఆర్ఎస్ సీనియర్ నేత కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్‌లు కలిసి షాద్‌నగర్ మున్సిపాలిటి ఎన్నికల్లో ఓటమి చెందిన 2వ వార్డు చెట్ల నర్సింలు, 18వ వార్డు ప్రేమలత యుగేందర్, 27వ వార్డు జూపల్లి శంకర్‌ల నివాసాలకు వెళ్ళి కలిసి మనోధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయల్లో అనేక ఒత్తిడిలు ఉంటాయని, వాటన్నింటిని తట్టుకొని ఉంటేనే మనల్ని నమ్ముకున్న కార్యకర్తలు ధైర్యంగా ఉంటారని తెలిపారు. అధికార కాంగ్రెస్ పార్టీ నుండి ఇచ్చిన అనేక ఒత్తిడిలను తట్టుకొని ఈ స్థాయికి వచ్చారంటే గొప్ప విషయమని పేర్కొన్నారు. ధైర్యంగా ఉండాలి..వచ్చేది మన ప్రభుత్వమే..నేనున్నాను..మనోధైర్యం కొల్పోకుండా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.



# ట్రాఫిక్ కష్టాల విముక్తికి యాక్షన్ ప్లాన్

**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** రోజుకు లక్షా ముప్పై వేల మందికి పైగా రాకపోకలు సాగించే మాదాపూర్, హైటెక్ సిటీ ప్రాంతాల్లో ట్రాఫిక్ కష్టాలు తొలగించేందుకు జలమండలి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, పోలీసు, ఇరిగేషన్, విద్యుత్, టీజీఐఐసి కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగానే శనివారం సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి తదితరులు లెమన్ ట్రీ హోటల్ నుంచి శిల్పారామం వరకు జరుగుతున్న పనులను పరిశీలించారు. లెమన్ ట్రీ హోటల్ నుంచి ట్రిడెంట్ హోటల్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో.. అక్కడున్న ఎయిర్ వాల్వ్‌లను, ఎలక్ట్రిక్ పోల్స్ సమీపానికి తరలించేందుకు అధికారులతో చర్చించారు. అక్కడ్నుంచి హైటెక్ సిటీ నుంచి మెడికవర్ ఆసుపత్రి వరకు చెప్పాల్సిన రోడ్డు విస్తరణ పనుల గురించి చర్చించారు.
వాటిని సాధ్యమైనంత త్వ రగా పనులు పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఇదిలాఉండగా... దుర్గం చెరువు పరిరక్షణకు ప్రభుత్వం సిద్ధమైంది. చెరువులో మురుగు నీరు చేరి కలుషితం కాకుండా తగిన చర్య లు చేపట్టనుంది. అందులో భాగంగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు.. చెరువు పరిసరాలను జలమండలి ఎం డి అశోక్‌రెడ్డి, ఇడి సంతోష్, మున్సిపల్, హెచ్ఎండిఎ, లేక్స్, రెవెన్యూ, ఇరిగేషన్ విభాగాల అధికారులు పరిశీలించారు.



## ప్రజా సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఖైరతాబాద్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన స్థానిక నాయకులతో కలిసి ఖైరతాబాద్ డివిజన్ పరిధిలోని మహాభారత్‌నగర్, బిజెఆర్‌నగర్, ఇంద్రానగర్ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యలు, వీధి దీపాలు, సీసీరోడ్లు, రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. బిఆర్ఎస్ నేత ఎంజీఆర్ వెంట ఖైరతాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆనంద్, అంజన్ కుమార్, కృష్ణ, కుమార్, వినీత్ కుమార్, సురేందర్, అశోక్, చారి, ఉస్మాన్ తదితరులు ఉన్నారు.

## ఇందిరమ్మ క్యాంటీన్ ఏర్పాటు చేయాలి

తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగ జెపిసి డిమాండ్

**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** నిరుద్యోగులకు ఉపయుక్తంగా ఉండేలా చిక్కడపల్లి సిటీ సెంటర్ లైబ్రరీలో ఇందిరమ్మ క్యాంటిన్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగ జేఏసీ నేత డీ.సలీమ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన బల్దియా మాజీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతరెడ్డిని కలిసిన ఇందిరమ్మ అల్పాహార క్యాంటీన్‌ను ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ మేయర్ స్పందించి వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి ఒక వారం రోజుల్లో చిక్కడపల్లి సిటీ సెంటర్ లైబ్రరీలో ఇందిరమ్మ అల్పాహార క్యాంటీన్ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. మాజీ డిప్యూటీ మేయర్‌ను కలిసినవారిలో నిరుద్యోగ జేఏసీ నాయకులు డీ.సలీమ్, రవి, ఎం.మధు, అశోక్, శ్రీధర్, కే.ప్రసాద్, వీ.శ్రీను తదితరులు ఉన్నారు.



## సత్తా చాటిన విశ్వ వసాని



**ప్రజాపక్షం/కార్వాన్:** సౌదీ అరేబియాలోని అల్‌ఖాసిం వేదికగా జరిగిన ఏషియన్ రోడ్ పారాసైక్లింగ్ ఛాంపియన్షిప్2026లో భారత జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచింది. హైదరాబాద్ ఆదిత్య మెహతా ఫౌండేషన్లో శిక్షణ పొందిన 16 ఏళ్ల గుజరాత్‌కు చెందిన విశ్వ వసాని ఇండివిజువల్ టైమ్ ట్రయల్, 'రోడ్ రేస్' విభాగాల్లో రెండు రజత పతకాలు కైవసం చేసుకుంది.

## సిపిఎస్ రద్దు చేయాలి

ఎఐఎస్‌పిఎస్ఇఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మాచన రఘునందన్



**ప్రజాపక్షం/సనత్‌నగర్:** భాగస్వామ్య పింఛను పథకం(సిపిఎస్) రద్దు కావాలన్న తమ అభిమతం నెరవేరాలని కోరుతూ.. ఆంజనేయ స్వామిని వేడుకున్నట్టు ఆల్ ఇండియా న్యూ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి మాచన రఘునందన్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన సిపిఎస్ రద్దు కోసం ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా రఘునందన్ మాటాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు సిపిఎస్ రద్దు చేయండి మహాప్రభో.. అని పాలకులను ప్రార్థిస్తున్నా ఫలితం లేదన్నారు. అందుకే తమ మనోభీష్ట సిద్ధి కోసం ఆంజనేయ స్వామికి ప్రార్ధన చేసినట్టు రఘునందన్ చెప్పారు.

## కులాంతర వివాహాలు ప్రోత్సహించాలి

పలువురు వక్తల పిలుపు

**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** కులాంతర, మతాంతర వివాహితులను... ఆదర్శ భారతీయులు'గా గుర్తించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఈ మేరకు ప్రేమికుల రోజును పురస్కరించుకుని కుల, మతాంతర వివాహాలు చేసుకున్న దంపతులకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు విభాగం ప్రిన్సిపల్ సి.కాశీం మాట్లాడుతూ... కులాంతర, మతాంతర వివాహాల పరిరక్షణకు ఒక సమగ్రమైన చట్టం ప్రభుత్వపరంగా తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్.వినయ్ కుమార్ మాట్లాడుతూ... ఫిబ్రవరి 14న లోకమంతా ప్రేమను ఒక పూల గుచ్ఛంగానో.. గ్రీటింగ్ కార్డుగానో చూస్తుందేమో కానీ... మేము ప్రేమంటే సామాజిక సాంస్కృతిపై ఒక యుద్ధంగా చూస్తున్నామని తెలిపారు. అవాజ్ కార్యదర్శి ఎండి అబ్బాస్ మాట్లాడుతూ, కులాంతర, మతాంతర వివాహాలను ప్రోత్సహించేటట్లు జంటలకు ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం కనీసం రూ.5 లక్షల వరకు ఇవ్వాలని కోరారు. మూఢనమ్మకాల నిర్మూలన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి నరేష్ మాట్లాడుతూ, మనుస్మృతి అనే చీకట్ల కమ్ముకుంటున్న ఈ సమయంలో, కుల మతాంతర వివాహితులకు ఈ సభ పెద్ద భరోసాను కల్పించిందన్నారు. కార్యక్రమంలో కుల నిర్మూలన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వహిద్, కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి కార్యదర్శి స్కైలాబ్ బాబు, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, గుత్తా జ్యోత్స్న, మానవ వికాస సమితి అధ్యక్షుడు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



## ఓట్లు వేయలేదని రాత్రికి రాత్రే రోడ్డుకు అడ్డంగా నిర్మాణాలు

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన కాలనీ వాసులు




**ప్రజాపక్షం/షాద్‌నగర్:** మున్సిపల్ ఎన్నికల్లో తనకు ఓట్లు వేయలేదని రాజకీయ కక్షలు పెట్టుకొని ఏకంగా రోడ్డును బంద్ చేసి అడ్డంగా నిర్మాణాలు చేపట్టారని రాంనగర్ కాలనీ వాసులు వాపోతున్నారు. శనివారం షాద్‌నగర్ పట్టణ పోలీస్ స్టేషన్‌కు కాలనీ వాసులు చేరుకొని సిఐ విజయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుండి తనకు ఓటు వేయలేదని మాజీ కౌన్సిలర్ రాజేందర్ రెడ్డి రాంనగర్ కాలనీకి వచ్చి దౌర్జన్యం చేయడంతోపాటు ఏళ్ళ తరబడి ఉన్న రోడ్డుకు అడ్డంగా నిర్మాణాలు చేపట్టి రాకపోకలను నిలిపి వేశారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలుపు, ఓటములు సమానంగా భావిస్తూ ముందుకు వెళ్తేనే రాజకీయ భవిష్యత్ ఉంటుందని, కానీ ఓట్లు వేయలేదని ఇలాంటి దౌర్జన్యాలకు పాల్పడటం ఏమిటని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. రోడ్డుకు అడ్డంగా నిర్మించిన గోడను తొలగించడంతోపాటు తమకు రక్షణ కల్పించాలని రాంనగర్ కాలనీ వాసులు పోలీసులను వేడుకున్నారు. ఇదే విషయాన్ని సిఐ విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా రాంనగర్ కాలనీకి చెందిన వారు ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనని, మున్సిపల్ అధికారులతో మాట్లాడి తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. అప్పటి వరకు ఓపికగా ఉండాలని, ఏం జరిగిందనే విషయాలపై విచారణ చేస్తామని సిఐ విజయ్‌కుమార్ తెలిపారు.

## వీర జవాన్లకు ఘన నివాళి



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** పుల్వామ ఉగ్రవాదుల దాడుల్లో వీర మరణం పొందిన వీర జవాన్లకు న్యూ పవర్ కుంగ్‌ఫూ అకాడమీ ఆధ్వర్యంలో నివాళ్ళు అర్పించారు. శనివారం పట్టణంలో న్యూ పవర్ కుంగ్‌ఫ్యూ అకాడమీ ఆధ్వర్యంలో మాస్టర్ అహ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో వీర జవాన్ల చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా మాస్టర్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ వీర సైనికులు త్యాగాలను దేశం మరచిపోదని, దేశంలో ఉన్న ప్రతి భారతీయుడికి మీ శౌర్యం, త్యాగం, స్ఫూర్తినిస్తుందని అన్నారు. పుల్వామా దాడిలో మరణించిన వీర సైనికులు త్యాగాలను వెలకట్టలేమని, వారి త్యాగాలను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలని ఆకాంక్షించారు. న్యూ పవర్ కుంగ్‌ఫూ అకాడమీ విద్యార్థులు పాల్గొని నివాళ్ళు అర్పించారు.

## మహిళాభివృద్ధికి ముందువరుసలో ప్రభుత్వం

చేనేత హస్తకళ ఉత్పత్తుల మేళాను ప్రారంభించిన యూనియన్ మినిష్టర్ దత్తాత్రేయ, మంత్రి సీతక్కలు



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** మాదాపూర్‌లోని శిల్పారామంలో శ్రీమతి బెల్లం మాధవి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం,మహిళా సాధికారత పెంపోందించడానికి తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్, సావిత్రి భాయ్ విమెన్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాహిళా పారిశ్రామిక వేత్తల చేనేత హస్తకళ ఉత్పత్తుల మేళా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ గవర్నర్, యూనియన్ మినిష్టర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కలు విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళా పారిశ్రామిక వేత్తల అభివృద్ధికి మహిళల సాధికారత పెంపోందించడానికి తెలంగాణ ప్రభుత్వం ఎల్లపుడు ముందుంటుందని తెలంగాణ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు.
మహిళలను అన్ని రం గాలలో ప్రోత్సహించి వారి అభివృద్ధికి కృషి చే స్తామన్నారు. తదుపరి శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా ప్రతి ఒక్క స్టాల్‌ను యూనియన్ మినిష్టర్ బండారు దత్తాత్రేయ, మంత్రి సీతక్క లు కలియ తిరుగుతూ సందర్శించారు. ఈ హస్తకళ ప్రదర్శన వారం రోజులు పాటు నిర్వహిస్తున్నామని నిర్వహకులు తెలిపారు.

# మున్సిపల్ చైర్మన్ పీఠం కోసం క్యాంపు రాజకీయాలు

- గెలిచిన గంట తరువాతే కౌన్సిలర్లను తరలించిన ప్రధాన పార్టీలు
- షాద్‌నగర్‌లో వాడివేడీగా సాగుతున్న మున్సిపల్ రాజకీయాలు

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** మున్సిపల్ చైర్మన్ పీఠం దక్కించుకునేందుకు క్యాంపు రాజకీయాలు జోరందుకున్నాయి. ప్రమాణ స్వీకారం చేసేందుకు రెండు రోజుల సమయం ఉన్న నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బిఆర్ఎస్ నేతలు ఎవరికి వారే ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలోని 28వార్డులకు అధికార కాంగ్రెస్ పార్టీకి 15కౌన్సిలర్ స్థానాలు రాగా ప్రతిపక్ష బిఆర్ఎస్‌కు 11స్థానాలు, స్వతంత్ర అభ్యర్థిగా ఒకరు, బిజెపి నుండి ఒకరు చొప్పున ఎన్నికల్లో విజయం సాధించారు. అధికార కాంగ్రెస్ పార్టీకి ఏ రాజకీయ పార్టీ మద్దలు లేకుండా ఏకగ్రీవంగా చైర్మెన్, వైస్ చైర్మన్ చేసే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయి. కానీ ప్రతిపక్ష బిఆర్ఎస్‌కు 11కౌన్సిలర్ స్థానాలు రాగా స్వతంత్ర అభ్యర్థిని సైతం వారివైపు తిప్పుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. దాంతోమ మొత్తం 12 స్థానాలకు చేరుకుంది. అయితే పట్టభద్రుల ఎమ్మెల్సీ నుండి ఒక ఓటు, స్థానిక సంస్థల నుండి మరోక ఓటు రాగా మహబూబ్‌నగర్ ఎంపిని సైతం తమ వైపు తిప్పుకునేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయాలను తెలుసుకున్న అధికార కాంగ్రెస్ పార్టీ తమ 15మంది కౌన్సిలర్ అభ్యర్థులను రాత్రికి రాత్రే క్యాంపులకు తరలించి ప్రతిపక్ష పార్టీ బిఆర్ఎస్ నుండి ముగ్గురు కౌన్సిలర్లను తీసుకునేందుకు యత్నించగా అందులో ఇద్దరు ఒప్పుకున్నట్లు తెలుస్తుంది. అయితే బిజెపి కౌన్సిలర్‌కు ప్రతిపక్ష పార్టీ బిఆర్ఎస్ పెద్ద ఎత్తున ఆఫర్ ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. వీరు ఇచ్చిన ఆఫర్‌కు ఒప్పుకొకుండా నిరాకరించినట్లు సమాచారం. అధికార పార్టీకి పూర్తి స్థాయిలో మెజార్టీ వచ్చినప్పటికి క్యాంపు రాజకీయాలు ఎందుకు చేస్తున్నారోనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీ బిఆర్ఎస్ ఎన్ని జిమ్మిక్కులు చేసినా చైర్మెన్, వైస్ చైర్మెన్ పీఠాలను మాత్రం కాంగ్రెస్ చేస్తుందని పేర్కొన్నారు. 15కౌన్సిలర్ స్థానాలకు తొడు ఎమ్మెల్యే ఓటు సైతం జత కావడంతో మాజీక్ ఫీగర్ దాటి నిండుకోరంతో ప్రమాణ స్వీకారం చేయడమే కాకుండా చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నికను సైతం నిర్వహించేందుకు అధికార కాంగ్రెస్‌కు అవకాశాలు ఉన్నాయి. అయితే అధికార కాంగ్రెస్ పార్టీని నుండి ఒక కౌన్సిలర్‌ను తీసుకునేందుకు బిఆర్ఎస్ నేతలు మతనాలు సాగిస్తున్నట్లు తెలుస్తుంది. బిఆర్ఎస్ నేతలు పెట్టిన కండీషన్లకు ఒప్పుకున్నప్పటికి చైర్మెన్ సీటు తనకు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో నేతలు సందిగ్దంలో పడ్డారు. మున్సిపల్ చైర్మెర్ పీఠం కోసం బిఆర్ఎస్ నేతలు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది.

### మున్సిపల్ చైర్మన్ సీటు అందె మోహన్‌కు వచ్చే అవకాశం

షాద్‌నగర్ మున్సిపల్ చైర్మెన్ సీటు ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన అందె మోహన్ ముదిరాజ్‌కు ఇచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. చైర్మెన్ సీటు సీనియర్ నాయకుడు అగ్గనూరి బస్వంకు ఇవ్వాలా..లేక యువత అందె మోహన్‌కు ఇవ్వాలా అనే అలోచనలో కాంగ్రెస్ అధిష్టానం ఉండిపోయింది. ఇప్పటికే ఒకసారి అగ్గనూరి కుటుంబానికి చైర్మెర్ సీటు ఇచ్చారని, ఈ సారి ముదిరాజ్ సామాజిక వర్గానికి వచ్చేందుకు అధిష్టానం నిర్ణయం తీసుకోవాలని పట్టణ వాసులు పేర్కొన్నారు.



షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు నమ్మిన బంటుగా ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో ఏ బాధ్యత ఇచ్చినా ముందుండి సక్సెస్ చేశారే తప్పా వెనుకడుగు వేయలేదని అంటున్నారు. అగ్గనూరి బస్వం కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేత అయినప్పటికి ఏ పార్టీ మారకుండా పని చేయడమే కాకుండా ఎమ్మెల్యే ఎన్నికల్లోనే బయటకు వచ్చారని, నమ్ముకొని పార్టీ అభివృద్ధి కోసం పనిచేసిన ముదిరాజ్ సామాజిక వర్గానికే చైర్మెన్ పదవి ఇస్తే బాగుంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఏది ఏమైనప్పటికి మున్సిపల్ చైర్మెన్ సీటు ఎవరికి ఇస్తారనే దానిపై చర్చలు జోరందుకున్నాయి.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
ఆదివారం
15-02-2026
www.prajapaksham.in

“ ప్రముఖ సోషల్ మీడియా ఇన్ ఫ్లూఎన్సర్ యామినీ ఈఆర్ ను హీరోయిన్ గా పరిచయం అవుతున్నారు. డైరెక్టర్ రతన్ రిషి ప్రస్తుతం తన మూడో చిత్రంగా యామినీ ఈఆర్ తో 'క్వీన్' సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాను వన్ సర్కిల్ ఫిలింస్ బ్యానర్ నిర్మిస్తోంది. ”

# రీల్

## రోషన్ తాజా చిత్రం 'ఏమో ఏమో ఇది'



దర్శకుడు డా. శైలేష్ కొలను, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నాగవంశీ సరికొత్త రొమాంటిక్ కామెడీ సినిమా కోసం చేతులు కలిపారు. రోషన్ మేకా, ప్రీతి ముకుందన్ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి 'ఏమో ఏమో ఇది' అనే ఆసక్తికరమైన టైటిల్ ను ఖరారు చేశారు. ప్రేమికుల దినోత్సవం కానుకగా టైటిల్ తో పాటు గ్లింప్స్ ను ఆవిష్కరించారు.ఏమో ఏమో ఇది అనే టైటిల్ వినగానే ఉల్లాసమైన ప్రేమ భావనలు మనసులో మెదులుతున్నాయి. విడుదల చేసిన గ్లింప్స్ లో తండ్రి-కొడుకుల మధ్య సరదా సంభాషణతో ప్రారంభమవుతుంది. నవ తరం ప్రేమ బంధాలు, ఆధునిక వివాహాలు వంటి అంశాలను వినోదాత్మకంగా చూపించారు. గ్లింప్స్‌లో కథానాయిక తన ప్లేలిస్ట్ లోని అలనాటి క్లాసిక్ పాటను ఆస్వాదిస్తూ కనిపిస్తుంది. 'హిట్' సినిమాతో గుర్తింపు పొందిన దర్శకుడు శైలేష్ కొలను, ఏమో ఏమో ఇది ద్వారా పూర్తిగా కొత్త జానర్‌లో అడుగుపెడుతున్నారు. . ఇంతకు ముందు యాక్షన్‌తో కూడిన ఉత్కంఠభరిత ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్లను అందించిన ఆయన, ఇప్పుడు హృద్యమైన, హాయిగా సాగే, సరదాగా నవ్వించే సరికొత్త ప్రేమ కథను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు.అభయ్ పాత్రలో రోషన్ మేకా నటిస్తున్నారు. తొలి చిత్రం 'పెళ్లి సందడి' ద్వారా ఆకట్టుకున్న ఆయన, ఇటీవల 'ఛాంపియన్' సినిమాతో విజయాన్ని అందుకున్నారు. ఇప్పుడు 'ఏమో ఏమో ఇది' చిత్రంలో ప్రేమను ఆవిష్కరించే పక్కింటి అబ్బాయి తరహా ఆకర్షణీయమైన పాత్రలో రోషన్ కనిపించనున్నారు. అపూర్వ పాత్రలో ప్రీతి ముకుందన్ కనిపించనున్నారు. అపూర్వ పాత్రలో సహజత్వం కనిపిస్తూ తెలుగు ప్రేక్షకుల హృదయాలను దోచుకోవడానికి సిద్ధమవుతున్నారు.ఈ చిత్రానికి హేషామ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తుండటం అదనపు ఆకర్షణ. గ్లింప్స్ లోనే తనదైన నేపథ్య సంగీతంతో మాయ చేశారు. మరింత అందంగా తీర్చిదిద్దాయి. నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్యలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో ఈ సినిమా రూపొందుతోంది. ఈ ఏడాది దసరాకు ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## 'మొదలే మొదలే' పాట ఆవిష్కరణ



హీరో శ్రీ విష్ణు 'విష్ణు విన్యాసం' అనే సినిమాతో అలరించబోతున్నారు. నూతన దర్శకుడు యదునాథ్ మారుతి రావు ఈ చిత్రానికి దర్శకత్వం. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుమంత్ నాయుడు జి నిర్మించిన ఈ చిత్రాన్ని హేమ, షాలిని సమర్పిస్తున్నారు, సుబ్రహ్మణ్యం నాయుడు జి, రామచారి ఎం సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.ఈ సినిమా టైటిల్ గ్లింప్స్, ఫస్ట్ సింగిల్ 'దేఖో విష్ణు విన్యాసం'కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా సెకండ సింగిల్ మొదలే మొదలే సాంగ్ రిలీజ్ చేశారు. సంగీత దర్శకుడు రథన్ ఈ సాంగ్ ని బ్యూటీఫుల్ లవ్ మెలోడీగా కంపోజ్ చేశారు.రామజోగయ్య శాస్త్రి రాసిన సాహిత్యం లవ్ ఫీలింగ్ ని అందంగా ప్రజెంట్ చేసింది. మధుశ్రీ, నరేష్ అయ్యర్ వోకల్స్ మరింత మెలోడీని యాడ్ చేశాయి.ఈ సాంగ్ లో శ్రీ విష్ణు, నయన సారిక కెమిస్ట్రీ లవ్లీగా ఆకట్టుకుంది. వాలెంటైన్స్ డే కి పర్ఫెక్ట్ గిఫ్ట్ గా ఈ సాంగ్ నిలుస్తోంది. ఈ చిత్రంలో సత్య, బ్రహ్మాజీ, ప్రవీణ్, మురళి శర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, సత్యం రాజేష్, శ్రీనివాస్ వడ్లమాని, గోపరాజు రమణ కీలక పాత్రలు పోషిస్తున్నారు.ఈ చిత్రానికి సాయి శ్రీరామ్ సినిమాటోగ్రఫీని అందించగా, ఎ. రమణాంజనేయులు ఆర్ట్ డైరెక్టర్, కార్తికేయన్ రోహిణి ఎడిటర్ గా వ్యవహరిస్తున్నారు.ఈ చిత్రాన్ని త్వరలోనే థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## 'హే భగవాన్' నవ్విస్తుంది

### ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి



హే భగవాన్ అనే ఫుల్‌లెంగ్త్ అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్న. ఈ చిత్రంలో సుహాస్, శివానీ నగరం, సీనియర్ నటుడు నరేష్, యాంకర్ స్రవంతి ప్రముఖ పాత్రల్ని పోషించారు. గోపీ అచ్చర దర్శకత్వంలో త్రిశూల్ విజనరీ స్టూడియోస్ పతాకంపై బి.నరేంద్ర రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ మూవీని ఫిబ్రవరి 20న రిలీజ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నిర్మాత వంశీ నందిపాటి మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు.హేభగవాన్.. ఎంటర్‌టైన్‌మెంట్ సినిమా.. స్టోరీ లెవల్ నుంచి ఈ ప్రాజెక్టులో ఉన్నాను. ప్రజెంటర్‌గా ఉన్నాను. ఈ సినిమా పాయింట్‌లో ఫన్ ఉంటుంది. సినిమాలో బిజినెస్ అనేది ఒక ఎలిమెంట్ ఉంది. ఒక కొడుకు తన తండ్రి గురించి అర్థం చేసుకోవడానికి ఆ ఎలిమెంట్ ఉపయోగపడుతుది. ఫన్ ప్లస్ ఎమోషన్ ఈ సినిమాలో ఉంటుంది. ప్రతి ఒక్కరిని కడుపుబ్బ నవ్వించడంతో పాటు హృదయానికి హత్తుకునే సినిమా ఇది. సినిమాలో ఫాదర్ పాత్ర పేరు భగవాన్ అందుకే హే భగవాన్.. టైటిల్ పెట్టాం. అయితే తాజాగా సెన్సారు అభ్యంతరం వల్ల టైటిల్ మారే అవకాశం ఉంది. సెన్సిటివ్ టైటిల్ అంటున్నారు. సెన్సారు బోర్డు వాళ్లతో చర్చలు జరగుతున్నాయి. ఒకవేళ హే భావన్‌గా మారే అవకాశం ఉంది. గత కొంతకాలం నుంచి సుహాస్ ఎదురుచూస్తున్న కమర్షియల్ సక్సెస్ ఈసినిమాతో సాధించబోతున్నాడు. ఖచ్చితంగా ఆయన కెరీర్‌లో ఇది బిగ్గెస్ట్ కమర్షియల్ హిట్‌గా నిలుస్తుంది. ఈసినిమా ఆయన కెరీర్‌లో మైలురాయిగా నిలుస్తుంది. లిటిల్ హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయ్ తరువాత చిన్న సినిమాలు పెరిగాయి. ఇటీవల ఛాంబర్‌లో ఒక నెలలోనే 300 సినిమాల టైటిల్స్ రిజిష్టర్ అయ్యాయి. ఒటిటిబిజినెస్‌లు కావడం లేదని ఓ క్లారిటీ వచ్చింది. అయితే కేవలం ఒటిటి కోసం కూడా చేసే సినిమాలు పెరిగాయి.పొలీమేర3 ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. ఏప్రిల్ లేదా మేలో ప్రారంభిస్తాం. హిందీలో మినహా దక్షిణాది సినిమాల్లో విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నాం. ఈ సినిమాకు లీడ్ రోల్‌లో ఎవరైనాస్టార్ యాడ్ అయితే బాగుంటుంది అనుకున్నాం. త్వరలోనే తెలియజేస్తాం.ఈటీవీవిన్‌తో కలిసి ఓ ప్రాజెక్టు చేస్తున్నాను. ఈ నెల 27 అది అనౌన్స్‌మెంట్ చేస్తాను. ఈటీవీతో మరికొన్ని ప్రాజెక్టులు చేస్తున్నాను. శివాజీ సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని చిత్రాన్ని మార్చి 6న చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. ఈ చిత్రానికి సంబంధించి డిస్ట్రిబ్యూటర్‌గా సినిమాను విడుదల చేస్తున్నాను.

## ప్రేక్షకుల మధ్య కూర్చొని సినిమా చూశాం

### హీరోయిన్ ఎస్తేర్

శివ కంఠంనేని, ధన్య బాలకృష్ణ, ఎస్తేర్, సుప్రిత, హరీష్ ప్రధాన పాత్రల్లో నటించిన 'అమరావతికి ఆహ్వానం' సినిమా ఫిబ్రవరి13న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ చిత్రాన్ని డైరెక్టర్ జీవీకే తెరకెక్కించారు. ప్రముఖ నిర్మాత ముప్పా వెంకయ్య చౌదరి నిర్మాణ సారథ్యంలో జి. రాంబాబు యాదవ్ సమర్పణలో లైట్ హౌస్ సినీ మ్యాజిక్ బేనర్‌పై కేఎస్ శంకర్‌రావు, ఆర్ వెంకటేశ్వర రావు నిర్మించారు. 'అమరావతికి ఆహ్వానం'కు ప్రేక్షకుల నుంచి సూపర్ హిట్ టాక్ వస్తున్న నేపథ్యంలో ఈ సినిమా సక్సెస్ మీట్ ను నిర్వహించి టీమ్ కేక్ కట్ చేసి, బాణాసంచా పేల్చి సంతోషంగా సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో హీరోయిన్ ఎస్తేర్ మాట్లాడుతూ మా అమరావతికి ఆహ్వానం సినిమా గురించి ఇన్ని రోజులు మేము చెబుతూ వచ్చాం. ప్రేక్షకుల మధ్య కూర్చుని సినిమా చూశాం. చాలా మంచి రెస్పాన్స్ వస్తోంది. మీడియా, ప్రేక్షకులే కాదు ఇండస్ట్రీలోని వారు కూడా మా సినిమా గురించి బాగా పాజిటివ్ గా చెబుతున్నారు. మూవీలో మేమంతా బాగా నటించామని అంటున్నారు. వాలెంటైన్స్ డే, వీకేండ కూడా వస్తోంది. మీరంతా మా సినిమాను చూసి మీ అభిప్రాయాలు తెలియజేయండి. అలాగే ఇంకా చూడని వారుంటే తప్పకుండా థియేటర్స్ లో మా మూవీ చూడాలని కోరుతున్నాం అన్నారు.హీరోయిన్ ధన్య బాలకృష్ణ మాట్లాడుతూ 'అమరావతికి ఆహ్వానం' సినిమాకు ప్రతి ఒక్కరూ తమ పూర్తి ఎఫర్ట్స్ పెట్టారు. సినిమాలో నేను చాలా బాగా కనిపించానంటూ ప్రశంసలు వస్తున్నాయి. మా మూవీ చూడండి మీరు ఎంటర్ టైన్ అవుతారు, హారర్ ఎలిమెంట్స్ థ్రిల్ చేస్తాయి అన్నారు. ఈ ప్రెస్ మీట్ లో డైరెక్టర్ జీవీకే, డిఓపి ప్రభాకర్ రెడ్డి ,మ్యూజిక్ డైరెక్టర్ పద్మనాభ్ భరద్వాజ్, హీరో శివ కంఠంనేని పాల్గొన్నారు.



## ఒత్తిడి సహజం

### హీరో విశ్వక్ సేన్



ప్రేమికుల దినోత్సవం కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'ఫంకీ' చిత్రం థియేటర్లలో నవ్వుల వర్షం కురిపిస్తూ, అన్ని వర్గాల ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంటోంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం సక్సెస్ ప్రెస్ మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా హీరో విశ్వక్ సేన్ మాట్లాడుతూ సినిమా విడుదలకు ముందు ఒత్తిడి ఉండటం సహజం. కానీ నేను ఫంకీ విడుదలకు ముందు చాలా ప్రశాంతంగా ఉన్నాను. ఉదయం శ్రీరాములు థియేటర్ లో ప్రేక్షకులతో కలిసి సినిమా చూశాను. కుటుంబంతో కలిసి హాయిగా నవ్వుకునేలా అనుదీప్ ఈ సినిమాని తెరకెక్కించాడు. ఫంకీ చిత్రం నాకెంతో ఊరటనిచ్చింది. అన్ని వర్గాల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది. నా సినీ ప్రయాణంలో ఫంకీ లాంటి సినిమా చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది అన్నారు.కథానాయిక కయాదు లోహార్ మాట్లాడుతూ ప్రేక్షకులు ప్రతి జోక్ ని ఎంజాయ్ చేస్తూ నవ్వడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. దర్శకుడు అనుదీప్, నిర్మాత సూర్యదేవర నాగవంశీ పాల్గొన్నారు.

## కాలేజీలో స్టూడెంట్స్ నడుమ 'పురుష'



బత్తుల సరస్వతి సమర్పణలో కళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద బత్తుల కోటేశ్వరరావు నిర్మిస్తున్న కొత్త సినిమా 'పురుష:'. పక్కా ఫ్యామిలీ కథతో వినూత్నంగా ఎంటర్టైన్ చేయడానికి 'పురుష:' సినిమా రా బోతోంది. వీరు వులవల దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంతో పవన్ కళ్యాణ్ బత్తుల హీరోగా పరిచయం కాబోతున్నారు. హాసిని సుధీర్, రాయంచ కొక్కురి, విశిక, సప్తగిరి, కసిరెడ్డి రాజకుమార్ ముఖ్య పాత్రలలో కనిపించనున్నారు. ఈ క్రమంలోనే తాజాగా పురుష నుంచి చాటు చాటు అనే లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. సికింద్రాబాద్ లోని కస్తూర్బా ఉమెన్స్ డిగ్రీ అండ పీజీ కాలేజీలో స్టూడెంట్స్ నడుమ ఈ సాంగ్ రిలీజ్ చేయడం జరిగింది. చిన్మయి శ్రీపాద పాడిన ఈ పాటకు అనంత శ్రీరామ్ లిరిక్స్ అందించగా.. శ్రవణ్ భరద్వాజ్ బాణీలు కట్టారు. చాటు చాటు అంటూ ఆకట్టుకునే మెలోడీ ట్యూన్‌తో సాగిపోతున్న ఈ పాట ఆద్యంతం ఆకట్టుకుంటోంది. ఈ సినిమాకు ఎడిటర్‌గా కోటి, ఆర్ట్ డైరెక్టర్‌గా రవిబాబు దొండపాటి పని చేస్తున్నారు. చిత్రంలో వెన్నెల కిషోర్, వి.టి.వి.గణేష్, అనంత శ్రీరామ్, పమ్మి సాయి, మిర్చి కిరణ్ వంటి కమెడియన్స్ అందరినీ కడుపుబ్బా నవ్విస్తారని టీం చెబుతోంది. ప్రస్తుతం ఈ సినిమాకి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన రిలీజ్ డేట్ ప్రకటించనున్నారు.

# మొబైల్ ఎరువుల బుకింగ్ యాప్‌తో రైతులకు భారీ ఊరట

### రాష్ట్రవ్యాప్తంగా 12.73 లక్షల మంది రైతులు వినియోగం

### 50.48 లక్షల యూరియా సంచులు బుకింగ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎరువులు సమయానికి, నిజమైన సాగుదారులకే చేరేలా చేయడం ప్రధాన లక్ష్యంగా ఐటీ ఆధారిత పరిష్కారంగా మొబైల్ ఎరువుల బుకింగ్ యాప్‌ను ప్రవేశపెట్టింది. డీలర్ దుకాణాల వద్ద నిల్వల కొరత కారణంగా ఏర్పడే భారీ రద్దీ పరిస్థితులను నివారించేందుకు ఈ యాప్ ఉపయోగపడుతోంది. ఈ యాప్ ద్వారా రైతులు డీలర్ల వద్ద అందుబాటులో ఉన్న యూరియా నిల్వలను రియల్ టైమ్‌లో తెలుసుకుని ఇంటి నుంచే యూరియాను బుక్ చేసుకునే సౌకర్యం పొందుతున్నారు. దీంతో దుకాణాల వద్ద వేచి ఉండే సమయం తగ్గడంతో పాటు రద్దీ పరిస్థితులు గణనీయంగా తగ్గాయి. రైతు బుక్ చేసుకునే యూరియా సంచుల సంఖ్య పంట రకం, సాగు విస్తీర్ణం, వ్యవసాయ విశ్వవిద్యాలయం సూచించిన శాస్త్రీయ ప్రమాణాల ఆధారంగా నిర్ణయించబడుతోంది. అర్హత ఉన్న మొత్తం పరిమాణాన్ని విడతల వారీగా విడుదల చేయడం ద్వారా 'స్ప్లిట్ డోస్ అప్లికేషన్' పద్ధతిని అమలు చేస్తున్నారు. దీని వల్ల ఎరువుల వినియోగ సామర్థ్యం పెరగడంతో పాటు పంటల దిగుబడులు మెరుగుపడుతున్నాయి.


**పట్టాదారు పాసు బుక్ ఆధారంగా..**

పట్టాదారు పాసు బుక్ కలిగిన రైతులు, అటవీ హక్కుల చట్టం లబ్ధిదారులు, భూమిని నిజంగా సాగు చేస్తున్న కౌలు రైతులు మాత్రమే యాప్ ద్వారా యూరియాను బుక్ చేసుకునేలా నిబంధనలు అమలు చేస్తున్నారు. దీంతో ఎరువులు నిజమైన రైతులకే చేరేలా పర్యవేక్షణ కొనసాగుతోంది. మొదట ఐదు జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన ఈ యాప్‌ను విజయవంతమైన తర్వాత రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు విస్తరించారు. ప్రారంభంలో జిల్లా యూనిట్‌ను బుకింగ్ యూనిట్‌గా నిర్ణయించగా, ఫీల్డ్ స్థాయి అవసరాల మేరకు మండలం లేదా మండలాల సమూహాన్ని యూనిట్‌గా నిర్ణయించడం ద్వారా సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేశారు. ఉన్నత స్థాయి అధికారుల నుంచి ఫీల్డ్ స్థాయి అధికారుల వరకు యాప్ అమలును నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే సమస్యలను సకాలంలో పరిష్కరిస్తూ అవసరమైన సవరణలు చేస్తున్నారు. ఈనెల 14 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 12,73,626 మంది రైతులు యాప్ ద్వారా 50,48,977 యూరియా సంచులు బుక్ చేసుకున్నారు. వీటిలో 46,13,158 సంచులు ఇప్పటికే రైతులు కొనుగోలు చేశారు.

**జిల్లాల వారీగా వివరాలు..**

జిల్లాల వారీగా చూస్తే నల్లగొండ జిల్లాలో అత్యధికంగా 1,66,704 మంది రైతులు 7,58,949 సంచులు బుక్ చేసుకోగా, జగిత్యాల జిల్లాలో 5,08,884 సంచులు బుక్ అయి పూర్తిగా కొనుగోలు చేయడం విశేషం. సూర్యాపేట, ఖమ్మం, జనగాం, పెద్దపల్లి జిల్లాల్లో కూడా గణనీయ స్థాయిలో బుకింగ్ నమోదైంది. రైతుల ప్రయోజనాలే ప్రధాన లక్ష్యంగా యాప్ అమలును ప్రభుత్వం కొనసాగిస్తోంది. క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ మరింత సమర్థవంతమైన ఎరువుల సరఫరా దిశగా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.








### నాంపల్లి స్టేషన్ పునరాభివృద్ధి పనులపై

# జిఎం సుడిగాలి తనిఖీ

### ప్రయాణికుల అసౌకర్యం తగ్గించేలా చర్యలు తీసుకోవాలి

### అధికారులకు ఆదేశాలు జారీ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ శనివారం హైదరాబాద్ (నాంపల్లి) రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పునరాభివృద్ధి పనులను సమగ్రంగా తనిఖీ చేశారు. స్టేషన్ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని స్వయంగా పరిశీలిస్తూ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో సికింద్రాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ డాక్టర్ ఆర్.గోపాలకృష్ణన్ సహా పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు. రూ.327.27 కోట్ల వ్యయంతో అమృత్ స్టేషన్ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులపై డివిజనల్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పునరాభివృద్ధి పనులు జరుగుతున్న ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించిన జిఎం, ప్రాజెక్టును నిర్ణీత గడువులో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా పనుల కారణంగా ప్రయాణికులకు కలుగుతున్న ఇబ్బందులను తగ్గించేలా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

భవిష్యత్తులో స్టేషన్‌లో అందుబాటులోకి రానున్న ఆధునిక వసతులు ప్రయాణికులకు ఉపయోగపడేలా పనుల నాణ్యతను కచ్చితంగా పాటించాలని అధికారులకు చెప్పారు. అనంతరం స్టేషన్ పశ్చిమ వైపున ఉన్న క్యారేజ్ మెయింటెనెన్స్ డిపోను కూడా ఆయన పరిశీలించారు. డిపోలో నిర్వహణ, సిబ్బంది సౌకర్యాలు, భద్రతా చర్యలపై సమీక్ష నిర్వహించారు. సిబ్బందితో మాట్లాడి పనిలో పాటిస్తున్న భద్రతా ప్రమాణాల గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ తనిఖీతో నాంపల్లి స్టేషన్ పునరాభివృద్ధి పనులు వేగం పుంజుకునే అవకాశముందని రైల్వే వర్గాలు తెలిపాయి.






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com